సాహిత్య

# ప్రస్థానం

ఫిబ్రవరి 2010

వెల రూ. 10



# మగ్దూం మొహియుద్దీన్

(4.2.1908 - 24.8.1969)




మగ్దూం మొహియుద్దీన్ కవిగా, కార్మికనేతగా సుపరిచితులు. నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నందుకు ఆయన జైలుపాలయ్యారు. జైల్లో ఉన్నా ఆయన కవితా సృజన కొనసాగించారు. అటు కవిత్వం ఇటు కార్యాచరణ రెండింటి సమ్మేళనం మగ్దూం.

సాహిత్య
ప్రస్థానం
సంపుటి : 8 ఫిబ్రవరి 2010 సంచిక : 50

# సాహిత్యకారులు-సవాళ్ళు

**ఇ**టీవల రాష్ట్రంలో పలుచోట్ల సాహిత్య సభలూ సంరంభాలూ సాగుతున్నాయి. వాటిలో కొన్నింటి నివేదికలు ఈ సంచికలో వున్నాయి కూడా. వివిధ రూపాల్లో సాహిత్య సమీకరణలూ సృజనలూ జరగడం ఆహ్వానించదగిందే. అదే సమయంలో ఈ సభలూ సంరంభాలూ పాలక వర్గాల ప్రాపకంతో సంపన్న శ్రేణుల వరవడిని పట్టకుండా సామాన్యుల పక్షం తీసుకోవడం చాలా అవసరం. సదుపాయాల కోసమో సత్కారాల కోసమో ప్రచారం కోసమో వెంపర్లాడడం మొదలైతే సాహిత్య లక్ష్యమే దారి తప్పిపోతుంది.

.......

అలాగే రాష్ట్రంలో ప్రాంతాల వారీగా సాగుతున్న ఉద్యమాల్లోనూ రచయితలూ కళాకారుల పాత్ర పదే పదే ప్రస్తావనకు వస్తున్నది. కొన్ని సార్లు వారి వాదనలే ప్రధానమన్న వాతావరణం కూడా కనిపిస్తోంది. పాలక పక్ష రాజకీయ వేత్తల వాదనలనే వీరు ప్రతిధ్వనించడం కొన్ని సార్లు వారిని మించి పోయి ఆ వాదనలు వినిపించడం చూస్తున్నాం. రచయితల భావ ప్రకటనా స్వేచ్ఛను క్రియాశీల పాత్రనూ హర్షిస్తూనే మరో వైపున సామాజిక స్పృహనూ వర్గ దృక్పథాన్ని వారు నిలబెట్టుకోవలసిన అవసరాన్ని కూడా గుర్తుంచుకోవలసి వుంటుంది. పాలకపక్షాల రాజకీయ క్రీడలూ గత చరిత్ర పాఠాలూ తాము గ్రహించడమే కాక ప్రజలకు తెలియజెప్పవలసిన బాధ్యత కూడా బుద్ధిజీవులైన రచయితలపై వుంటుంది. ఎక్కడైనా ఎప్పుడైనా ప్రజల దీర్ఘకాలిక శ్రేయస్సు కీలకం. ఏ వాద వివాదాల వెనక ఏ శక్తుల ప్రయోజనాలు వున్నాయనే అంశంలో ఆదమరుపు గాక అప్రమత్తత అవసరం.

.......

పురాణ నవల ద్రౌపదికి కేంద్ర పురస్కారం రావడంపై ఎడతెగని చర్చ జరుగుతున్నది. కొంతమంది అర్థరహితమైన విమర్శలు చేస్తుంటే మరికొందరు విచక్షణా రహితంగా కీర్తిస్తున్నారు. అందుకు సంబంధించిన కొన్ని కోణాలను ప్రస్తావించే వ్యాసం ఈ సంచికలో వుంది. ఇలాటి విషయాల్లో తులనాత్మకంగానూ పురోగామి దృష్టితోనూ పరిశీలన జరపడం చాలా అవసరం.

**బొమ్మలు : శేఖర్, శివాజి, లక్ష్మీనారాయణ, వెంకటేష్**

## ఈ సంచికలో...

| | |
|---|---|
| వలసలు (కథ) | 2 |
| కవిత | 7 |
| ద్రౌపది చర్చ : కొన్ని కోణాలు | 8 |
| రచనా నేర్పుగల కథకుడు చా.సో. | 10 |
| తడారని కవితాశోకం జాలరి జీవితం | 13 |
| ఇనుపతెరల మధ్య (కథ) | 17 |
| నల్గొండ జిల్లా వ్యావహారిక భాష | 21 |
| యుగాంతం (కథ) | 25 |
| కవిత | 28 |
| అడిగోపుల 'రంగులచీకటి' లోకం | 29 |
| కవిత | 31 |
| సమయం పట్టినా లక్ష్యాన్ని చేరుకుని తీరుతాం | 32 |
| దేశానికే తలమానికం దేశభక్తి గేయం | 36 |
| వచన కవిత్వంపై వర్క్‌షాప్ | 37 |
| కవులు సమాజ దిశానిర్దేశకులు కావాలి | 39 |
| డైరీ | 43 |
| కొత్త పుస్తకాలు | 47 |

సంపాదకవర్గం

**తెలకపల్లి రవి** *(సంపాదకుడు)*
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వీరప్రసాద్
ఎం.నరహరి

కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
**సాహిత్య ప్రస్థానం**
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

**కథ**

# వలసలు

## మేరెడ్డి యాదగిరి రెడ్డి



*వందేమాతరం.....*

*మా తెలుగుతల్లికి.....*

***భారతదేశము నా మాతృభూమి.... ప్రార్ధన ప్రతిజ్ఞ చదివి తెల్లని యూనిఫాం వేసుకున్న పిల్లలు ఒకరి వెనుక ఒకరు కొంగల బారుల్లా ఎవరి క్లాసురూమ్‌కు వాళ్లు వెళ్లారు. ఆ వెనుక, సుమలత, మంజుల టీచర్లు, స్వీపర్ హుస్సేన్ హెడ్‌మాస్టర్ రూమ్ వైపు నడిచారు. హెడ్‌మాస్టర్ సుందర్రావు ప్రార్దనకు రావడం ఎపుడోగాని జరుగదు. బయట వ్యవహారాలు పూర్తి చేసుకొని హీరోహోండా మీద వచ్చిన సుందర్రావు తన సీట్లో కూర్చున్నాడు. అల్మారా తాళం తీసి టీచర్లకిచ్చాడు. రిజిస్టర్‌లో సంతకం చేసిన సుమలత, మంజుల, పిల్లల హాజరు రిజిస్టర్లు తీసుకుని క్లాస్ రూమ్‌లకు నడిచారు.***

ఒకటి నుండి ఐదు తరగతులున్న కొండాపురం ప్రాథమిక పాఠశాల అది. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలగా చాలకాలం ఓ పూరి గుడిశేలో నడిచేది. ఆ వూరికి పాఠశాల మంజూరు కాగానే వూరివాల్లంతా కలసి వూరి బయట వున్న వూరమ్మడి 'చావిడి' భూమి అర ఎకరం స్థలంలో తాటికమ్మలతో ఓ పూరి పాక వేశారు. కృష్ణమూర్తి టీచర్‌గా వచ్చాక ఆ పాఠశాల రూపురేఖలే మారిపోయాయి.

పదిమంది పిల్లలున్న ఆ పాఠశాల పిల్లల సంఖ్య నూట అరవైయికి పెంచారు. చదువు ప్రాముఖ్యత గురించి గ్రామస్తులందరికి తెలియపరచాడు. జీతాలకు పొలం పనులకు పోయే పిల్లలందరిని బడిలో చేర్పించాడు. తాను అక్కడే వుండి తన పిల్లలు గూడా అదే బడిలో చదివించాడు. మంచి, చెడుకు అందరిని ఆదుకొని వాళ్లలో ఒకడుగా మారిపోయాడు. సాయంత్రం బడి వదలగానే పిల్లలకు ఆటలు పాటలు నేర్పించేవాడు. రాత్రి తనయింటికొచ్చిన పిల్లలకు, పెద్దలకు తన పిల్లలతో పాటు చదువు చెప్పేవాడు. ఎవరిదగ్గర ఏమీ తీసుకోకపోయేవాడు. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమంలో కొండాపురంలోని ఆడ, మగ పెద్ద వారందరిని అక్షరాస్యులుగా మార్చి అధికారులను ఆశ్చర్యపరచాడు. వూరిలో పండే కూరగాయలు, పాలు, పెరుగు, పప్పులు కృష్ణమూర్తి ఇంటికి వచ్చేవి.

ఆపరేషన్ బ్లాక్‌బోర్డు, డిపెప్, సర్వశిక్షా అభియాన్ కార్యక్రమాలలో భాగంగా పూరిగుడిసె స్థానంలో మూడు గదుల పాఠశాలగా మారింది. హెడ్‌మాస్టర్ రూమ్ అదనంగా ఏర్పాటయింది. అర ఎకరం స్థలం చుట్టూ ప్రహారిగోడ. బడిని ఆనుకోని ఓ వాగు. పాఠశాల ఆవరణ నిండా చల్లటి నీడనిచ్చే యాపచెట్లు, దిరిశెనచెట్లు నాటించాడు. కృష్ణమూర్తి ఒక్కొక్క పిల్లవానికి ఒక్కో చెట్టు పెంచే బాధ్యత వప్పచెప్పాడు. ఎండాకాలంలో వాగు ఎండిపోయినప్పుడు వాగులో చెలిమలు తీసి తను, స్వీపర్ పిల్లలు కలసి నీళ్ళుపోసి ఆ చెట్లను పెంచారు. ఆ చెట్లే ఇప్పుడు పాఠశాల ఆవరణంతా చల్లటి నీడనిస్తున్నాయి. క్లాసు రూమ్‌ల ముందు బంతి, పోకబంతి, పట్నంబంతి, రకరకాల పూలచెట్లు నాటించాడు. ప్రహారీ గోడకు మధ్యన కాగితపూల చెట్లు, బోరింగు దగ్గర బొడ్డుమల్లె చెట్లు పెంచాడు. పిల్లలకు బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లు కట్టించాడు. ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ఆ పాఠశాలను తీర్చి దిద్దాడు కృష్ణమూర్తి. చూపరులకు అది "శాంతినికేతనం"లా కన్పిస్తుంది.

అరవయిమంది పిల్లలుకాగనే రెండో టీచర్‌గా సుమలత వచ్చింది. విద్యార్థుల సంఖ్య వంద దాటగానే మూడో టీచర్‌గా మంజుల వచ్చింది. హెడ్‌మాస్టర్‌గా కృష్ణమూర్తి! కొండాపురం నుండి ఒక్క పిల్ల వాడు గూడా ప్రయివేటు పాఠశాలలకు వెళ్లలేదు. మండలంలో విద్యాశాఖ ఏ నూతన కార్యక్రమం, అమలు చేయలన్నా వారికి కనిపించేది కృష్ణమూర్తి టీచర్, కొండాపురం ప్రాథమిక పాఠశాలే. గోడలనిండా



Feb 2010 _Final_Pages.pmd 2 1/28/2003, 2:20 PM

బొమ్మలు, అక్షరమాలలు, నీతివాక్యాలు, ఐదు వేలకు తోడు కొన్ని చందాలు చేసి పిల్లలు కూర్చునేందుకు బెంచీలు చేయించాడు. ఆటపాటలతో పిల్లలంతా హాయిగా చదువుకునేవారు. పిల్లలకు ఆ బడి ఓ రంగుల హరివిల్లులా అనిపించేది.

కృష్ణమూర్తి కృషికి రెండో టీచర్‌గా వచ్చిన సుమలత తోడైంది. ఎలాంటి కార్యక్రమమయినా విజయవంతం చేసేందుకు తన శక్తి మేరా కృషి చేసేది. అస్తమానం స్కూలుకు వచ్చే పిల్లల గురించే ఆమె ధ్యాసంతా. ఎర్రటి కోలముఖం. చక్కటి పొడగాటి ముక్కు. నవ్వితే తలుక్కున మెరిసే పలువరస. పెదాలపై చెరగని చిరునవ్వు. వుంగరాల జుట్టు. నుదుట పొడగాటి తిలకం బొట్టు. పిల్లలను ఆడిస్తూ పాడిస్తూ పాఠాలు చెప్పేది. బడికి రాము మొర్రో అన్న పిల్లలు గూడా ఒక్కరోజు సుమలత పాఠం వింటేచాలు ఆయస్కాంతంలా బడికి వురుకుల పరుగుల మీద వచ్చేవారు. సుమలత ఒక్కరోజు బడికి రాకున్నా పిల్లలకేదో వెలితి.



పాఠశాలకు ఏ విద్యార్థి ఆబ్‌సెంటయినా పిల్లలను వెంట బెట్టుకుని సుమలత వాళ్లింటికి వెళ్లి వచ్చేది. శైలజ అనే అయిదో తరగతి అమ్మాయి వరుసగా నాలుగు రోజులు బడికి రాక పోయే సరికి సుమలత వాళ్లింటికి వెళ్లింది. కాపీలు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, లేవని తోటి పిల్లలంతా గోల చేస్తున్నారని మొరాయించి ఇంట్లో కూర్చుంది. తండ్రి రోగిష్టి మంచం మీద నుండి లేవడు. తల్లి కూలికి పోయి సంసారాన్ని లాక్కొస్తుంది. విషయం తెలుసుకున్న సుమలత రెండో రోజు తను వచ్చేటప్పుడు ఆ అమ్మాయికి కావలసిన పుస్తకాలు, కాపీలు, పెన్నులు కొనుక్కొచ్చి యిచ్చింది. ఆ అమ్మాయి ఆ సంవత్సరం నవోదయకు సెలక్టయి వెళ్లిపోయింది. చాలా మంది పేద పిల్లలకు, పుస్తకాలో, కాపీలో, పెన్నులో కొనిచ్చి తన చేతనయిన సాయం చేస్తూనేవుంది.

కృష్ణమూర్తికి ఆ పాఠశాలలో పదేండ్ల సర్వీసు పూర్తయింది. స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ వచ్చి వేరే స్కూలుకు పోస్టింగ్ వచ్చింది. కృష్ణమూర్తి పాఠశాల నుండి వెళ్ళిపోయే రోజు వూరంతా కదిలివచ్చింది. పూలదండలు, శాలువాలతో కృష్ణమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. చదువు విలువ తెలిపిన ఆ మాస్టర్ వూరు విడిచిపోతుంటే అందరి హృదయాలు బరువెక్కాయి. అందరి ముఖాల్లో ఏదో వెలితి. కొందరయితే తట్టుకోలేక బోరున ఏడ్చారు. కృష్ణమూర్తి వారిని సముదాయించి కొండాపురం విడిచాడు.

కృష్ణమూర్తి స్థానంలో వచ్చిన హెడ్‌మాస్టర్ సుందర్రావు. సుందర్రావు పేరుకు తగ్గవాడే. తెల్లటి బట్టలు నలుగనీయడు. వుంగరాల క్రాపు చెరగనీయడు. చాక్‌పీస్ పౌడర్ మీద పడనీయడు. యం.ఎస్.సి. యం.ఇ.డి. చేసిన తనలాంటివాడు ఈ బతుకలేని బడిపంతులుగా రావడం వేస్టనుకున్నాడు. అడుగడుగునా అతనిలో అహం తొంగిచూసేది. ఏ కార్పొరేటు కాలేజీలోనో లెక్చరర్‌గా వుండాల్సిన తను ఇందులో ఇరుక్కుపోయి సర్వం పోగొట్టుకున్నట్టు బాధపడేవాడు. తన తోటి వాళ్లు చాలా మంది అమెరికా వెళ్లి కోట్ల రూపాయిలు సంపాదిస్తున్నారు. ఇంకొందరు కార్పొరేట్ కాలేజీలల్లో లక్షలు సంపాదిస్తున్నారు. తనది మాత్రం గొర్రెతోక బెత్తడు జీతమే. టీచర్ వృత్తంటే ఆయనకున్న చులకన భావం అది.

ఆకాడికి రోజుకో గంటా బి.ఇ.డి కాలేజిలో గుట్టుచప్పుడు కాకుండా పనిచేస్తున్నాడు. ఫైనాన్సులల్లో పార్టనర్‌షిప్ వుంది. భార్య పేరు మీద యల్.ఐ.సి ఏజెన్సీ తీసుకుని తనే నడిపిస్తున్నాడు. రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తున్నాడు. హైదరాబాద్‌లో రియల్ భూమ్ వున్నపుడు ఏకంగా రెండు నెలలు సెలవు పెట్టి వ్యవహారం నడిపాడు. ఏలాగయినా డబ్బు సంపాదించాలనే తపన ఆయనకు. తన పిల్లలు తనలా కాకుండా ఐ.ఐ.టి చేయించి అమెరికా పంపించాలని ఆయన ఆశ.

సుందర్రావు పాఠశాలకు వచ్చినా ఎన్నడూ ఓ గంటసేపు పిల్లలకు పాఠాలు చెప్పింది లేదు. బెల్లు బిల్లు టైపు మనస్తత్వం. ఏ వంకతో బడి నుండి బయట పడదామనే ఆలోచనే. యం.డి.వో ఆఫీసులో పనుందనో, యం.ఇ.వో. రమ్మన్నాడనో, ట్రైనింగులనో, వర్క్‌షాపులనో బడికి ఎగనామం పెడుతుంటాడు. మంజుల ఒకటి, రెండు, మూడు సుమలత నాలుగు, ఐదు తరగతులు చెప్పుకొస్తున్నారు. సుందర్రావు రాని రోజు ఆ బడిలో పండుగే. ఆట పాటలతో ఆ బడి మార్మోగిపోతుంది.

సుమలత పిల్లలను తనచుట్టూ కూర్చోబెట్టుకుంది. "భారతదేశం... మనజన్మస్థలం.... తూర్పున బంగాళఖాతం.... ఉత్తరాన హిమాలయాలు.... " పాటందుకుంది. పిల్లలంతా శృతి కలిపారు. పిల్లలు కంజర, తాళాలు వాయిస్తూ టీచర్‌తో పాటు పాట పాడుతూ కూర్చున్నారు. శ్రావ్యమైన కంఠం సుమలతది. ఇంట్లో ఎన్ని సమస్యలున్నా సుమలత పిల్లలతో ఆడుతూ పాడుతూ పాఠాలు చెబుతుంది. మంజులది మూడోటైపు తన పనేంటో తను చేసుకుపోతుంది. యెందులో తలదూర్చదు. స్కూలు, ఇల్లు అంతే. కాకుంటే సుమలతతో కలివిడిగా వుంటుంది.

చాలారోజులుగా సర్వీసురూల్స్ ఓ కొలిక్కిరాక బదిలీలు, ప్రమోషన్లు ఆగిపోయాయి. ట్రిబ్యునల్లు, కోర్టు ఉత్తర్వులు, రాష్ట్రపతి ఉత్తర్వులు ఏవి అమలుగాక ఎటూ తేలక మూడడుగులు ముందుకు ఏడడుగులు వెనకకు అన్నచందంగా తయారయ్యాయి. అంతా గందరగోళం.

ఎట్టకేలకు ఉపాధ్యాయ సంఘం అందోళనలతో వారి సూచనమేరకు తాత్కాలిక పద్ధతిన, కోర్టు ఉత్తర్వులకు లోబడి వుంటాయని హామీ మేరకు బదిలీలు, ప్రమోషన్లు ప్రక్రియ చేపట్టింది ప్రభుత్వం. పనిలో పనిగా రేషనలైజేషన్ అమలుచేయాలని ప్రభుత్వం ఉత్తర్వు



Feb 2010 _Final_Pages.pmd 3 1/28/2003, 2:20 PM

జారీ చేసింది. ఒక దగ్గర పిల్లలు తక్కువ టీచర్లెక్కువ. ఇంకోదగ్గర పిల్లలెక్కువ టీచర్లు తక్కువ. అందుకు రేషనలైజేషన్‌తో ఈ వ్యత్యాసం సరిచేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు, ఎవరి యాజమాన్యంలో వారి బదిలీలు, ప్రమోషన్లు చేయాలని నిర్ణయించారు.

ఒకటి రెండు నెలలుగా ఉపాధ్యాయులంతా ఇదే పనిలో పడ్డారు. రేషనలైజేషన్ లీస్టులు ప్రమోషన్ల లీస్టులు, బదిలీల లీస్టులు, సీనియారిటీ ప్రకారం వున్నాయా లేదా సరి చూసుకుంటున్నారు. ఏ నలుగురు ఉపాధ్యాయులు కలిసినా ఇవే చర్చలు. కూడికలు, తీసివేతలు, జిల్లా విద్యాశాఖాధికార్యాలయం చుట్టూ సర్వీస్ బుక్స్‌తో ప్రదక్షిణలు.

సుందర్రావు బదిలీ కొరకు దరఖాస్తు చేసుకున్నాడు. హైదరాబాదు దగ్గరి మండలాలు పోచంపల్లి, తుర్కపల్లి, బీబీనగర్ మండలాలలోని ఏదేని పాఠశాలకు బదిలీ కావాలని ఆయన కోరిక. కుటుంబం హైదరాబాదులో పెట్టి ఇద్దరి కొడుకులను పేరెన్నిక గల కాన్సెప్ట్ స్కూల్లో ఐ.ఐ.టి కోచింగ్ ఇప్పించాలని ఆయన ఆశ.



సుందర్రావు స్కూలు నుండి నేరుగా యూనియన్ ఆఫీసుకు చేరుకున్నాడు. యూనియన్ ఆఫీసు సందడి సందడిగా వుంది. అప్పటికే అక్కడికి వచ్చిన టీచర్లు చాలామంది టేబుల్ మీద వున్న సీనియారిటీ లీస్టులో తమ నెంబరు చూసుకుంటున్నారు. ఎదురుగా ఎత్తైన కుర్చీ మీద యూనియన్ నాయకుడు సుదర్శన్‌రావు పేపరు చదువుతూ కూర్చున్నాడు. యూనియన్‌లో చురుకైనా పాత్ర సుందర్రావుది. తను పని చేసే మండల శాఖకు అధ్యక్షుడుగా పనిచేస్తున్నాడు. మాటలతో ఎదుటివారిని మాయచేయడంలో నేర్పరి. యూనియన్ ధర్నాలు, రాస్తారోకోలు, సమ్మెలు, మెంబరిషిప్ క్యాంపెయిన్‌లో ముందుంటాడు. యూనియన్ పనుల్లో సుదర్శన్‌రావుకు కుడి భుజంలా వుంటాడు సుందర్రావు.

'అన్నా.... " పక్కన కూర్చుని సుదర్శన్ రావును పిలిచాడు సుంద్రరావు.

'ఏంటి సుందర్. చెప్పు..... " పేపరు చదువుతూ సుదర్శన్ రావు తల పైకెత్తాడు.

'అన్నా నాకు పోచంపల్లి, బీబీనగర్... ప్లేసులో దొరుకుతాయా.'

'బదిలీ సీనియార్టీ లీస్టులో నీ నెంబరెంత"?

'మూడువందల అరవయి రెండు" సుందర్రావన్నాడు.

'కష్టం సుందర్రావు. ఎందుకంటే రేషనలైజేషన్ ట్రాన్స్‌ఫర్లు ముందున్నాయి. మంచి ప్లేసులన్నీ వాల్లె తన్నుకుపోతారు. ఇక మిగిలేవన్నీ మారుమూల ప్రాంతాలే".

సెల్ మోగటంతో సుదర్శన్‌రావు సెల్ చెవి దగ్గర పెట్టుకున్నాడు.

సుదర్శన్‌రావు మాటలతో సుందర్రావు దిగులు పడిపోయాడు.

టేబుల్ మీది కాగితాలు అటు ఇటు తిప్పేస్తుంటే సుందర్రావు దృష్టి అక్కడేవున్న రేషన్‌లైజేషన్ జీ.వో. మీద పడింది. వందలోపు పిల్లలుంటే ముగ్గురు టీచర్లున్న పాఠశాలనుండి సీనియర్ టీచర్ బదిలీపై వెళ్లవచ్చు. అరవయిలోపు పిల్లలుంటే రెండో టీచర్‌ను బదిలీ చేయాలి. సీనియర్ టీచర్ బదిలీపై వెళ్లకుంటే జూనియర్ టీచర్ తప్పనిసరిగా బదిలీపై వెళ్ళాలి. జీ.వో. చదివిన సుందర్రావు మెదడులో ఓ ఆలోచన తళుక్కున్న మెరిసింది, హుషారైపోయాడు.

బడికి వచ్చిన సుందర్రావు హాజరు రిజిస్టర్లన్నీ ముందేసుకుని కూడికలు తీసివేతలు వేస్తూ కుర్చున్నాడు. ఐదవ తరగతి రిజిస్టరు చూసే సరికి అందులో వున్న పదమూడు మంది పిల్లలు వరుసగా పదిరోజుల నుండి అబ్సెంట్ వున్నారు. క్లాసు టీచర్ సుమలతను పిలిపించాడు. సుమలత టీచర్ వచ్చి సుందర్రావు ఎదురుగా కుర్చీలో కూర్చుంది. పైన ఎదురుగా గోడలకు వేలాడుతున్న గాంధీ, నెహ్రూ, రాధక్రిష్ణ, అంబేద్కరు ఫొటోలు దుమ్ముకొట్టుకపోయివున్నాయి. టీచింగ్ మెటిరియల్. పటాలు, గ్లోబులు, పూసల చట్రాలు, చిందరవందరగా పడివున్నాయి. కృష్ణమూర్తి హెడ్‌మాస్టర్‌గా వున్నప్పుడు వేటిస్థానంలో అవి వుండి వాడుకలో వుండేవి. రూమంతా శుభ్రంగా వుండేది.

'చూడండి టీచర్ ఈ అయిదవ తరగతి పిల్లలు పది రోజులుగా అబ్సెంట్ వున్నారు. వారి పేర్లు తీసేయండి'' సుందర్రావన్నాడు.

ఉరుములు మెరుపులు లేని పిడుగులాంటి ఈ మాటలతో సుమలత టీచర్ ఒక్కసారి ఖంగుతిన్నది. ఏం మాట్లాడాలో తోచలేదు.

"సార్ వాల్లంతా సాగర్ కాల్వ కిందకి వరి కోతలకు వెళ్ళారు. వాళ్ల తల్లిదండ్రులు పిల్లలను తీసుకెలుతున్నట్లు మనకు చెప్పేవెళ్లారు గదా సార్" సుమలత ఆదుర్దాగా అన్నది.

ఆ వూరి నుండి ప్రతి సంవత్సరం నాట్లకు, కోతలకు సాగర్ కాల్వల కిందికి వలసలు వెలుతుంటారు. కొండాపురంలో బావులన్నీ బండబావులే. ఒక్క బావిలో కూడా సరిపడ నీళ్ళు లేక వరిపంట వేయరు. కూలీలు కోతలకు పోయి సంవత్సరం సరిపడా తిండి గింజలు వడ్లు తెచ్చుకుంటుంటారు. మూటాముల్లెలు, చిన్నపిల్లలు ఎత్తుకునేందుకు పెద్ద పిల్లలను తీసుకెలుతుంటారు. ఇది ప్రతి ఏటా జరిగేదే. వాల్లు పోయేటప్పుడు సుంద్రరావుకు, సుమలతకు మరీ మరీ చెప్పివెళ్లారు.

"మా పిల్లల పేర్లు తీసేయకండి సార్. పరీక్షల వరకు పిల్లలను తీసుకోస్తాం సార్" బ్రతిమిలాడి చెప్పి వెళ్లారు. ఆలాగేనని సుందర్రావు తలూపాడు.

అసలు ఆ బడికి వచ్చే వాళ్లంతా బడుగు, బలహీన వర్గాల



Feb 2010 _Final_Pages.pmd 4 1/28/2003, 2:20 PM

పిల్లలే. కాస్త వెసులు బాటుగా వున్న వాల్లంతా తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్ళకు పంపిస్తున్నారు. వూరిలోకి రోజూ రెండు ప్రయివేటు ఇంగ్లీషు మీడియం స్కూళ్ళ బస్సులు వస్తున్నాయి. బయట ప్రయివేటు స్కూల్లకు ఫీజులు కట్టలేని వాళ్ల పిల్లలే ఈ బడిలో వున్నారు. సుందర్రావు ఈ బడికి వచ్చిన ఈ రెండేండ్లలో దాదాపు యాబయి మంది పిల్లలు ప్రయివేటు స్కూల్లలో చేరిపోయారు. సుంద్రరావు "బడికి సరిగారాడు. పాఠాలు సరిగా చెప్పడు". అనే పుకార్లు వూరిలో షికారు చేశాయి. కృష్ణమూర్తి పదేండ్లు కష్టపడి పెంచి పోషించిన బడిని సుందర్రావు రెండేండ్లలో దిగజార్చాడు. ఇపుడా బడిలో వున్నది నూట పన్నెండు మంది పిల్లలే.

"వాళ్లు చెప్పింది నిజమే టీచర్. పోయిన సంవత్సరం గూడా వెళ్లారు. అప్పుడున్న యం.ఇ.వో. ధర్మరాజు చూసిచూడనట్లు పోయేవాడు. ఇపుడొచ్చిన యం.ఇ.వో చండశాసనుడు. అన్నిటికి రంధ్రాన్వేషణ చేస్తున్నాడు. ఏ చిన్న పొరపాటు జరిగినా బాగానే లాగుతున్నాడు. మెమోలు. ఇంక్రిమెంట్లు నిలుపుదలతో హడలెత్తిస్తున్నాడు. ప్రార్థనకు రాలేదని "మంజుల" టీచర్ కిచ్చిన మెమో ఇంకా పెండింగులోనే వున్న సంగతి మీకు తెలుసు గదా టీచర్. మనకెందుకొచ్చిన తంటా టీచర్. మధ్యాహ్న భోజనం లెక్కలు చూపించాలి. తప్పుడు లెక్కలు మనకెందుకు వాల్ల పేర్లు తీసేయండి" సుందర్రావు వున్నవి లేనివి కలిపి తెలివిగా మాట్లాడాడు.



"కాకుంటే వాల్లొచ్చాక మల్లీ పేర్లు రాద్దాం లెండి" సముదాయింపుగా అన్నాడు సుందర్రావు. సుందర్రావు గతంలో ఎన్నోసార్లు బడికిరాని పిల్లలెందరికో అటెండెన్స్ వేసి మధ్యాహ్న భోజన ఏజన్సీలకు లబ్ది చేకూర్చి వాల్లిచ్చే మామూల్లు తీసుకున్న సంగతి, నెలకోదావత్ చేయించుకున్న సంగతి, తమనేవిధంగా పీడిస్తున్న సంగతి ఎన్నోసార్లు ఏజెన్సీవాళ్లు సుమలతతో తమ గోడు వెల్లబోసుకున్నాడు.

సుమలత ఐదవ తరగతి రిజిస్టర్ ముందేసుకుని క్లాసు రూమ్‌లో కూర్చుంది. వరుసగా మునిరాజు, మురళి శేఖర్, శీను, సుమతి, శైలజ, నాగమణి, లత.... అందరి రూపాలు కండ్లముందు కదలాడాయి. వాళ్ల పేర్ల ముందు అడ్మిషన్ నెంబర్ల చుట్టూ సుందర్రావు ఎర్రపెన్నుతో గుండుసున్నా చుట్టాడు. ఆ పిల్లలంతా నవోదయ గురుకుల, ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలు రాశారు. తాను చెప్పిన విషయం ఇట్టే పట్టేసే మెరికల్లాంటి పిల్లలు. అందులో సగం మందికయినా సీటు వస్తుందని సుమలత నమ్మకం. వాళ్ల పేర్లు తీసెయ్యాలంటే సుమలతకు మనసొప్పలేదు. ఎందుకయినా ఈ పరీక్షల విషయం సుందర్రావుకు జ్ఞాపకం చేద్దామని వెళ్లి పిల్లలు నవోదయ పరీక్షలు రాసిన విషయం గుర్తుచేసింది.

"చూడండి టీచర్ మీరు మరీ ఎక్కువ ఆలోచిస్తున్నారు. బంగారు కత్తని మన మెడ కోసుకోలేంగదా! ఈ విషయం తర్వాత ఆలోచిద్దాం. ముందయితే పేర్లు తీసేసి తొందరగా రిజిస్టర్ పంపండి" సుందర్రావు తొందరపెట్టాడు. సుమలత క్లాసులో కూర్చుని ఐదవ తరగతి పిల్లలు పదమూడు మంది పేర్లు తొలగించి రిజిస్టరు పిల్లలతో సుందర్రావుకు పంపించింది. ఆమె మనస్సు మనస్సులో లేదు. ఏదో పోగొట్టుకున్న భావన ఆమెను కలచివేసింది. కండ్లలో నీళ్ళు తిరిగాయి టీచర్ ముభావంగా వుండటం చూసి పిల్లలంతా సైలెంటయిపోయారు.

సుందర్రావు రిజిస్టర్లలోని సంఖ్యను మాసపట్టికలలో వేస్తూ కూర్చున్నాడు. మాసారంభము సంఖ్య, చేరినవారు, తొలగించినవారు, మాసాంతపు సంఖ్య, హమ్మయ్య తన మ్యాజిక్ ఫిగర్ తొంబయితొమ్మిది వచ్చింది. ఐదవ తరగతి పదమూడు మంది పిల్లల తీసేస్తే ఆ పాఠశాలలో ఇక మిగిలింది, తొంబయితొమ్మిదే. ఇక రేషన్‌లైజేషన్ లీస్టులో తన పాఠశాల పేరు చేర్పించుకోవాలి. ఆనందంతో వుబ్బి తబ్బిబ్బయ్యాడు సుందర్రావు.

మాస పట్టికలు చేత పట్టుకుని యూనియన్ ఆఫీసుకు చేరాడు సుందర్రావు. యూనియన్ అధ్యక్షుడు సుదర్శన్‌రావును కలిశాడు. ఎలాగయినా తమ పాఠశాల పేరు రేషన్‌లైజేషన్ లీస్ట్‌లో చేర్పించాలని ప్రాధేయపడ్డాడు. ఇద్దరు బైక్‌ల మీద డి.ఇ.వో ఆఫీసుకు చేరారు. పై తర్జనబర్జనలు. నెలరోజుల నుండి ఓ పదిసార్లయినా మారిన సీనియారిటీ లీస్టులు ఎప్పుడు ఏ.జీ.వోకు ఏ సవరణ వస్తుందో తెలియడంలేదు. సీనియారిటీ, మెరిట్, రోస్టర్ గురించి రోజుకో ఉత్తర్వు.

సుందర్రావు సుదర్శన్‌రావు నేరుగా డి.ఇ.వో రూమ్‌లోకి వెళ్ళారు. డి.ఇ.వో. లీస్టులతో కుస్తీ పడుతున్నాడు.

"నమస్కారం సార్......" సుదర్శన్‌రావన్నాడు.

వాళ్లను లీలగా చూసిన డి.ఇ.వో. బిక్షపతి తల పైకెత్తి కూర్చోమని సుదర్శన్‌రావుకు ఎదురుగా వున్న కుర్చీ చూపించాడు.

"చెప్పండి రావుగారు", డి.ఇ.వో అన్నాడు. పైన ఫ్యాన్ గాలికి ముందున్న సీనియారిటీ లీస్టులు రెపరెపలాడుతున్నాయి.

"సార్ మా సుందర్రావు పనిచేస్తున్న స్కూల్లో పిల్లల సంఖ్య బాగా తగ్గిపోయింది. తొంబయి తొమ్మిదికి వచ్చింది. వీల్ల స్కూలు రేషనలైజేషన్ లీస్టులో చేర్చాలి. ఇవిగో పేపర్లు యం.ఇ.వో గూడా సంతకం చేశాడు" తన చేతిలో కాగితాలు డి.ఇ.వో. ముందు పెట్టాడు సుదర్శన్‌రావు.

"అయ్యో! అదెట్లా కుదురుతుంది రావుగారూ! లీస్టులన్నీ ఫైనలయ్యాయి. రేపు తెల్లారితే జరిగేవి రేషనలైజేషన్ ట్రాన్స్‌పర్లే గదా! కంప్యూటర్ గూడా అయిపోయింది. నా సంతకం అయితే నోటీస్ బోర్డు మీద పెట్టేస్తారు. అవే ఈ కాగితాలు" డి.ఈ.వో తన ముందున్న కాగితాలు చూపించాడు.



Feb 2010 _Final_Pages.pmd 5 1/28/2003, 2:20 PM

"సార్ మీరేలాగంటే మావాడు అన్యాయమైపోతాడు. మీరు పదిరోజుల నుండి రోజూ లీస్టులు మారుస్తూనేవున్నారు. మిగతా యూనియన్లు తెచ్చిన కేసులన్నీ సెటిల్ చేశారు. మా యూనియన్ దగ్గరకొచ్చేసరికి ఇదేం కొర్రిసార్. సెప్టెంబర్ విద్యార్థుల సంఖ్యతో రేషనలైజేషన్ చేయాలి. మరి నిన్నా మొన్న వచ్చిన స్కూల్లు గూడా ఏలా చేర్చారు. అందరికి ఒక్కటే రూల్ గదా అదనంగా చేర్చిన పేర్లయినా తొలగించండి. లేదా మావాడి పేరయినా చేర్చండి" కాస్త ఘాటుగానే మాట్లాడాడు సుదర్శన్‌రావు.

సుదర్శన్‌రావు మాటలతో డి.ఇ.వో. భిక్షపతి షాకయ్యాడు. ఆలోచనలో పడ్డాడు. "ఈ సుదర్శన్‌రావుతో పెట్టుకుంటే యిబ్బందే అనుకున్నాడు. గతంలో ఈయన గురించి ఆఫీసుస్టాఫ్ ముందే చెప్పారు. పోయిన డి.ఇ.వో మీద పాఠ్యపుస్తకాల మీద కంప్లయింట్‌యిస్తే రిటయిరయ్యి సంవత్సరమైన పెన్షన్ సెటిల్‌గాక డైరెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. తనకు రెండు నెలల్లో ఆర్.జే.డీ గా ప్రమోషన్ వచ్చేదుంది. ఎందుకొచ్చిన గొడవ. అందరిలాగే ఆయన పేరు లీస్టులో చేరిస్తేసరి" అనుకున్నాడు డి.ఇ.వో. విసురుగా లేచి వెల్లిబొతున్న సుదర్శనరావుతో "కూర్చో కూర్చో సుదర్శన్ అంత తొందరయితే ఎలా" నవ్వుకుంటూ అన్నాడు డి.ఇ.వో. బెల్‌కొట్టి అటెండర్‌తో సెక్షన్ క్లర్క్ రమణా రెడ్డిని కంప్యూటర్ ఆపరేటర్ రమణను పిలిపించాడు.



"చూడు రమణారెడ్డి ఈ సుందర్రావు పేరు రేషన్‌లైజేషన్ లీస్టులో చేర్చి కంప్యూటర్ చేసి తీసుక రండి సంతకాలు పెట్టియిస్తాను" తన టేబుల్ మీది కాగితాలు రమణరెడ్డికిచ్చాడు. డి.ఇ.వో మాటలతో సుదర్శనరావు వుబ్బితబ్బిబ్బయ్యాడు. "థాంక్యూ సార్, థాంక్యూ సార్, వస్తాంసార్" అని నవ్వుకుంటూ డి.ఇ.వోకు మరోసారి నమస్కారం బెట్టి బయటకు నడిచాడు.

"బలే మేనేజ్ చేశావన్నా ఆ డి.ఇ.వో మాటలతో నేనైతే ఆశవదులుకున్నా" ఆనందంతో సుందర్రావన్నాడు.

"చూడు సుందర్ ఎవరిని ఎక్కడ కొట్టాలో అక్కడ కొడితేనే పడతారు. మాయల ఫకీరు ప్రాణం రామచిలుకలో వున్నట్లు ఈ ఆఫీసర్ల లోసుగులు మన చేతిలో వున్నంత వరకు మనం చెప్పిన పనులు చేయాల్సిందే. ఎంతమంచి ఆఫీసరయిన ఎక్కడొ ఒకచోట పప్పులో కాలేయక మానరు" విజయగర్వంతో నవ్వాడు సుదర్శన్‌రావు. ఇద్దరూ యూనియన్ ఆఫీసు వైపు బయలుదేరారు.

జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముందు టీచర్ల రేషనలైజేషన్ బదిలీలు, ప్రమోషన్లు, బదిలీల హడావిడి మొదలయింది. ముందుగా రేషనలైజేషన్ ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ మొదలు పెట్టారు. ఆవరణ ఖాళీ స్థలం నిండా యూనియన్ల వారిగా టెంట్లు, పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలు, సీనియారిటి లీస్టులతో టెంట్లు కళకళలాడుతున్నాయి. "యూనియన్ జిందాబాద్, సీనియారిటీ పాటించాలి, పారదర్శకత పాటించాలి" నినాదాలు జోరుతో ఆవరణ సందడి సందడిగా వుంది. యూనియన్ల ముఖ్య నాయకులంతా లోపల పరిశీలకులుగా కౌన్సిలింగ్ జరిగే చోట కూర్చున్నారు. హైదరాబాదుకు దగ్గరున్న మండలాల పాఠశాలల ఖాళీలు హాట్‌కేకుల్లా ఎగిరిపోతున్నాయి. రియల్ ఎస్టేట్ భూమ్, ఐ.టి.క్రేజ్‌తో అంతా రాజధాని వైపే చూస్తున్నారు. తుర్కపల్లి, బీబినగర్, పోచంపల్లి మండలాల ప్లేసులన్నీ అయిపోయాయి. రేషనలైజేషన్‌లో పదో నెంబర్ వున్న సుందర్రావుకు పోచంపల్లి లోకల్ స్కూలు దొరికింది. ఆనందంతో నవ్వుకుంటూ బయటకు వచ్చాడు సుందర్రావు.

హైదరాబాదు నుండి పోచంపల్లికి ప్రతి పది నిమిషాలకో బస్సు వుంది. అదీగాక పోచంపల్లి నేషనల్ హైవే మీద వుంది. గంట ప్రయాణం బైక్ మీద గూడా వచ్చిపోవచ్చు. అప్పటికప్పుడు స్వీట్లు తెప్పించి తమ యూనియన్ వాల్లందరికి పంచాడు. కృతజ్ఞతా పూర్వకంగా సుదర్శన్‌రావును కౌగిలించుకున్నాడు. "అన్నా నీ మేలు ఈ జన్మలో మరచిపోలేను" అన్నాడు సుందర్రావు.

రెండోరోజు స్కూలుకు వచ్చిన సుందర్రావు టీచర్లకు స్వీట్లు, పిల్లలకు చాక్లెట్లు పంచాడు. చార్జి లీస్టు తయారు చేసి పాఠశాల చార్జి, సుమలతకు అప్పగించి పాఠశాల నుండి రిలీవయ్యాడు. సుమలత ముభావంగా వుండిపోయింది. గత రెండు రోజులుగా కండ్లు మూసినా, తెరిసినా ఆ అయిదవ తరగతి పిల్లలే కన్పిస్తున్నారు. మంజుల టీచర్ ప్రెగ్నెన్సీ సెలవు పై వెళ్ళిపోయింది బడిలో సుమలత వొక్కతే మిగిలిపోయింది.

వార్షిక పరీక్షలు మొదలయ్యాయి. వరికోతల కోసం సాగర్‌కాల్వల కిందికి పోయిన కూలీలు ఇంకా పది రోజుల పని వదిలిపెట్టి మూటా ముల్లె సర్దుకుని వచ్చేశారు. తమ పిల్లల పరీక్షలు పోతాయని ముందే వచ్చారు. పరీక్ష ప్యాడ్లు పట్టుకుని ఉత్సాహంగా పరీక్షలు రాద్దామని వచ్చిన ఐదవ తరగతి పిల్లలకు నిరాశే ఎదురయింది. తమ పేర్లు తీసేశారని సుమలత టీచర్ చెప్పింది. విషయం ఫోను చేసి యం.ఇ.వోకు చెబితే పేర్లు లేని పిల్లలతో పరీక్షలు ఎలా రాపిస్తావని దబాయించాడు. ఏప్రియల్ నెలలో రాయడం కుదరదంటే కుదరదన్నాడు. పిల్లలంతా వెక్కి వెక్కి ఏడ్చారు. కన్నీటు చారికలతో చెంపలు తడిసిపోయాయి.

మరో పదిరోజులకు నవోదయ, గురుకుల పాఠశాలల ప్రవేశ పరీక్షల ఫలితాలు వచ్చాయి. పాఠశాల నుండి పేర్లు తీసేసిన ఐదవ తరగతి పిల్లలతో నలుగురు నవోదయకు, ఇంకో నలుగురు గురుకుల పాఠశాలకు, ఆరవ తరగతికి సెలక్టయ్యారు. ఆ పిల్లల కష్టం, సుమలత టీచర్ చేసిన కృషి బూడిదలో పోసిన పన్నీరయింది. ఓ సంవత్సరం చదువు వృథా అయిపోయింది. సుందర్రావు ఇద్దరు పిల్లలకు హైదరాబాదులో పేరెన్నిగన్న ఐ.ఐ.టి పౌండేషన్ కాన్సెప్ట్ స్కూల్లో ఆడ్మిషన్ దొరికింది. ఆయన కల నెరవేరింది. ■



Feb 2010 _Final_Pages.pmd 6 1/28/2003, 2:20 PM

## కవిత

# రేపటిలోకి


బండ్ల మాధవరావు



వాడు
లేలేతగా
భయం భయంగా
బిత్తర చూపులతో
వద్దికగా
నేను చల్లే విత్తనాల్ని ఏరుకొనేవాడు
ఒక్కోసారి
పనికిరాని పోసుకోలు గింజల్ని చల్లినా
ముక్కుతో పొడిచి పొడిచి
గట్టి గింజల్నే రొల్లుకొనేవాడు
ఇప్పుడు
వాడు జేబులో గుప్పెడు విత్తనాల్ని
పోసుకొని లోకం మీదకు బయలుదేరాడు
చీకట్లనే చిమ్ముతాడో
వెలుగు రేఖల్నే పంచుతాడో కాని
ఇప్పుడు మాత్రం
మూర్తీభవించిన విశ్వాసమై నడిచివెళ్లాడు
రేపటిలోకి
వాడలా నడిచి వెళ్లడాన్ని చూస్తే
ముచ్చటేస్తుంది
వాడ్ని మొదటిసారి చూసినప్పుడు
రహదారుల్లోని ఎదురాళ్లను తట్టుకొని
ఎలా నడవగలడా అని శంకించాను
కాని వాడు
నాలోంచి పుస్తకాల్లోంచి
నడచి నడచి రాటుదేలాడు
నాకు తెలుసు
వాడు ఏదో ఒకరోజు
భూమి మీద ఒక మూల నుండి
నాతో మాట్లాడతాడు
నాకు తెలుసు
వాడు ఎప్పటికైనా
మహావృక్షమై తిరిగి వస్తాడు

# నా అక్షరం

పులిమళ్ల సునంద




నా హృదయాంతరాళం నుండి జారిన
అక్షరం ముక్క
అజ్ఞాన తిమిరాన్ని దునుమాడే రేచుక్క
లక్షల గుండెల్ని రగిలించే దీపశిఖ
నా అక్షరం ముక్క
కాదు పంటి మధ్య నలిగే వక్క
అవినీతిని అంతమొందించే వజ్రపు
తునక
నా అక్షరం ముక్క
కాదు కాగితంపై పడిన సిరామరక
చరిత్ర పుటలపై పదిలంగా నిలిచిన
శిలాఫలక
నా అక్షరం ముక్క
కాదు అందమైన ఆభరణం
విశ్వాంతరాళ లోతుల్ని ఛేదించిన
అఖండ సూర్యకిరణం
నా అక్షరం ముక్క
కాదు రిక్త హస్తాలశక్తి
ప్రగతి పథంలో పయనిస్తున్న అణుశక్తి
నా అక్షరం ముక్క
కాదు కనిపించే కాగితం పులి
అక్రమార్కుల గుండెల్లో
గుబులు పుట్టించే చలి
నా అక్షరం
పూరించిన శంఖారావం
కదిలించే భేరీనాదం జ్వలించే జీవన గానం
మేధస్సుకు ఉషస్సు పంచిన
అక్షరాల అమృత కలశం



Feb 2010 _Final_Pages.pmd 7 1/28/2003, 2:20 PM

# ద్రౌపది చర్చ: కొన్ని కోణాలు




**తెలకపల్లి రవి**

*ద్రౌపది నవలపై విమర్శ చేస్తున్న చాలా మంది సనాతన వాదులు, హిందూత్వ ప్రతినిధులు ఘనమైన భారతీయ సంస్కృతిని అది అవమానించిందని అంటున్నారు.పురాణాలలో స్త్రీని గొప్పగా చిత్రించారన్నదే ఒక భ్రమ. మన పురాణాలలో మహిళలను భోగపు వస్తువులుగా లేక పతి సేవకురాళ్లుగా మాత్రమే చిత్రించారు. పురుషాధిక్యత, అగ్రకులాదిపత్యం వాటిలో పొంగిపొర్లుతుంటాయి. భారతంలో అది మరింత ఎక్కువ. ఇప్పటి తేట తెలుగులో లేకపోవడం వల్ల బతికి పోతున్నాము గాని వాటిలోకొన్ని అంశాలను యథాతథంగా మామూలు భాషలో రాస్తే భరించలేనంత జుగుప్స గొల్పుతాయి.*

డాక్టర్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్ రచించిన ద్రౌపది' నవలకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడంతో దానిపై తీవ్ర చర్చోపచర్చలు సాగుతున్నాయి. పురాణస్త్రీని కించపర్చే విధంగా ఈ నవల సాగిందని కొందరు, అవార్డుకు అర్హమైంది కాదని మరికొందరు విమర్శిస్తున్నారు.ఇందులో తప్పేమీ లేదని కొందరు స్త్రీవాదులు ఇతరులు వ్యాఖ్యానించారు.యార్లగడ్డ తన నవలను తాను పూర్తిగా సమర్థించుకుంటున్నారు. ఇంతకూ ఈ సమస్యలో ముఖ్యాంశాలేమిటి?

అవార్డులు రావడం రాకపోవడం ప్రతిభకు కాని సృజన సామర్థ్యానికి గాని అవే కొలబద్దలు కావు. ఎందరో గొప్ప రచయితలకు అవి అంచులకు కూడా రాలేదు. ఇందుకు అనేక కొలబద్దలు కారణాలు వుండొచ్చు. ప్రజల కోణం నుంచి చూస్తే అవార్డు రావడం ఆనందమే కావచ్చు కాని అంతిమం కాదు. అలాగే ఎవరికి అవార్డు ఇచ్చినా అంచనాలలో విభేదించేవారు వుంటారు. ఫలానా రచనకు రాలేదని విమర్శించడం, రాలేదని వాపోవడం కూడా జరుగుతూనే వుంటుంది. ఆ అంశాలపై శ్రుతిమించిన చర్చ చేయడం వల్ల పెద్ద ప్రయోజనం వుండదు.

ద్రౌపది నవలపై విమర్శ చేస్తున్న చాలా మంది సనాతన వాదులు, హిందూత్వ ప్రతినిధులు ఘనమైన భారతీయ సంస్కృతిని అది అవమానించిందని అంటున్నారు.పురాణాలలో స్త్రీని గొప్పగా చిత్రించారన్నదే ఒక భ్రమ. మన పురాణాలలో మహిళలను భోగపు వస్తువులుగా లేక పతి సేవకురాళ్లుగా మాత్రమే చిత్రించారు. పురుషాధిక్యత, అగ్రకులాధిపత్యం వాటిలో పొంగిపొర్లుతుంటాయి. భారతంలోనూ అది ఎక్కువే. ఇప్పటి తేట తెలుగులో లేకపోవడం వల్ల బతికి పోతున్నాము గాని వాటిలో కొన్ని అంశాలను యథాతథంగా మామూలు భాషలో రాస్తే భరించలేనంత జుగుప్స గొల్పుతాయి. స్త్రీ పాత్రలను గౌరవంగా చిత్రించింది వాస్తవంగా చాలా తక్కువ. రాముడు సీతాదేవిని రెండు సార్లు నిష్కారణంగా శిక్షించడం కూడా ఈ కోవలోదే. వాటిని ప్రశ్నించడమే అపరాధమన్నట్టు మాట్లాడ్డం వాస్తవికత అనిపించుకోదు.

ద్రౌపది నవలలో విషయం కొత్తది కాదు. దానికి మూలాలు వ్యాస భారతంలోనే వుండొచ్చు కూడా. అయిదుగురు భర్తలను చేసుకోవడం నేటి పరిస్థితులలో విడ్డూరంగా కనిపిస్తుంది గాని అది ఒకనాటి సామాజిక స్వరూపాన్ని తెల్పుతుంది. కొన్ని చోట్ల ఇంకా వుంది. వాస్తవానికి భారత కాలం నాటికే అది అసాధారణమై పోయింది. సామాజిక పరిణామం కోణం నుంచి దీన్ని పరిశీలించడంలో తప్పు లేదు. కాని యార్లగడ్డ మూలాన్ని ప్రశ్నించకుండా సాంప్రదాయ తరహాలోనే ద్రౌపది గురించిన కొత్త వూహలకు పాల్పడటం ఎబ్బెట్టుగా తయారైంది. భారతం నాటికే కనుమరుగైన బహుభర్తృత్వ పద్ధతిని 21వ శతాబ్దంలో సవివరంగా వర్ణించడం వల్ల కలిగే ప్రయోజనం సున్న. అది హిందూత్వ విమర్శకులకు పని పెట్టడానికే ఉపకరిస్తుంది. ఎందుకంటే ఆయన హేతువాద దృష్టితో రాయలేదు. ఒక విధంగా అది పురాణాల్లోని పురుషాధిక్య దృష్టికి భిన్నం కాదు. పాతివ్రత్యం గురించి నీతులు చెబుతూనే స్త్రీని కాముకంగా చిత్రించడం ఇందులో కీలకం. పంచ పాండవుల భార్యగా ద్రౌపది అనుభవాలను చెప్పడం రసవత్తరంగా వుంటుందని ఆయన భావించినట్టు కనిపిస్తుంది. సినారె వంటి వారు దాన్ని బాగా ప్రశంసించారు కూడా. యార్లగడ్డ ఆధునిక సామాజిక దృష్టితో విశ్లేషించి వుంటే అప్పుడు మరోలా వుండేది. కనక పురాణాలలో స్త్రీ చిత్రణను ఆయన కొనసాగించారని చెప్పాలి. గతాన్ని మనం మార్చలేకపోయినా దాని పట్ల శాస్త్రీయ దృష్టి కలిగి వుండాలి. నేటి పరిస్థితులకు అవసరమైన అధ్యయనం జరగాలి. అలాగాక గతం తాలూకూ 'ఆకర్షణీయమైన' అంశాలను అతిగా చిత్రించేట్టయితే అది




Feb 2010 _Final_Pages.pmd 8 1/28/2003, 2:20 PM

## చీలినదారి

**ఉప్పుధడియం వెంకటేశ్వర**



నిష్ఠురమ్మని తెలిసికూడా
నిజం చెప్పక తప్పదిప్పుడు

విశ్వమంతా వేలికొసపై
ఉన్నదంటూ ఊకదంపుడు !
ఇరుగు పొరుగుల పేర్లు కూడా
తెలియదంటూ నంగినవ్వులు !

ప్రకృతి ధర్మము తెలిసి మసలుటె
జ్ఞానమన్నది తెలియదేమో
రేయి పగలూ భేద మెరుగక
దేనికోసమో గంగవెర్రులు !

పాము నాలుక పగిలి చీలిన
దారినంతా తరచి చూస్తే-
వట్టి పోయిన పసిమి కలలవి
గుండియెల మెలిపెట్టునోయ్ !

నింగిదారుల సాగిపోయే
కాకిలెక్కల రెక్క బరువుకు
కునారిల్లే దీన జనతది
కానవస్తుందోయ్ !

పామునాలుక పగిలి చీలిన
దారినంతా తరచి చూస్తే-

స్వర్ణసౌధపు చిద్విలాసం
పూరిపాకల నిస్సహాయత
పక్క పక్కనే కొలువు దీరిన
వింత పోకడ విశద మగునోయ్ !

## బొమ్మా నేనే, బొరుసూనేనే....

**కెంగార మోహన్**



నిస్తేజం నన్నావరించింది
నిర్ధాక్షణ్యంగా నేనిపుడు
అమ్మకాని కొచ్చాను
కాలమనే కారాగారంలో
జీవిత ఖైదీని.
బందీగా హృదయ వీణను
మీటే కొద్దీ మదిలోతుల్లోంచి
అంతర్వాహిని ప్రవహిస్తూనే ఉంది
భావాలను కలగా మార్చి
అనుభవాల పుటల్ని తిరిగేస్తుంటే
జీవితం వెకిలి నవ్వు నవ్వుతోంది
ఆశయాలకు ఆశల్ని జోడించి
మనోనేత్రాలతో ప్రపంచాన్ని
వీక్షిస్తే గ్లోబల్ మార్కెట్
పచ్చని పైరులా కనిపిస్తుంది
విలువలు వివస్త్రలవుతున్న
ప్రతిసారి నేత్రధారలు
జలపాతాలవుతున్నాయి.
అపాదమస్తకం స్వేచ్ఛా మార్కెట్‌లో
అమ్ముడుబోయాక
మిగిలిందంతా శూన్యమే.
బంధాలు, అనుబంధాలు
మానవ సంబంధాలకు అర్థాలు
నిఘంటువుల్లో అదృశ్యమయ్యాయి.
ఆవేశాన్ని అగ్నిశిఖగా మార్చి
ఉక్కు పిడికిలి బిగించి
నా నుండి వెళ్ళగొట్టే
రోజొకటొస్తుంది
ఆరోజు నిజంగా నాదే.
ఆరోజు బొమ్మా నేనే ! బొరుసూ
నేనే... !!

అభ్యంతరకరంగా మారిపోతుంది.


అర్థం కాని పద్యాలలో శ్లోకాలలో రాసినట్టు నేటి శైలిలో రాయడం మొదలు పెడితే అశ్లీల వర్ణనల్లా మారిపోయే ప్రమాదం చాలా వుంటుంది. ద్రౌపదిలో చాలా చోట్ల అలాటి భాగాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఆమె ఔన్నత్యాన్ని చెప్పినా మొత్తంపైన పురుష ప్రదానమైన కాముక దృష్టి పొంగిపొర్లుతుంది. మరణాల మధ్యన కూడా ఆమె ఆలోచనలు వాటిచుట్టూనే తిరుగుతున్నాయా అన్న భావన పాఠకుడికి కలుగుతుంది. ఆ పైన కృష్ణుడితో ఆమె అనుబంధాన్ని స్పష్టాస్పష్టంగా రాయడం అన్యాపదేశంగా ఏదో భావం కలిగించేందుకేనని తెలుస్తుంటుంది. ద్రౌపదీ వస్త్రాపహరణ(నేటి భాషలో చెప్పాలంటే వివస్త్రను చేసే దుర్మార్గం) ఘట్టం వంటివాటిలో మరింతగా ఔచిత్యం దెబ్బ తినిపోయింది.

పురాణాలపై నూతన అధ్యయనం మంచిదే గాని అది లౌకిక పురోగామి దృష్టితో ప్రజామోదకరంగా ప్రయోజనకరంగా వుండాలి. త్రిపురనేని రామస్వామి చౌదరి వంటివారు మూఢత్వంపైన కుల వ్యవస్థపైన తిరుగుబాటుకు దాన్ని వాడుకున్నారు. చలం, ముద్దుకృష్ణ,నార్ల వంటి వారు పురాణ పాత్రలను తమ కోణంలో చిత్రించేందుకు ప్రయత్నించారు. రామాయణంపై రంగనాయకమ్మ అధిక్షేప సృజనతో పాటు కొన్ని పరిమితుల్లో సామాజిక అధ్యయనం చేశారు. ఇప్పుడు ఓల్గా పురాణ స్త్రీలను తన స్త్రీవాద కోణంలో పరిశీలిస్తున్నారు. యార్లగడ్డ ఎంచుకున్న ఇతివృత్తం గాని చిత్రణా శైలిగాని ఆ కోవకు చెందినవి కావు. ఆయన గతం పట్ల యధాతథ దృష్టితోనే వున్నారు. కాకపోతే అందులో పెద్దగా చర్చకు రాని కొన్ని విషయాలను విపులీకరించి, తన కల్పనను జోడించే ప్రయత్నం చేశారు. ఆ క్రమంలో పంచభర్తృత్వానికి కృష్ణుడితో అస్పష్టానుబంధానికి ప్రాధాన్యతనిచ్చి అకారణ వివాదాలకు కారకులైనారు. ఈ నవలపై ఛాందసత్వ విమర్శలను ఆమోదించనవసరం లేదు గాని ఆయన కూడా ధోరణి మార్చుకోవాలని చెప్పవలసి వుంటుంది. ఎందుకంటే మౌలికంగా తను ఆ పరిధిలోనే వున్నానంటున్నారు గనక. స్త్రీల లైంగికత పట్లనే గాక మొత్తం సమాజ గమనం పట్ల శాస్త్రీయ దృక్పథాన్ని ప్రదర్శించడమే రచయితలకు మార్గదర్శకమవుతుంది. అందుకు భిన్నమైన ప్రక్రియలూ పద్ధతులూ ప్రచార ప్రధానమే అవుతాయి తప్ప ప్రయోజనం కలిగించవు.

■



Feb 2010 _Final_Pages.pmd 9 1/28/2003, 2:20 PM



# రచనా నేర్పు గల కథకుడు చా.సో

నిడగంటి కృష్ణబాబు

***చా.సో. వ్రాసిన కథలు తక్కువే అయినా అవి ఉత్తమ కథలు కావడంతో అంతర్జాతీయ కథా రచయితల్లో ప్రముఖుల సరసన నిలువగలిగేడు చా.సో. కథలు కొన్ని ఇంగ్లీషు, రష్యన్, హిందీ, ఉర్దూను ఒరియా భాషలలోకి అనువదింపబడ్డాయి. దీనిని బట్టి వీరి కథల స్థాయిని మనం అర్థం చేసుకోవచ్చు. కథా వస్తువులు పీడిత జనుల పక్షం నుండి తీసుకొన్నారు చా.సో.. కుంకుడాకు, బొండుమల్లెలు, ఎంపు మొదలయిన కథలు యీ అంశాన్ని చెప్పకనే చెపుతాయి.***

ఉత్తమ వ్యక్తిత్వంతో ఉన్నత విలువలుతో సాహిత్యాన్ని అభ్యుదయ పథంలో సృజన చేసిన “కథా శిల్పి”. చాసోగా ప్రసిద్ధి చెందిన చాగంటి సోమయాజులు, లోతైన సాహిత్యాధ్యయనాన్ని చేశారు. అపారమైన జీవితానుభవాన్ని చూశారు. విశిష్టమైన లక్షణాలను పుణికి పుచ్చుకున్న అగ్రశ్రేణి రచయితలలో చాసో ఒకరు. చా.సో. వ్రాసిన కథలు తక్కువే అయినా అవి ఉత్తమ కథలు కావడంతో అంతర్జాతీయ కథా రచయితల్లో ప్రముఖుల సరసన నిలువగలిగేడు చా.సో. కథలు కొన్ని ఇంగ్లీషు, రష్యన్, హిందీ, ఉర్దూను ఒరియా భాషలలోకి అనువదింపబడ్డాయి. దీనిని బట్టి వీరి కథల స్థాయిని మనం అర్థం చేసుకోవచ్చు. కథా వస్తువులు పీడిత జనుల పక్షం నుండి తీసుకొన్నారు చా.సో.. కుంకుడాకు, బొండుమల్లెలు, ఎంపు మొదలయిన కథలు యీ అంశాన్ని చెప్పకనే చెపుతాయి.

చా.సో. ప్రతినిత్యం, శ్రీరంగం నారాయణబాబు, రోణంకి అప్పలస్వామిల సహవాసం తోనూ చర్చలతోను, నిరంతరం ఇష్టాగోష్టులతోను గడిపేవారు. యీ ముగ్గురూ స్వాతంత్రోద్యమంతో ప్రభావితం అయినవారే. కానీ, భగత్‌సింగ్ ప్రభావం వీరిపై అధికంగా ఉండటం వలన సోషలిస్టులుగా తయారయ్యారు. వీరికి ఆరుద్ర, ఆవంత్స సోమసుందర్‌లతో ఉత్తర ప్రత్యుత్తరాలు తరచూ సాగేవి. యీ ఉత్తరాలన్నీ సాహిత్యానికి సంబంధించినవేనని వేరే చెప్పనక్కర్లేదు. రోణంకి అప్పలస్వామి గారు విదేశాలనుండి, ప్రసిద్ధ రచయితల కవిత్వాన్ని తెప్పించుకొని నారాయణ బాబుకి, చాసోకి, మూల భాషల్లోనే వినిపిస్తూ ఉండేవారు.

ప్రసిద్ధ రచయితల పుస్తకాలని కథలను వివరణాత్మకంగా అధ్యయనం చేసి, కథల్లోని లక్షణాలను పూర్తిగా అవగాహన చేసుకొని, రచనలు ఎలా చేయాలో, ఎలా ఉండాలో అవగతం చేసుకొని రాత సాగించడం వలన చా.సో. కథలు ఇప్పటికి గొప్ప కథలుగా నిలిచాయి. అందుకే చా.సో. కథల్లో ఒక్కముక్క తగ్గించడానికి కాని పెంచడానికి కానీ వీలుకాదు.

ఘనత వహించిన వ్యక్తులకు జన్మనిచ్చిన విజయనగరం వొడిలో 1915 జనవరి 17న జన్మించిన చాసో. ఎందరో గొప్పవారు కావడానికి బీజాలు పడిన విజయనగరం మహారాజు కళాశాలలో విద్యాభ్యాసం చేసారు(ఇదే కాలేజీలో గురజాడ కూడా చదువుకొని అధ్యాపకులుగా పనిచేసారు). చా.సో. చదువుకొనే రోజుల్లో కాలేజీలో విద్యాబోధన పూర్తిగా ఆంగ్లంలోనే సాగేది. అందుకే అప్పటి వారికి ఆంగ్లం అంతగా పట్టుబడేది. ఎంతో ప్రతిభావంతంగా విద్యార్థి దశలోనే ఆంగ్లంలో, ఛందోబద్ధమైన కవితలు వ్రాసి రోణంకి అప్పలస్వామి గారిని మెప్పించారు చా.సో. రాజీ పడని మనస్తత్వంగల రోణంకి మెచ్చుకోవడం



Feb 2010 _Final_Pages.pmd 10 1/28/2003, 2:20 PM

అంటే మాటలు కాదు.

ఆ తర్వాత తర్వాత తన కలాన్ని కథల్లోకి మళ్ళించారు. విస్తృత అధ్యయనం, విమర్శనాత్మక విశ్లేషణల వలన చా.సో. వ్రాసిన ప్రతికథా. విశ్వ కథకుల కథల సరసన నిలిచింది. కథా వస్తువును అనుసరించి, కథా శిల్పాన్ని నిర్మించడం చా.సో.కు కరతలా మలకం అయింది. ఈ నేర్పుతోనే, ఏ కథను ఉత్తమ పురుషలో వ్రాయాలి. దేన్ని ప్రథమ పురుషలో చెప్పాలో పూర్తిగా అవగతం చేసుకొని కథలన్నీ వ్రాసారు. ముప్ఫైయో పడి వరకు విస్తృత అధ్యయనం సాగించి నలభైయ్యో పడిలో రచనలు సాగించారు.

చా.సో. కథలు చాలా తక్కువే అయినా అన్నీ వాసికెక్కిన కథలు వ్రాసారు.వాయులీనం, కర్మ సిద్ధాంతం, ఏలూరెళ్లాలి, ఎందుకు పారెస్తాను నాన్నా, మొదలయిన కథలు కథాశిల్ప రచనా విశేషంగా వుంటాయి. చా.సో. సాహిత్యంపై రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో పి.హెచ్.డి లు ఎం.ఫిల్ పట్టాలు చేసారు.

"బండపాటు బతుకులోనా బొండుమల్లెలు పూయిస్తావా! ఓ కథల చా.సో.

కొండపూల దండ వేస్తా కోటి వెలుగులు కుమ్మరిస్తావా!"

అంటూ డాక్టర్ యు.ఏ. నరసింహమూర్తి గారు చాసో రచనల మీది తన అవ్యాజ్యమైన ప్రేమను గుమ్మరిస్తారు చా.సో. మంచి భావుకుడు. చాసో కథలను మనం పరిశీలించినట్లయితే ఆయనలోని భావుకత సౌందర్యాధన కనబడుతుంది. ప్రకృతిలో కలసిన పరిశీలన కనిపిస్తుంది. అంటూ చా.సో. కథల రచనా నైపుణ్యాన్ని చిత్రిస్తూ డాక్టర్ యు.ఏ. నరసింహమూర్తి గారు "కథాశిల్పి చాసో" అంటూ విమర్శన గ్రంథాన్ని రచించారు. యీ పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి కూడా లభించింది.

***ప్రతీయేటా జనవరి 17న చాసో జయంతిని పురస్కరించుకొని చాసో స్ఫూర్తి ట్రస్ట్ పేరిట చాసో స్ఫూర్తితో రచనలు గావించే రచయితలకు నగదు పురస్కారాన్ని అందిస్తున్నారు. ఇప్పటివరకు సలీం, గంటేడ గౌరునాయుడు, ఖదీర్‌బాబు, సన్నపురెడ్డి, ప్రతిమ, పి.వరలక్ష్మి మొదలయినవారు యీ పురస్కారాన్ని పొందిన వారిలో వున్నారు.***

సాహితీ సభల్లో పాల్గొనేందుకు ప్రయాణం కావడమంటే భలే సరదా, చా.సో.కు ప్రయాణాలంటే బడలిక గానీ వయోభారం కానీ, దూరాభారం కానీ ఆటంకం కాలేదు. రాష్ట్రమంతటా ఉత్సాహంగా తిరిగేవారు.

ఏ ప్రాంతానికి వెళ్ళినా యువకులైన కథకులు అందరూ ఆయన చుట్టూ చేరేవారు. చా.సో.కి బెట్టు చేయడం, మెరమెచ్చు మాట్లాడడం వంటి లక్షణాలు లేవు. యువ కథకుల రచనలలోని లోపాలను నిక్కచ్చిగా వారికి తెలియజేస్తూ కథాశిల్ప మర్మాలను వివరించి, మంచి కథలు వ్రాయడానికి తగిన సలహాలను ఆయన వారికి తెలియజేస్తూ ఉండేవారు. అందుకే ఉత్తరాంధ్రలోనే కాక మధ్య ఆంధ్రాలోనూ, రాయలసీమలోనూ, తెలంగాణాలోనూ, యిప్పుడు గడితేరిన యువకథకులు ఎందరో చా.సో.ను తమ మార్గదర్శకునిగా గౌరవిస్తున్నారు.

చా.సో. పొడుగాటి చుట్టను నింపాదిగా కాలుస్తూ ఎదుటివారిని నిశితంగా పరిశీలిస్తూ చెప్పేది వింటూ తక్కువగా మాట్లాడేవారు.

తెలుగు కథకు తగినంత గుర్తింపు అంతర్జాతీయ స్థాయిలో రాలేదని వాపోయేవారు చా.సో. తెలుగు కథను ఇంగ్లీషులోకి అనువదించడం ద్వారా యీ సమస్యను అధిగమించవచ్చని చా.సో. చేసిన సూచన ఎవ్వరికీ పట్టకపోవడం చాసోకు చాలా మనస్తాపం కలిగించేది.

చాసో వ్రాసిన ''చిన్నాజి'' అనే కథ 1942 భారతిలో ప్రచురితమైంది. ఈ కథలోని "చిన్నాజి" చాసో కుమార్తె చాగంటి తులసియే. ఈ కథను తన చిన్నతనంలో కూడబలుక్కొని, చదివేదాన్నని, ఎన్నోసార్లు చదువుకున్నానని ఆమె అంటూ వుంటారు ఇప్పటికీను. యీమె ప్రసిద్ధ రచయిత్రి, అనువాదకురాలు, సాహిత్య అకాడమీ వారికి రాహుల్ సాంకృత్యాయన్ "ఓల్గాసే గంగా" ను హిందీ నుండి తెలుగుకు అనువదించారు. యీమె ఒరియా, హిందీ, తెలుగు, ఇంగ్లీషు భాషలలో పండితురాలు. యీమె కథలు ఇతర భాషలలోకి అనువాదం అయ్యాయి. యీమె వ్రాసిన బొమ్మ రూపాయి, యాష్ ట్రే, మొదలయినవి ప్రసిద్ధికెక్కాయి.

ప్రతీయేటా జనవరి 17న చాసో జయంతిని పురస్కరించుకొని చాసో స్ఫూర్తి ట్రస్ట్ పేరిట చాసో స్ఫూర్తితో రచనలు గావించే రచయితలకు నగదు పురస్కారాన్ని అందిస్తున్నారు. ఇప్పటివరకు సలీం, గంటేడ గౌరునాయుడు, ఖదీర్‌బాబు, నన్నపురెడ్డి, ప్రతిమ, పి.వరలక్ష్మి మొదలయినవారు యీ పురస్కారాన్ని పొందిన వారిలో వున్నారు.

చాసో గారి మూడవ కుమార్తె క్రిష్ణకుమారి. యీమె కూడా "లోహ జగత్తు" 'వైజ్ఞానిక జగత్తు' పేరుతో సైన్స్ వ్యాసాలను ప్రచురించారు. యీమె చాలా పత్రికలకు సైన్స్ వ్యాసాలను వ్రాస్తున్నారు.

చాసో కుమారుడు శంకర్, ఈయన తిరుపతి మున్సిపల్ కమీషనర్‌గా పనిచేస్తూ అకాల మరణం చెందారు. వీరు కూడా కథలను వ్రాసేవారు శంకర్ కథల పేరుతో కథా సంకలనం కూడా అచ్చయింది.

వాడుక భాషలోనే కథలు వ్రాయాలన్న గురజాడ ఒరవడిని కొనసాగించిన రచయిత చా.సో. అందుకే చాసో కథల్లో సమగ్ర జీవిత చిత్రణ వుంటుంది.

"చాసో ను తూచడానికి రాళ్ళు లేవు!

చాసోను చాసోతోనే పోల్చగలము"

అంటారు కీ.శే. కొడవటిగంటి కుటుంబరావుగారు.

విజయనగరం రాజావారి కళాశాలలో చాసో చదువు సాగింది. ఆ సమయంలోనే రాజా కళాశాల గ్రంథాలయానికి విజయనగరం ఆనందగజపతి రాజా వారు ఇంగ్లాండ్ నుండి ప్రచురింపబడే అన్ని



Feb 2010 _Final_Pages.pmd 11 1/28/2003, 2:20 PM

పత్రికలు తెప్పించేవారు.

ఎన్నో రివ్యూలు ప్రచురింపబడే “టైమ్ లిటరరీ సప్లిమంట్”

క్రిటిక్ ఎక్కువగా వుండే “బుక్‌మన్ క్రెటీరియా” అనే ఓ పత్రిక ఉండేది.

టి.యస్. ఇలియట్ సంపాదకుడుగా ప్రచురింపబడే “మెర్క్యురీ”

వీటిలో ప్రముఖుల వ్యాసాలు ప్రచురణ అయ్యావి. “పంచ్” అనే హ్యూమర్ పత్రిక “స్ట్రాంగ్” నైంటింత్ సెంచరీ, సాటర్ డే రివ్యూ” అనే పత్రికలన్నీ చాసో పరిశీలించేవారు. వీటన్నింటిలో సాహిత్య విలువలు ఉండే వ్యాసాలు, విమర్శలు, కథలు ఉండేవి వీటి ప్రభావం చాసో మీద బాగా ఉంది.

చా.సో. తనొక్కడే కాక, తన సమవయస్కులకు కూడా సాహితీ సమాలోచనలతో ప్రేరణ చేసేవాడు. దానితో విజయనగరంలో చాలామంది, రచయితలుగా తయారయ్యారు. వీరంతా కలసి ప్రతిదినం రచనలపై సమాలోచనలు చెయ్యడమే. వీరంతా కలసి రాష్ట్ర వ్యాప్తంగా అభ్యుదయ రచయితల సంఘం పెట్టాలని నిర్ణయించుకున్నారు. అరసం ప్రారంభమైన సంవత్సర కాలం తరువాత కొడవటిగంటి కుటుంబరావు ఆ తరువాత శ్రీరంగం శ్రీనివాసరావులు కూడా అరసంలో చేరారు.[3] వీరిద్దరు చేరిన తరువాతే అరసం నలుమూలలా వ్యాపించడానికి ప్రధాన కారకులయ్యారు.

***మార్క్సిస్టు ధృక్పథంతో, శిల్ప నైపుణ్యంతో కథలను అద్భుతంగా రాసి గొప్ప కథకుడు చాసో, చాసోగా ప్రసిద్ధి చెందిన చాగంటి సోమయాజులు, అన్నీ గొప్ప కథలే రాశారు. ఏ కథలోనూ ఒక వ్యాక్యం ఎక్కువ గాని, తక్కువ గానీ వుండదు. సరిగ్గా వుంటుంది. కథలో సన్నివేశాల పేర్పు ఆయనకే చెల్లుతుంది.***

చాసో యింటికి తరచూ శ్రీరంగం శ్రీనివాసరావు వచ్చి ఆ నెలలో వచ్చిన పత్రికలన్ని ఓ నాలుగయిదు రోజులు పాటు రాత్రనక పగలనకా చదివి తిరిగి వైజాగ్ వెళ్ళిపోయేవారు. అరసం ప్రారంభించినప్పుడే శ్రీశ్రీ మహాప్రస్థానం, నారాయణబాబు “రుధిరజ్యోతి” లను వ్రాసారు. శ్రీశ్రీ మహాప్రస్థానం అరసం ప్రచురించడానికి చొరవ చూపింది కానీ అనివార్య కారణాల వలన శ్రీశ్రీ మహాప్రస్థానాన్ని అరసం కాక ఇతరులు ప్రచురించారు.  చాసో అరసం వ్యవస్థాపక సభ్యులు. క్రియాశీలక పదవిలో ఉండేవారు. అరసం సభలకు స్వంత ఖర్చులతో వెళ్ళేవారు. ఎలాంటి భేషజాలకు పోకుండా, వ్యవహరించేవారు. దుబారా అంటే గిట్టని మనిషి చాసో.

ప్రస్తుతం విజయనగరం నుండి మరొకరు చాసో సాహిత్యం మీద పి.హెచ్.డి. చేస్తున్నారు. ఆవంత్స సోమసుందర్, ఆరుద్ర, రోణంకి అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబుల గురించి చెప్పుకొన్నపుడు చాసోను ప్రస్తావించక తప్పదు. అంతటి గొప్ప మైత్రీబంధం వీరిది. తెలుగు కథకు తూర్పు దిక్కు చాసో.

మార్క్సిస్టు ధృక్పథంతో, శిల్ప నైపుణ్యంతో కథలు రాశారు. ఏ కథలోనూ ఒక వ్యాక్యం ఎక్కువ గాని, తక్కువ గానీ వుండదు. సరిగ్గా వుంటుంది. కథలో సన్నివేశాల పేర్పు ఆయనకే చెల్లుతుంది. చాసో కథల ప్రపంచ సాహిత్యంలో జాక్ లండన్ కథలతో సరిపోల్చదగ్గవిగా మహీధర రామ్మోహన్‌రావు అభివర్ణించారు. చాసో నిరాడంబర జీవి. అరసం సభలకు హాజరయ్యే ప్రతినిధులు ఎవరైనా ఖరీదైన హోటల్లో దిగితే, మన పార్టీ ఆఫీసు, అక్కడుండొచ్చు కదా, మనం మనం డబ్బేసి కట్టుకున్నదేనా, అన్నారోసారి. అలాగే పంచే లాల్చి, చేతిలో చుట్ట, హాయిగా, నిరాడంబరంగా ఒక్కరే సాయంత్రం షికారుకి వెళ్ళడం వారికి అలవాటు. ఈ అలవాటు ఆయన ఏ వూళ్ళో ఉన్నా ఆచరించేవారు.

సోషలిస్టు భావాలు వీరివి. భూమ్మీద పుట్టిన మనిషికి భూమ్మీద హక్కుంది. బతికే హక్కు. అది చాలా మందికి లేకుండా పోయిందిప్పుడు, అది చేకూరేటట్లు చేయవలసిన బాధ్యత మానవ జాతికి వుంది. “అంటూ బాధ్యతగా ఏ ఒక్క వ్యవస్థనో, ప్రభుత్వాన్నో అనకుండా, మొత్తం మానవ జాతికి వుంది అనడంలో వ్యక్తి బాధ్యత అర్ధమవుతుంది.

కథలు రాయడంతో ఆ బాధ్యతను తీసుకున్నారు చా.సో. చుట్టూ వున్న జీవితాన్ని పరిశీలించి రాయాలి. ఆ జీవితంలోనించే రాయాలి. తెలిసిన విషయాలనే రాయాలి. తెలీని విషయం రాయవలసి వస్తే తెలుసుకొని రాయాలని కథలు రాసే వారికి సూచిస్తారు చాసో.

ఓ ఇంటర్వ్యూలో ‘తన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని పట్టించుకునే నిజమైన మేధావికి నిరాశకాక ఇంకేమి మిగులుతుంది. దేనికి బద్ధం కాని మేధావి నిరాశావాదిగా కనబడటం సహజం’ అంటారాయన.

చాసో భావకుడు, చాసో కథల్లో భావుకత వుంటుంది. ప్రకృతి సౌందర్యాన్ని ఎంతో హృద్యంగా కథానుగుణంగా వాడుతారు. పెరట్లో వెన్నెల పువ్వు వెలగవాసన మహాబాగున్నాయి అంటారు “వాయులీనం” కథలో, చిన్నాజి వెన్నెట్లో రేరాణి వాసనలా వచ్చిందంటాడు చాసో. ఇక్కడ తండ్రి ప్రేమ వాత్సల్యం కనిపిస్తాయి. కూతురి ఉనికి, నైట్ క్విన్ పరిమళంతో పొల్చడం,  బావుకత పరాకాష్ఠే.

చాసో సుమారు 80 కథలు రాశారు. మరెన్నో కథలు, నచ్చక చించేశారు. ‘కర్మ సిద్ధాంతం’, ‘కుంకుడాకు’ ‘ ఎందుకు పారేస్తాను నాన్నా’ ఎంపు, మాతృధర్మం, వాయులీనం, ఇలా చాసో రాసిన కథలన్నీ ఒక్కో కథా ఒక్కో దృశ్యకావ్యమే అవుతుంది.

1994 జనవరి 2న  చాసో సాహితీ లోకాన్ని శోక సంద్రంలో విడిచి కన్నుమూశారు. మద్రాస్‌లోని విజయ ఆస్పత్రిలో మరణించిన చాగంటి సోమయాజులు భౌతికకాయాన్ని, మద్రాసులోని రామచంద్రా ఆసుపత్రికి దానం చేశారు. అలాగే సునిశితమైన ఆయన కళ్ళను ఎగ్మూర్ ఆస్పత్రికి దానం చేశారు. ఇది ఆయన కోరిక. ఈ కోరికను  నెరవేర్చిన వారి కుటుంబ సభ్యులు అభినందనీయులు. ■



Feb 2010 _Final_Pages.pmd 12 1/28/2003, 2:20 PM

## కవితా సౌందర్యం

# తడారని కవితా శోకం జాలరి జీవితం !



**డాక్టర్ రాధేయ**

***సముద్రంలో చేపలవేట జీవితంగా, చావు బతుకుల కూటికోసం తీరాన్ని వదలి రెండొందల మైళ్ళ దాకా సముద్రం లోకి వెళ్ళిపోయే జీవితం జాలర్లది. వరుసగా నాలుగైదు రోజులు నీటిమీదే జీవితం, బోటే ప్రపంచం. ఆ ప్రపంచంపై నుండి సముద్రంలోకి రకరకాల వలలు విసురుతూ వేటాడిన చేపల్ని తీరానికి చేర్చేదాకా ఏ కళాసీ మనసు నెమ్మది వుండదు.***

**స**త్యం కోసం చేసే నిరంతర అన్వేషణే సాహిత్యం. కవి హృదయం వైయుక్తిక సామాజిక అనుభవాలు, అనుభూతుల సమారోహణం.

జీవితం బహు ముఖమైనప్పుడు మనం నివశిస్తున్న ఈ వ్యవస్థ అనేక వైరుధ్యాల మధ్య ఘర్షణ పడుతున్నపుడు కవి మానవీయ విలువల కోసం, సామాజిక న్యాయం కోసం తపిస్తాడు. వాస్తవాలతో నిండిన మనిషి జీవితాన్ని పడుగు పేకగా అల్లుకున్న తీపి, చేదు అనుభవాల్ని ఇవాల్టి కవి ఎంత చక్కగా ఆవిష్కరిస్తున్నాడు.

"ఈ కాలంతో బ్రతుకు ! ఈ ప్రపంచాన్ని ప్రతి ఫలించు ! ఇంటికున్న కిటికీలన్నీ తెరచి అన్ని పవనాల్నీ ఆహ్వానించు నువ్వు చెప్పేదేదైనా నీదైవుండాలి నీలోంచి రావాలి, చించుకొనిరావాలి !" అంటాడు తిలక్. నిజమైన ఉన్నతమైన కవిత్వమంటూ ఏదైనా ఉందా? అని ప్రశ్నించుకుంటే, అది స్వచ్ఛమైన, యదార్థమైన నిజాయితీతో కూడుకున్న కవిత్వం మాత్రమే. ఎవరైతే నిజమైన మానవత్వంతో తొణికిసలాడుతాడో, మానవత్వాన్ని అనుక్షణం అనుభూతితో స్వంతం చేసుకుంటాడో అదే నిజమైన కవిత్వం.

తనలో కలిగే నవ్య కవిత్వాన్ని "కార్మికలోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి'' అంకితమిచ్చానన్నాడు శ్రీశ్రీ అంతేకాకుండా కవి అన్నవాడు కష్టజీవికి ఇరువైపులా నిలబడాలని వర్తమాన కవులకు ఒక దిశా నిర్దేశం ఇచ్చేశాడు శ్రీశ్రీ శ్రమైక జీవన సౌందర్యాన్ని తన కవిత్వంలో ప్రతి ఫలింపజేశాడు. సహస్రవృత్తుల సమస్త చిహ్నాలన్నింటినీ తన కవిత్వంలో లీనంచేసుకున్నాడు.

మానవ శారీరకమైన అవసరాలే వృత్తులను సృష్టిస్తాయి చెప్పాలంటే అసలు మనదేశమే వృత్తి ప్రధానమైనది రాను రాను వృత్తుల్ని కులాలకు అనుసంధానం చేయడం జరిగింది. బ్రిటిష్ వారు ఈ దేశానికి వలస వచ్చిన తర్వాతనే యాంత్రీకరణ ప్రారంభమైంది. కాలే కడుపుల మీద దెబ్బ పడింది. శరీర కష్టంతో కడుపు నింపుకోలేని దయనీయ స్థితిలో నిలబడిపోయాడు శ్రామికుడు. వృత్తిపరమైన పెనుగులాటలో నిరంతర వేదననుభవిస్తున్న 'జాలరి' జీవితాలను ఆవిష్కరించే కవిత్వాన్ని మనం విశ్లేషించుకుందాం.

సముద్రంలో చేపలవేట జీవితంగా, చావు బతుకుల కూటికోసం తీరాన్ని వదలి రెండొందల మైళ్ళ దాకా సముద్రం లోకి వెళ్ళిపోయే జీవితం జాలర్లది. వరుసగా నాలుగైదు రోజులు నీటిమీదే జీవితం, బోటే ప్రపంచం. ఆ ప్రపంచంపై నుండి సముద్రంలోకి రకరకాల వలలు విసురుతూ వేటాడిన చేపల్ని తీరానికి చేర్చేదాకా ఏ కళాసీ మనసు నెమ్మది వుండదు.

ఏ క్షణాన ఏ రీతిన, ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలీదు గనుక భయం, అభద్రతా భావం అణువణువునా ఆక్రమించి వుంటుంది. కంటిమీద కునుకు పట్టదు వారందరి జీవితాలను ప్రభావితం చేసేది శాసించేంది సముద్రమే. ఈ సముద్రాలే తూకంలోకి పొర్లినా మా బతుకు పాసంగమే నంటున్నాడు కవి –

"హైలెస్సో హైసా అంటూ / మా ఆయాసాన్ని పాటలు చేసి / నీటిపై పాదాలు మోపి / సముద్రమంతా కలెతిరుగుతాం / మా మెతుకుల్ని పట్టి ఒడ్డుమీద పోసుకుంటాం / అయినా... / ఎనిమిది కచ్చుల పూసలవల మాలోకం / మాకళ్ళు ఎన్ని చేపలు తూచినా / ఆకలి కన్నీటి మడుగులు అలుగులు పోస్తూనే ఉంటాయి / మా పేగుల



Feb 2010 _Final_Pages.pmd 13 1/28/2003, 2:20 PM

మూలుగులు విని / సముద్రాలే తూకంలోకి పొర్లినా / మా బ్రతుకు పాసంగమే / తరతరాలుగా మా వంటి నుండి రాలుతున్న సోరుప్పే / మా ఉప్పునీటి బతుక్కీ సాక్ష్యం / మీ మాటల తోపెలను / మా గుండె లోతుల్లోకి తోసి / ఏరుకున్న రత్నాలు చాలు / మా కష్టాన్ని లారీల్లో నింపుకొని / మమ్మల్ని చితికట్టేల్లా పేర్చింది చాలు / ఇంకా.. / మా వల కళ్ళల్లో మీ కుతంత్రాల ఎలుము ఈగదు / చేప నిద్ర నేర్చిన వాళ్ళం / ఇనుప వలల ఎనబెట్టుకుని వస్తున్నాం / వల సైనికుల్లా/"

**అంబటి వెంకన్న**

లేత మొగ్గల చూపులన్నీ సముద్రం మీదే ఉంటాయి. వేటకెళ్ళిన తమ తండ్రులూ, అన్నయ్యలూ యింకా రానందుకు వారి మొహాల్లో నిర్వేదం తొంగిచూస్తూ వుంటుంది. వారికే కాదు సముద్ర తీరంలో నిల్చొని ఎదురు చూస్తున్న అందరికీ అలానే ఉంటుంది. చేపల తట్ట మోసే అమ్మకోసం నీటి మీదికి వెళ్ళిన అయ్యకోసం ఆ కళ్ళు ఎదురు చూస్తుంటాయి.

"చేపల తట్టమోస్తూ అమ్మ / వంటి నిండా నీసు నింపుకొని / ఉప్పుచారలతో మెరుస్తూ / తీరం వెంట నడుస్తుంది సముద్రంలా / నీటి మీదికి వెళ్ళిన అయ్యని చూస్తూ / తిరిగి రాకకై అమ్మ కళ్ళు 'జెన' ఇదుస్తున్నవి / సకల సంపదయిన / అమ్మ ముంగిట్లోని గంగమ్మను / దళారులు నిత్యం కొల్ల గొడుతూనే ఉన్నారు / అయ్యను వెతుకుతూ అమ్మ గుండె / తెప్పలా తేలిపోయింది నీటి మీద / నిలువెత్తు నీళ్ళ నించి / కట్టు బట్టలతో మళ్ళీ ఏ గట్టుకో పయనమవుతుంటే / అంచనా బృందమొకటి అమ్మను అడుగుతుంది / నష్ట పరిహారానికేమో / మీకు ఏమన్నా పంట భూములన్నాయా అని / లేదు, "సముద్రముంది// అంది అమ్మ అమాయకంగా /"

**సముద్రం మాకు మిఠాయిపొట్లం. సముద్రపు హోరులే మాకు సప్తస్వరాలు వినిపిస్తాయి. సముద్రమే మా ఆకలికి అన్నం మెతుకు. మా ప్రశాంత ఆకాశాన్ని అల్లకొల్లోలం చేసి పారిశ్రామిక వాడలని కోస్టల్ కారిడార్లని మాయ మాటలతో మమ్మల్ని కొల్లగొట్టి మా శవాల్ని కాల్చుకోటానికి, పూడ్చుకోటానికి కూడా బారెడునేల లేకుండా చేస్తుంటే మా గుండెలకు అగ్గంటుకున్నాదని వాపోతున్నాడు సాగరపుత్రుడు.**

**ఎం. వెంకట్**

సముద్రం మాకు మిఠాయిపొట్లం. సముద్రపు హోరులే మాకు సప్తస్వరాలు వినిపిస్తాయి. సముద్రమే మా ఆకలికి అన్నం మెతుకు. మా ప్రశాంత ఆకాశాన్ని అల్లకొల్లోలం చేసి పారిశ్రామిక వాడలని కోస్టల్ కారిడార్లని మాయ మాటలతో మమ్మల్ని కొల్లగొట్టి మా శవాల్ని కాల్చుకోటానికి, పూడ్చుకోటానికి కూడా బారెడునేల లేకుండా చేస్తుంటే మా గుండెలకు అగ్గంటుకున్నాదని వాపోతున్నాడు సాగరపుత్రుడు.

"సముద్రపు హోరు వింటుంటే సప్తస్వరాలు / రంగరించి కర్ణపుటాల్లో ఒంపినట్టుంటుంది / పడవమీద కెరటాల పైకెళ్ళుతుంటే / అమ్మవడిలోకి ఆడుకోటానికెళుతున్నట్టుంటుంది / అందుకే ఆ తల్లికి పసుపు కుంకుమలు ప్రేమతో సమర్పించుకుంటాము / ఆ చల్లని గాలి సుతారంగా పీలుస్తుంటే / కడుపులో పెరిగిన గడ్డలు, పుళ్ళు, ఆవాంఛిత వ్యర్థాలు భస్మమైపోతాయి / ఆ గాలిని కడుపారా మింగుతుంటే / బలానికి టానిక్కు తాగినట్టుంటుంది / సముద్రమే మా ఆకలికి అన్నం మెతుకు / మా ఉట్టిమీద చద్దన్నం మాకది విహారయాత్రాస్థలం / మానీళ్ళను కొల్లగొట్టి, నేలను కొల్లగొట్టి / పచ్చదనాన్ని కొల్లగొట్టి, బతుకుల్ని చిదిమేసి / గుడిసెల్ని కూల్చి, ఊళ్ళకూళ్ళు కుక్కలు చింపిన విస్తరిచేస్తుంటే / గుండె గొంతులో కొట్లాడుతుంది / బతుకు చీక్కంపలో మేక తలకాయ అయ్యాక / జి.వోల పేరుతో మోసం చేస్తుంటే / గుండెలకు అగ్గంటుకున్నాది / కన్నీటి బిందువులు కడలి మీద త్రాసులై లేచి / సునామీలమై చుట్టేస్తాము /"

**జె.ఎన్.**

సముద్రం నేలమీద పరచుకున్న ఆకాశమైతే అందులో చేపపిల్లలై ఈదేవారు మత్స్యకార్మికులు. పోటెత్తిన తరంగాలే వాళ్ళపురిటిళ్ళు. ఆ సముద్రం మీద సందమామ వాళ్ళకు వెన్నెల దీపం. ఇప్పుడా సాగర తీరమ్మీద కల్లోల కెరటాలెగిసి పడుతున్నాయి నిప్పుకణికల రాచపుళ్ళతో ఆ తీరం తడారిన శోకమై ఉప్పొంగుతుంది.

"ఆకాశం నీలి కెరటాల సముద్రం / సముద్రం నేలమీద పరచుకున్న ఆకాశం / మధ్యలో వాళ్ళు / ఆకాశం మీద వల విసిరి / చేది, చేది తీరం మీద టెర్రెల్ని దులపరిస్తారు / పరచిన మత్స్య సంపద వాళ్ళకు / దాగ్రలో ఆరేసిన పూలరాశిలాగుంటుంది / సముద్రం మీద చందమామ వాళ్ళకో వెన్నెల దీపం / ఇప్పుడే వెన్నెల దీపాలారిపోతున్నాయి / ఆశలు బొమ్మిడాల్లా జారిపోతున్నాయి / రాబందుల రెక్కల చప్పుళ్ళకు / దిక్కుల్లేని సముద్రం మీద తీవ్ర వాయుగుండ మేర్పడింది / యిక్కడి బతుకుల్ని దూరంగా విసిరి గొట్టడానికి తీరం మీద కల్లోల కెరటాలెగిసి పడుతున్నాయి / తీరం యిపుడో తడారిన శోకం / పల్లే వాళ్ళ ఆల్చిప్పల కళ్ళలోంచి / కురిసే కన్నీళ్ళు సముద్రం / చందమామ వాళ్ళ సామూహిక సమాధి మీద దీపం /"

**సిరికి స్వామినాయుడు.**

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా తయారైంది మత్స్యకారుల పరిస్థితి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారి సంక్షేమం కోసం కొన్ని సబ్సిడీ పథకాలు ప్రకటించినా అవి అవినీతి అధికారుల చేతివాటంతో, దళారుల రంగ ప్రవేశంతో దారి మళ్ళిపోతున్నాయి. ప్రాణాలరచేతిలో పెట్టుకొని సముద్రంలో చేపల వేట కెళుతున్న మత్స్యకారులు ఇంటా బయటా దోపిడీకి గురవుతున్నారు. ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన లేకపోవడం అక్షరానికి దూరంగా శ్రమనే నమ్ముకొని జీవనం సాగిస్తున్న వీరి అమాయకత్వాన్ని అధికారులు దళారీలు కుమ్మక్కై సొమ్ము చేసుకుంటున్నారు.

"అతడక్కడే ఉండేవాడు / ఎగసేకెరటాల సాక్షిగా / పగలంతా ఇసుక తిన్నెల మీద / ఈ సముద్రం ఒడ్డునే అతడు కూర్చొని ఉండేవాడు / నైలాన్‌దారాలు ముందేసుకుని సరిక్రొత్త వస్తువును సృష్టించబోయే /



Feb 2010 _Final_Pages.pmd 14 1/28/2003, 2:20 PM

శ్రామికత్వాన్ని ప్రేమించేవాడు / కాలం అతని చేతుల్లో / ఒక్కో చేపకోసం ఒక్కోవలగా అల్లుకొని / మాగనమైన పనితనాన్ని తెప్పల భుజాల కెక్కించేది / ఈ దృశ్యంలో ఓ ప్రవేశం / ప్రత్యేక ఆర్థిక ప్రపంచంలో నుంచి / వెల్లువెత్తిన కంపెనీ కాలసర్పాలు / అతడి చుట్టూ కాంక్రీట్ శిఖరాలై పీటవేసాయి / పుట్టెడు ఆశతో వెళ్ళిన తెప్పలన్నీ / కలుషిత జలదేవత విదిల్చిన / అనంతమైన శూన్యాన్ని ఎత్తుకొస్తుంటే / సమస్తాన్నీ కోల్పోయిన బెస్త బ్రతుకులు / వస్తు బ్రతుకులయ్యాయి / ఇప్పుడు కూడా అతడక్కడే ఉన్నాడు / తన వాళ్ళ పిడికిళ్ళు ముడివేస్తూ / సరికొత్త మానవ వల అల్లుతున్నాడు / వేట సముద్రం మీదకి కాదు / ఒకానొక కుతంత్రం మీదకని చెప్పి / తెప్పల్ని నడిపిన తెడ్లన్నీ తిరుగుబాటు జెండాలు చేసాడు /"

**పాయల మురళీ కృష్ణ**

ఈ గంగపుత్రులకు సముద్రమంటే భయం లేదు నేల మీద మనుషులంటేనే భయం. గంగమ్మ తల్లిని నమ్ముకున్న బతుకుమాది మా పొట్టలు కొట్టకండి. ఇవాళ యుద్ధ మేఘాలు ఇనుప రెక్కలు కట్టుకొని సముద్రపు పొలిమేరల్లో పహారా కాస్తున్నై. మనిషి మనిషి కాల్చుకుతినే విష సంస్కృతి ఈ మనుషుల్లోనే మొదలయ్యింది అంటున్నాడు ఈ కవి.

"సముద్రమంటే మాకు భయంలేదు / నేలమీద మనుష్యులంటేనే మాకు భయం / మా బతుకులు మేం బతుకుతుంటే / ఇక్కడ ఓడరేవు కడుతున్నాం / మీరు మరో చోటు వెతుక్కోండి అంటే / కొంప గోడుతో వలతాడుతో ఎక్కడికి వెళ్ళేది / గంగమ్మ తల్లిని నమ్ముకున్నాం / ఎక్కడికి వెళ్ళినా సముద్రమే / తుఫానొస్తే చస్తామో బతుకుతామో మాకే తెలియదు / వేటకెళ్తే తిరిగొస్తామో రామో తెలియక / మాలో మేం అర్ధాకలితో బతుకుతున్నాం / మా పొట్టలు కొట్టకండి/"

**చొక్కర తాతారావు**

జాలారి జీవితంపట్ల జాలే లేని ప్రభుత్వం వారి సంక్షేమాన్ని గురించి ఆలోచించడం లేదు. సముద్రపు పోటు మరీ ఎక్కువగా వున్నప్పుడు తెప్ప పల్టీ కొట్టే ప్రమాదము కూడా లేకపోలేదు. కెరటాల తాకిడికి తెప్ప ముందుకు కదలదు. చీకటి రోజుల్లోనే చేప సమృద్ధిగా దొరుకుతుంది కాబట్టి అమావాస్య రోజుల్లోనే కళాసీలు వేటకు ప్రాధాన్యత ఇస్తారు.

"పేగుల్ని దారాలు చేసి / గుండెల మగ్గాల్తో / ఆశల వలలు అల్లుకున్న వాళ్ళు / సముద్రం సరిహద్దని తెలిసికూడా / సమీపాన బతికేవాళ్ళు / వారి గుడిసెలు ఎండిన ఆకుల శకలాలు / చీకటిలో నివసించేవారికి / సూర్య చంద్రులే వెలుగులు / బతుకులు భారమై / అప్పుల్లో బతికే వారికి / మార్కెట్ మాయాజాలంలో / మరబోట్లు పొందలేక / తమ శ్రమతో నిర్మించిన / కొయ్య పడవలే వారి వృత్తికి మూలాధారం / దళారీ దయాదాక్షిణ్యంతో / శ్రమకు సమం కాని కాసులే / వాళ్ళ బతుకు పూసులు / వారి శ్రమ దోపిడి ఫలితం / అనంత దుఃఖ భరిత దళారీ జీవితం / శిథిలమయ్యే వారి జీవితాలకు వెలుగెప్పుడూ / వారి వృత్తికి భుక్తికి / తగు హామీ రక్షణలెనప్పుడు / జాలర్లుగా జన్మించడం పాపమా? / నిరంతరం శ్రమించడం, రోదించడం వారికి శాపమా /

**సునారపు రామచంద్రరావు**

మత్స్యకారుల జీవితమే ఓ దుఃఖ సముద్రం. మారుతున్న పరిస్థితుల్లో జాలర్ల జీవితం ఎంతో దయనీయంగా తయారైంది. బతుకు వేటలో వారు సముద్రం మీద బెండ్లై తేలుతుంటారు. వారి ఒంటి మీద నైలాన్ తాళ్ళ నాగరికత బిగుసుకొంటోంది. వారి స్త్రీలు చేపల తట్ట మోస్తూ వంటి నిండా నీసు నింపుకొని తీరం వెంట నడుస్తూ వుంటారని ఈ కవి పేర్కొంటున్నాడు.

"సముద్రపు చీరకు భూమి కుట్టిన అద్దాల్లాంటి చేపలు / ఎరచివర పెట్టిన మాంసపు ముక్కలు తినడానికి కాదు / ఈ మత్స్య సుందరి శ్వేత వేలి చివరలు శ్వాసించడానికే వలలో పడివుంటాయి / రాముడు నిమిరిన చేతివేళ్ళు ఆనవాళ్ళుగా.. ఉడుతల్లా / మా మార్కెట్ బతుకు బండిపై పడగానే ఆమె చేతివేళ్ళు జారి అవి ఉప్పునీళ్ళు కన్నీళ్ళు విదిలించుకుంటాయి / మనుషుల్లోని పాపాల్ని కడిగే గంగాదేవిలా / గంగమ్మలోని కల్మషాన్ని కడిగిన హంసల దీవిలా / ఆమె చేపలోని మాలిన్యాన్ని తీసి కూర కనుకూలంగా చేసిస్తుంది / ఎలాంటి చేపనైనా ఒకే కత్తి పీటతో లొంగదీసే ఈమెని / పోస్టుమార్టమ్ చీఫ్‌ని చేస్తే / ఎలాంటి తిమింగలోనైనా న్యాయం వేపు తలలువంచుతాయి / ఎవరైనా మా వీధి కొచ్చి / చేపలోళ్ళ ఇల్లెక్కడ అని ఆమె గురించి అడిగితే / చేపల పొలుసులతో కొరడా చేసి వాళ్ళు నన్ను చళ్ళున చరిచినట్లు అవుతుంది /"

**కె. ఆంజనేయకుమార్**

తెరచాప ఎత్తడానిక్కూడా మనస్కరించని జీవితం, నట్టనడిసముద్రం మధ్య నిలబడిన జీవితం, గమ్యం తెలియని వేట బతుకొాక గాలి బుడగ. భూమ్మీద భరోసా లేని బతుకు. నీటి మీద కూడా తుఫాన్లూ, సుడిగుండాలే. క్షణక్షణమూ మృత్యుముఖాన నిలబడ్డ జీవితంలో మా జానెడు పొట్టకి ఎప్పుడూ కరువే.

"ఈ తెరసాప ఎత్తడానిక్కూడా నాకు మనస్కరించడం లేదు / నడిసముద్రం మధ్య నిలబెట్టుకున్న జీవితం / రాత్రి పగల్లు మరచి ఈ నీటి అంచున మీదే కదా / మా తలల్ని పగులగొట్టుకుంటున్నాం / భూమ్మీద భరోసా తక్కువైన బతుకుల్నే / ఇవ్వాళ నీటిమీద నిలబెట్టుకుంటున్నాం / ఇక్కడా తుఫానే.. సుడిగుండాలే కదా / ప్రతిక్షణాన్ని మృత్యు ముఖాన నిలబెట్టినా / మా జానెడు పొట్టకీ ఎప్పుడూ కరువే / తెడ్లమై కొంత కాలం.. తెరసాపై కొంతకాలం / గాలానికి ఎరలా కొంతకాలం / ఏది సొరచేపో... ఏది తిమింగలమో / అంతటా భయమే /"

**మోతుకూరి అశోక్‌కుమార్**

**తెరచాప ఎత్తడానిక్కూడా మనస్కరించని జీవితం, నట్టనడిసముద్రం మధ్య నిలబడిన జీవితం, గమ్యం తెలియని వేట బతుకొాక గాలి బుడగ. భూమ్మీద భరోసా లేని బతుకు. నీటి మీద కూడా తుఫాన్లూ, సుడిగుండాలే. క్షణక్షణమూ మృత్యుముఖాన నిలబడ్డ జీవితంలో మా జానెడు పొట్టకి ఎప్పుడూ కరువే.**



Feb 2010 _Final_Pages.pmd 15 1/28/2003, 2:20 PM

## బంగారు బాల్యం

**దుర్గాప్రసన్న**



ఆటల పాటల అల్లరిలో
చదువు సంధ్యల సాంగత్యంతో
కథలూ కలల సాహసమై
ఎదగాల్సిన బాల్యం...
తరగతి గదుల ఇరుకులలో
ఆటపాటలకు తావే లేని
సంకుచితమైన విద్యా విధానాలతో
కంప్యూటరూ, టి.విల
విషపు ఉచ్చులోబందీ అయిపోయింది.
ఆలోచనల రెక్కలతో
సాహసయాత్రలు చెయ్యాల్సిన బాల్యం
అనుబంధాల మధ్య
అనురాగాలతో గుబాళించాల్సిన బాల్యం....
అర్థం కాని భావోద్వేగంతో
తుపాకులలో రక్తపాతాల్ని
రేసులతో అర్థంలేని వేగాన్ని
కంప్యూటర్ 'కీ' బోర్డుతోనే
అందుకునే ప్రయత్నం చేస్తూంది.
తప్పు.. ఒప్పు తెలియని బాల్యానికి
ప్రపంచాన్ని శాసించే సైబర్ మాయ
'ఇంటర్‌నెట్' ఉచ్చులు వేసింది
మార్కెట్ మాయాజాలానికి
బాల్యం – అనే ఎరచిక్కింది
రేపటి యువత నిస్తేజమౌతూంది
రేపటి భవిత నిద్రాణమౌతుంది.
స్వార్థం వీడని రాజకీయం
రక్కస కోరలు చాచింది
ఆహారం, విద్య, వైద్యం
సక్రమంగా....
అందించాల్సిన ప్రభుత్వం
బంగారు బాల్యానికి
బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం....
అనారోగ్య కర (కల్తీ) ఆహారానికి
తెరచాటు సంకేతాలిచ్చింది
ముదిరిన రోగాలు, సహాయ 'చర్య' లంటూ
నివారణ, నియంత్రణ మాటే మరచింది
ప్రాథమిక విద్యా ప్రాధాన్యాన్నే ఏమార్చి
లంచాలతో, అవినీతితో
రాజకీయ లబ్దికి తెరతీసింది.

## సంకేతం

**జి. నరసింహమూర్తి**

రైతు కూలీలపై శ్రమ దోపిడీలు
పాలకులే వాళ్ల పాలిట గద్దలు
పై దేశాలకు కర్షకుల్ని ఎరగా పెట్టే
నాయక నక్కలు
సమాజాన్ని నమ్మించి దోచుకునే మోసగాళ్ళు
కాళ్లకింద కదిలాడే నదిలో నీళ్లు
పంట చేలు తడపడానికి
ప్రభుత్వాల దగ్గర ఉండవు డబ్బులు
గద్దె కోసం కోటాను కోట్లు ఎలక్షన్ల పాలు
నీటి చుక్కలాలని జలయజ్ఞాలు
పూడుతున్నాయి పంటకాల్వలు
అవుతున్నాయి చెరువులు మెరకలు
ప్రైవేటీకరణ నిత్య జపమంత్రాలు
అయిపోయాయి దేశ చమురు ఖనిజ అమ్మకాలు
నదీ సముద్రాల అమ్మకాల టెండర్లలో
బిజీగా ఉన్నారు నాయకులు
కంపెనీ కార్పొరేట్ సేద్యాలు
కర్షకుల్ని ఖైమా కొట్టి తినే విందులు
సెజ్‌లూ, కారిడార్లూ
అన్నదాతలకు అందాల అంపశయ్యలు
పొట్టకోసం వలస పరుగులు
చుట్టు ముట్టుతాయి కరువులు
ఇక ఆరోగ్యశ్రీలన్నీ ఆకలి చావులు
రానున్న బానిసత్వానికి సంకేతాలు

సముద్ర జీవన నేపథ్యంలో కెరటాలతో నిరంతరం పోటీపడుతూ చీకటి పడుతూ చీకటి ప్రయాణంలో వెలుగు కోసం, బతుకు తెరువు కోసం పోరాటం సాగించే వాడు 'జాలరి' నేడు మరపడవల సంగీతంలో బతుకుపాటను వెతుక్కొంటున్నాడు దగాపడ్డ జాలర్లే కాదు వీరు స్వరం మరిచిన కోకిలలు వీల్లు !–

*జాలరి / జల రహస్యం తెల్సిన రోజో / వల విసరడం ఒక్కటే చేతనైన సముద్రపు కూలీ / పడిలేచే కెరటాల రోడ్డుపైన / చుక్కల కళ్ళ టార్చిలైట్‌తో / నిద్రని ఆకాశానికి అంకితం చేస్తూ/ ఉప్పుటేరై సముద్రంలో తేలే మరబొమ్మకి / భూమిరాగమేం తెలుస్తుంది / బతుకు భారం తప్ప / మందుపాతర్ల కథలేం తెలుస్తాయి / రొయ్యరాసుల రహస్యాలు తప్ప / జల కాలుష్యంలో సర్వం కోల్పోయి / స్వరం మరచిన కోకిలలు వీళ్ళు / జలదోపిడీలో దగాపడ్డ జాలర్లు వీళ్ళు/"*

**పెరుగు రామకృష్ణ**

సముద్రాన్నే నమ్ముకున్న జాలరికి, వాడి గుండెల్లో దుఃఖసాగరం ఎగసిపడుతోంది. ఆ ఇసుకలోనే పుట్టి, పెరిగిన వాళ్ళకు నత్తగుల్లలే ఆట బొమ్మలు కల్లోల తరంగాలే స్విమ్మింగ్ పూల్స్, సముద్ర తీరమే వాళ్ళకు బడి. తాళిని ఓచేత్తో పట్టుకొని, ఆకలి కడుపును మరోచేత్తో పట్టుకొని భర్తను వేటకు పంపే ఆడవాళ్ళే మగువ మాంచాలమ్మకు ప్రతిరూపాలు.. అంటున్నాడు ఈ కవి –

*"నమ్మి మోసపోవడం అనాది ఆచారం / సముద్రాన్నే నమ్ముకున్న జాలరికి / వాడి గుండె లోతుల్లో దుఃఖసాగరం ఎగిసిపడుతోంది / ఎన్ని చేపలు మూకుమ్మడిగా శపించాయో / వారి జీవితనావ జీవనమరణ సరిహద్దు రేఖ పైనే / ఏ వల్లో ఏ ప్రమాదం దాగుందో / ఏ అలవెనుక ఏ మృత్యువు ముంచుకొస్తుందో / నిరంతరం... నమ్మకం లేని ప్రయాణం / ఏ రోజు కారోజు రాసుకునే ప్రాంసరీ నోటు /"*

**పెళ్ళూరు సునీల్**

ఇవాళ అధికార ప్రభుత్వ అండదండలతో మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. గ్రానైట్ పరిశ్రమల్ని తరలించుకుపోతున్నారు భూమిని ముక్కలుగా కోసి ఆక్రమించుకొంటున్నారు.


జాలరి బతుకులోని అంతరంగ సంఘర్షణను, దిక్కుల్లేని సముద్రం మీద వాయు గుండం దృశ్యాలను, ఇక్కడి బతుకుల్ని దూరంగా విసిరేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను, ఈ కవులు తమదైన శైలిలో, గంగపుత్రుల తడారిన శోకాన్ని ఆ శోకంలోంచీ కురిసిన కన్నీళ్ళ సముద్రాన్ని వీరి కవితల్లో ఆవిష్కరించారు.

■

కథ

# ఇనుప తెరల మధ్య

డా॥ బి.వి.ఎన్.స్వామి



***"ఎల్లవ్వా, చెంపకేమైందే"***

***"దెబ్బతాకింది"***

***"దెబ్బతాకిందా, మొగుడు కొట్టిండా"***

***"ఏదో ఒకటయింది. ఖరాబయిన నల్ల ఏదో చెప్పు"***

***"బాత్రూంల నల్లనీల్లు పోస్తలేదు. కొత్త నల్ల ఫిట్ చేయి"***

***"దీనికి వాచర్ ఒక్కటే పోయింది. అది ఏసుకుంటే అయిపోవు. సార్ కొత్త నల్ల తీసుకచ్చిండని పెడ్తున్న." అంటూ నల్ల బిగించి ఇచ్చినంత దబ్బు తీసుకొని బయల్దేరింది. "చాటుకు పెట్టుకుని ఏం తీసుకుపోతున్నావు" కసిరింది ఇంటావిడ.***

"ఖరాబైన ఈ నల్లను మీరు పాతసామాను కింద పారేస్తారు. దానికి వాడేమిస్తడు. దీనికి. కొత్త వాచరు పెట్టి ఎవరింట్లనన్న ఫిట్ చేస్తే నాలుగు పైసెలత్తయని ఆశతో కొంటవోతన్న

"నీ దగ్గర చాన ఇకమతులున్నాయే. ఎప్పుడు లేచి ఇంటిపని చేసుకుంటవోగని తెలార్తనే కరీంనగర్‌ల ఉంటావు.

"ఏంచేయాల్నవ్వా,ఎంత చేసినా ఎప్పటి చిప్ప ఎనుగుల్లనే అన్నట్లు చేసి,చేసి వాని తాగుడుకు పెట్టుడైతుంది "అనుకుంటూ వెళ్ళింది.

పల్లెటూరు నుండి కరీంనగర్‌కు వచ్చి, తనకు తెలిసిన మేస్త్రీ దగ్గర ప్లంబర్‌గా పనిచేసి రాత్రి వరకు పల్లెకు చేరుకోవడం ఆమె నిత్యకృత్యం. చిన్నప్పుడే తల్లిని పోగొట్టుకున్న ఎల్లవ్వను మేనమామ పెంచిపోషించిండు. మేనమామ ఇంట్లో ఎల్లవ్వ బట్టకు, పొట్టకు కరువు లేకుండా బతికింది. మేనమామ కొడుకు తనకంటె పెద్దవాడు. అతనితో ఆడుతూ, పాడుతూ బడికి దూరమై పెరిగింది. మొదటి నుండి ఎల్లవ్వ పనులలో దిట్ట తెలివిగలది. తన కొడుకు పనికి మాలినవాడని, మూర్ఖుడని కుమిలిపోయేవాడు. ఎల్లవ్వకు తన కొడుకునిచ్చి పెళ్ళి చేస్తే కనీసంగానైనా బతుకుతడని మేనమామ ఆశపడ్డడు. ఎల్లవ్వకు బావ మీద సదభిప్రాయం లేదు. కాలం గడుస్తుంది. ఎల్లవ్వ పెద్దదయింది. కొమురయ్యకు మీసం మొలిచింది. కాల పరీక్షకు తట్టుకోలేని మేనమామ శరీరం రాలుటకు సిద్ధమైంది. అటువంటి రోజులలో ఒకనాడు.

"ఎల్లవ్వా, ఇగరా" అంటూ పిలిచాడు.

"ఏంది మామ"

"నా పానం మంచిగుంట లేదు. ఎప్పుడు పోతనో తెలుస్త లేదు. నా ముంగట కోరంనితోని. నీ పెండ్లి చేస్త"

"....................................."

"నువ్వు మాట్లాడ్త లేవంటే నాకు సమజయింది. కొంరడంటే నీకు ఇష్టం లేదు. వాడిని ఇడ్సిపెడితే ఏమైతడో అని భయం వానికి నిన్ను జత చేస్తే నా ప్రాణం హాయిగా ఉంటుంది. అట్లగాక నీకు వేరోన్తోటి పెండ్లి చేయాలంటె కట్నం, గిట్నం కావాలి. అదో పెద్ద లొల్లి. అవి ఏన్నుంచి తేవాలెనేను. ఉన్న ఒక్క ఎకరం, నీ పెండ్లికి ఖర్చు పెడితె, తర్వాత కొంరడు ఏం చేసుకబతుకుతడు. దండ్ల, దీండ్లనే ముడేత్తే వాడు, నువ్వు చేసుక బతుకుతరు. ఇల్లు నిలవడ్డది అనిపిస్తంది."

"నీ యిష్టం మామ. నువ్వు చెప్పినట్టు ఇంట. బావను కూడా అడుగు"

"గాయిది మొకపోడు. గావాన్ని అడుగుడేంది"

నిశ్శబ్దంగా మంగళసూత్రం తలదాల్చింది. మౌనంగా సంసారంలోకి దిగింది. మేనమామ తనువు చాలించాడు. పని చేతగాని



Feb 2010 _Final_Pages.pmd 17 1/28/2003, 2:20 PM

భర్తకు, ఊళ్ళో పనులు లేకపోవటం వరమైంది. వ్యవసాయం చేసుకొనే కాలం కాకపోవటం, కూలిపనులు దొరకకపోవటం, ఆ కుటుంబాన్ని పీడించింది. తాగడం నేర్చుకొని భర్త అన్నీ మరిస్తే, భర్తను భరించటానికి ఎల్లవ్వ పనికోసం పరితపించింది. పనిని వెతుక్కుటూ పక్కనే ఉన్నో కరీంనగర్ బయల్దేరింది విషయం భర్త చెవిలో వేసింది.

"నేనెటు రాను. ఈ ఊర్లోకొంపయినా ఉంది. అక్కడికి పోతే అది కూడా ఉండది"

"ఈడ ఉండి ఏంజేస్తవు"

"ఉన్ననాడు తింట లేన్నాడు పంట"

అలాంటి మొండి సమాధానం విన్నా ఎల్లవ్వ తన ఊరి నుండి కరీంనగర్‌కు ప్రతిరోజు కూలిపనికి వచ్చి వెళ్ళేది. మొదట్లో ఆ పనీ ఈ పనీ చేసిన ఎల్లవ్వ నెమ్మదిగా ప్లంబింగ్ మేస్త్రీ దగ్గర కుదురుకుంది. చాలా వరకు పని నేర్చుకుంది. నీటి పైపులే గాక సెప్టిక్ ట్యాంకులకు పైపులు బిగించాల్సి ఉండడంవల్ల, ఆ వాసనల్ని భరించడానికి, పాన్ నమలడం నేర్చుకుంది. అది మెల్లగా గుట్కా నమలడానికి దారితీసింది. పొద్దునే తిని ఇంటి నుండి బయల్దేరిన ఎల్లవ్వ, రాత్రి వరకు ఇల్లు చేరుకునేది. ఇందుకు భిన్నంగా కొమురయ్య ఊర్లెనే ఉంటూ చేసేది లేక తాగుతూ, ఊరి వాళ్ళతో కయ్యాలు పెట్టుకుంటూ కాలం గడుపుతున్నాడు. తాగడానికి భార్యను డబ్బుకోసం పీడించడం మొదలుపెట్టిండు. మొదట్లో సహించిన ఎల్లవ్వకు,



రాను రాను సహించడం కష్టమైంది. తాగుడే పనిగా పెట్టుకున్న కొంరయ్యకు భార్య ధిక్కారం సహించడం కష్టమైంది. అది తీవ్రస్థాయికి చేరిన ఒకరోజు

"మా అయ్యే లేకుంటే నువ్వు దిక్కులేని దాని వయిదువు" అన్నాడు.

"ఇప్పుడు కూడా నేను దిక్కులేని దాన్నే" అంది

"మా ఆయ్య సాది సవరిత్తె గట్లంటవా" గుడ్లురుమిండు

"నిన్ను కట్టవెట్టి, దిక్కులేని దాన్ని చేసిండు"

"అంటే, నీ లెక్కల నేను సచ్చినట్టే కదా" అంటూ కొట్టిండు.

ఇద్దరి మధ్య రగడ రాజుకుంది. అయిష్టత, అసహనం, కోపం వారి మధ్య రాజ్యమేలినయి. ఇల్లు నరకమైంది. ఎల్లవ్వ డబ్బు సంచికే అతను చిల్లు పొడిచిండు. మద్యం అతని కాలేయానికే చిల్లు పెట్టింది. అది గ్రహించిన ఎల్లవ్వ అతనికి ఏదీ అందకుండా నాలుగు దిక్కులూ కట్టడి చేసింది. ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరి అయిండు. చేసేది లేక పగను పెంచుకున్నాడు. పరిస్థితులు ఇబ్బంది పెట్టినపుడు "మా ఆయన నిన్ను పెంచి పెద్ద చేసిండే, నువ్వు ఇప్పుడు నన్ను సాదాల్నే" అంటూ హుంకరించేవాడు. అతని మాటల్ని ఎన్నడూ లెక్కచేయలేదు. మిగిల్చిన డబ్బును చిట్‌ఫండ్ రూపంలో జమచేసింది. అదంతా ఒకరోజు చేతికి వచ్చింది. సంతోషంగా ఇల్లు చేరింది. తన కిష్టమైన చేపలకూర వండింది. కొంరయ్య కోసం చూసింది. రాత్రయిందని తిని పడుకొంది.

కరీంనగర్‌లో జరిగిన ఎలక్షన్ మీటింగ్ కోసం పార్టీ వారు భారీగా జనాన్ని సమీకరించింద్రు అందులో కొంరయ్య ఒకడు. మీటింగ్ పూర్తి అయ్యేసరికి రాత్రయింది. ట్రాక్టర్లతో ఎవరి ఊర్లలో వాళ్ళను దించి డబ్బులతో పాటు, ఎవరికి కావలసినన్ని వారికి సారా పాకెట్లు ఇచ్చింద్రు. కొంరయ్య సంచి సారా పాకెట్లతో, కడుపు సారాతో నిండింది. సగం రాత్రయింది. తాగిన కొంరయ్య తలుపు తోసుకొని ఇల్లు జొచ్చిండు. నాసిక, నాలుక చురుగ్గా పనిచేసినయి. చేపల పులుసు తోని తృప్తిగా తిన్నాడు. అలికిడి విన్న ఎల్లవ్వ నిద్ర లేచింది.

"తిన్నవా" ఆప్యాయంగా పలకరించింది.

"కూర మంచిగున్నది. చాలా రోజులాయె ఇట్ల తినక" అంటూ దగ్గర చేరిండు.

తననే మెచ్చుకున్నట్లు భ్రమించి, అతనికి మరింత దగ్గరయింది. ఆమె వాసన అతణ్ణి తట్టి లేపింది. ఆ సమయంలో తన వద్ద దాచిపెట్టుకున్న డబ్బు సంచి అతని కంటపడింది. ఇదేదీ ఆమె గ్రహించలేదు. కంటినిండా నిద్రతో ఆమె, తెచ్చుకున్న లిక్కర్‌తో అతను మిగిలిన రాత్రి గడిపింద్రు. ఎల్లవ్వ నిద్రలేచి డబ్బు సంచి కోసం వెదికింది. కొంరయ్య దగ్గర కనపడింది. లాఘవంగా లాగి బొడ్లో దోపుకుంది.

"ఎల్లీ... " కోపంతో అరిచిండు.

"పొద్దెక్కనే లేదు. తాగినవా" అంది.

"అసలు నేను పంటె కదా. రాత్రంత తాక్కుంటనే ఉన్న. గన్ని రూపాయలు ఎక్కడియె"

"నీకెందుకు"

"ఎవడిచ్చిండే నీకు అవన్నీ"

"నోర్మూయ్"

"నన్ను నోర్మూయ్యమంటవా అంటూ చేతి కందిన కర్రనొక దాన్ని విసిరిండు తప్పించుకుంది. ఉగ్రుడై ఊగుతూ లేచిండు అనుకోని ఉపద్రవానికి జడిసి భయంతో బజార్లోకి పరుగెత్తింది. ఆమె వెంటబడ్డాడు. ఆ పరుగు పక్కనే ఉన్న మెయిన్ రోడ్ ఎక్కింది. వేగంగా పరుగెత్తిన కొంరయ్య మెయిన్ రోడ్‌పై ఆమెను పట్టుకున్నడు. విపరీతంగా కొట్టి, డబ్బు సంచితో పాటు చీర కుచ్చిళ్ళు కూడా ఊడి వచ్చినయి. సిగ్గుతో రోడ్డుపై కూలబడింది. చల్లారిన సముద్రంలా అతను వెళ్ళిపోయిండు.

ఆ సంఘటన తరువాత ఎల్లవ్వ ఊరు విడిచింది. కరీంనగర్‌లో అద్దె రూంలో స్థిరపడింది. పల్లెటూర్లో కొంరయ్య, పట్నంలో ఎల్లవ్వ. అలా కాలం దొర్లుతూ ఉంది. ఎల్లవ్వ మొగుణ్ణి వదిలేసిందనే వార్త ప్రపంచం అంతా తిరిగి ఎల్లవ్వ చెవిలో దూరింది. అయినా లెక్క చేయలేదు. పట్నంలో పట్టించుకునే వాడేలేదు. ఎల్లవ్వ విషయం పట్నంలో చాలామందికి తెలియదు. కరీంనగర్ ఆమెకు కొత్త కాదు



Feb 2010 _Final_Pages.pmd 18 1/28/2003, 2:20 PM

కనుక పని దొరికేది. ఇక్కడికి వచ్చినాక ఆమె ఎన్నడూ పస్తులుండలేదు. తాగుబోతు మొగని బాధలేదు. ఉన్నతలో నిశ్చింతగా, సుఖంగా కాలం వెళ్ళదీసింది.

పల్లెటూర్లో కొంరయ్య దొరికింది తాగుతూ, పనీపాట లేక పస్తులతో కాలం గడుపుతున్నాడు. ఎల్లవ్వ తోడుగా ఉన్నప్పుడు లేని బాధలు, ఇప్పుడతణ్ణి చుట్టి ముట్టినయి. అందిన చోటల్లా అప్పులు చేసిండు. చివరకు తెలిసిన వాళ్ళిద్దర్ని అడుగుతూ ఒకట్రండ్రోజుల్లో ఎల్లవ్వను చేరిండు. ఆమె ముందు కెళ్ళాలంటె వెనకా ముందయింది. తాగి ముందు నిలబడ్డడు.

"ఎల్లీ ! మొగున్ని ఇడ్సి పెద్దామనుకున్నావే" గద్దించాడు. ఎదురుగా నిలుచున్న కొంరయ్యను చూసి ఆశ్చర్యపోయింది. చీదరించుకున్నది. తిట్టింది. వెళ్ళి పొమ్మని అరిచింది. అతడూ అరిచాడు. ఈ అరుపులు చుట్టుపక్కల వాళ్ళు విని చూసింద్రు.



"ఇల్లు, వాకిలి వదిలింది. మొగుడు అక్కరకు రాకుంటయిండ, ఒంటరిగ తిని, తిరగ మరిగింది. బతికున్న మొగున్ని ఇడిసి ఒక్కతి వేరుండుడేందో జరంత అడుగుండ్రి" అంటూ అందర్ని చూస్తూ అనేక కూతలు కూసిండు.

మంది మౌనంగా ఉన్నారు. గుట్టుగా ఉన్న తనను బజారు కీడ్చిండని ఎల్లవ్వ మండింది. అందరూ చూస్తుండగానే బలంగా అతని డొక్కలో తన్నింది. ఒంట్లో శక్తిలేని అతను ఎంగిలాకులా ఎగిరి అంత దూరంలో పడ్డడు. వెంటనే లేచి పక్కనే ఉన్న బండరాయి గురి చూసి విసిరిండు. రాయితాకి ఎల్లవ్వ తల నుండి నెత్తురు చిమ్మింది. ఇగ ఆగలేక విచక్షణా జ్ఞానం మరచి మూలనున్న రోకలి బండతో తలమీద మోదింది. అతనికి చుక్కలు కనిపించాయి. ఆ తరువాత అనంతం లో ఐక్యమయ్యాడు. అది గ్రహించిన ఎల్లవ్వ నేరుగా వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయింది. జైలు పాలయింది.

చాన్నాళ్ళకు విడుదలయింది. తల్లి గర్భం నుండి వచ్చిన పిల్ల పరిస్థితామెది. బోరుమనడం తప్ప ఏం చేయాలో తెలియదు. ఆత్మ విశ్వాసంతో లోకాన్ని చూడలేకపోతుంది. నాలుగడుగులు ముందుకేసి రోడ్డుపైకొచ్చింది. అక్కడి నుండి బస్‌స్టాండ్ వైపు మళ్ళింది. ఎండచుర్రమంటుంది కడుపుకాలుతుంది. నేల భగ్గుమంటుంది. పట్టపగలు ఆమెకు చీకట్లు కనిపించాయి. రోడ్డు పక్క మూలమీదున్న వేపచెట్టు నీడలో పడిపోయింది. ముగ్గు బుట్టలా ఉన్నతల, చీకి పారేసిన ఐస్‌క్రీం పుల్లలా ఉన్న కాళ్ళు చేతులు, మట్టికొట్టుక పోయిన చీర, ఆమె స్థితి చూపరులను కలచివేసేదిగా ఉంది. సూర్యుడు చల్లబడ్డాడు. ఎల్లవ్వ కళ్ళు తెరిచింది. లేని ఓపికను తెచ్చుకొని కూర్చుంది. తన చుట్టూ ఉన్నా చిల్లర పైసలను చూసి ఆశ్చర్యపోయింది. ఏడువలేక నవ్వుకుంది. గబగబా ఏరుకుంది. తన ఊరిబస్ ఎక్కింది. ఊరి మొదట్లో దిగింది. రాత్రయింది. మెల్ల మెల్లగా తనింటి వైపు అడుగులేసింది. దాదాపు వీధి అంతా నిర్మానుష్యంగా ఉంది. ఇల్లు చేరింది. మసక వెలుతురులో ఇంటిని పరిశీలించింది. ఇల్లు కూలింది. చెత్తా చెదారం నిండింది. ఇంటి కంటే రోడ్డు బాగానిపించి, అక్కడే కూలబడింది. భోరుమంది. తనివితీరా ఏడ్చింది. గుండె పగిలేలా ఏడ్చింది. బరువు దిగేవరకు, ఓపికున్నంత వరకు ఏడ్చింది. ఇక ఏడవలేక నేలపై ఒరిగింది.

ఏ ఏడుపుకు చుట్టుపక్కల వాళ్ళు వచ్చింద్రు, వాళ్ళలో చిన్న, పెద్ద, నడీడు, ఆడ, మగ, అందరూ ఉన్నారు. ఎల్లవ్వను గుర్తుపట్టలేదు. అలికిడి అయినా ఎల్లవ్వ కళ్ళు తెరువలేదు. నలుగురైదుగురు వృద్ధులు తమలో తాము చర్చించుకున్నారు. ఆమెను ఎల్లవ్వగా గుర్తించింద్రు. లేచి కూర్చో బెట్టిండు, ఒకామె తనను తాను పరిచయం చేసుకుంది. ఎల్లవ్వ కళ్ళలో కాంతులు పూసినయి.

"ఈ రాత్రికి మా ఇంట్ల పండువురా" అంది.

"నేను రాను" తిరస్కరించింది

"నా బిడ్డ తోటి బువ్వ, కూర పంపుత తిను" అంది.

"మంచిది" తలూపింది.

ఆ రాత్రి ఆమె కడుపులో నాలుగు ముద్దలు, చెంబెడు నీళ్ళు పడ్డయి. లేచి ఇంటి అరుగు శుభ్రం చేసుకొని ఒరిగింది. రాత్రి గడిచి, తెల్లారింది.

ఎల్లవ్వ వచ్చిందనే వార్త ఆ వీధి అంతా పాకింది. ఆమె పరిస్థితికి అందరూ జాలిపడ్డారు. జాలిపడ్డవారు అన్నం పెట్టింద్రు. వద్దనకుండా తింటూ గడిపింది. రెండు రోజులు గడిచినయి. మూడోరోజు పస్తు పడుకుంది. నాలుగోరోజు ఏంచేయాలో ఆలోచించింది. పనిచేయడానికి బలం లేదు. తిండి దొరికే దారిలేదు. భూమి, ఇల్లు రెండూ కూడా కొంరడు అమ్ముకున్నడని ఆ నాలుగు రోజుల్లో గ్రహించింది. ఇల్లు కొన్న మనిషి ఇటువైపు రావడం లేదు కనుక తనకు ఆ మాత్రం అరుగు దొరికిందని అర్థమయింది అభిమానం చంపుకొని, అడుక్కోవడానికి సిద్ధపడింది.

ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటలకు పదిళ్ళు తిరిగేది. "చలి బువ్వ ఉంటె ఎయ్యిండ్రి బాంచెన్' అంటూ అడిగేది. మరల రాత్రి "బుక్కెడు బువ్వ ఉంటె ఎయ్యిండ్రి బాంచెన్" అని తిరిగేది. మిగతా రోజంతా అరుగు మీద ముడుచుకొని పడుకొనేది. అర్థాకలితో కాలం గడిపింది. కాలంలో వచ్చిన మార్పులు, కాపురాలను ప్రభావితం చేసినయి. మిగలకుండా వంటలు చేసుకుంటున్నారు. వారికది అవసరం ఎల్లవ్వకు అది అశనిపాతం.

"బుక్కెడు బువ్వ ఎయ్యిండ్రి బాంచెన్" అర్థింపు.

"పనీ, పాట లేదానే నీకు" కొందరి విసుగు

"పని చేసుక బతుకరాదె" కోపంతో కూడిన సలహా

ఇలాంటి మాటలు వింటూ కూడా అడుక్కునేది. కొన్నాళ్ళకు ఆమె ముఖం మీదే తలుపు వేసుకున్నారు. చివరకు అడుక్కొనుడు మానింది.



Feb 2010 _Final_Pages.pmd 19 1/28/2003, 2:20 PM

# రెక్కలు

## వంగర పరమేశ్వరరావు



ఏది
నీతోనే ప్రారంభం కాలేదు
ఏదీ
నీతోనే ముగిసిపోదు–

నువ్వు
సింధువులో బిందువే !

పలక
బలపంతోనే
అక్షరం
రూపుదిద్దుకోదు–

ఆకాంక్షే
బీజం !

రేపటిని
ఈనాడే
దర్శించేవాడే
దార్శనికుడు–

సమాజ చుక్కాని
కవి !

విత్తును బట్టి
చెట్టు
చెట్టును బట్టి
ఫలం–

బీజమే
వృక్షం !

కలలు
కలలే కొందరికి
స్వప్నాలు
సాక్షాత్కారాలు మరికొందరికి–

ప్రయత్నం
ఫలరూపం !

నాన్న
కష్టం
అమ్మకే
తెలుసు–

పొయ్యి సెగ
పొంతదే !

ప్రపంచ రంగస్థలం
నిన్న ఒకరిది
నేడు నీది
రేపు వేరొకరిది–

కాలపీఠం
ఎవరి సొత్తు కాదు !

కౌరవులు
వందమంది వున్నా
విజయం
పంచపాండవులదే–

సంఖ్యా బలం
గెలుపు కాదు !

నేల
సారాన్ని బట్టి
పంట
చేతి కొస్తుంది–

మనసులోంచే
మాట !

---

ఆలోచించింది. చావే మార్గంగా తోచింది. వెంటనే బయల్దేరి వ్యవసాయ బావిలో దూకింది. చూసినవారు, బయటకు తీసిండ్రు. తలకు తాకిన బలమైన గాయంతో అరుగెక్కింది. కనీసం చూడటానికి కూడా దిక్కులేదు. మానసికంగా కుంగిపోయింది. శరీరకంగా బలహీనపడింది. కాలం గాయాన్ని మాన్పింది. కాని ఆకలిని తీర్చలేకపోయింది. ఆకలికి, దప్పికకు తాళలేక కనబడిన వాళ్ళనందరిని అడుక్కుంది. ఇవ్వకపోతే తిట్టడం మొదలుపెట్టింది. తన అరుగుమీద ఎండవస్తే, ఎదుటి వాళ్ళింటి అరుగెక్కి నీడకు పడుకునేది. ఎల్లవ్వ చేష్టలు వీధిలో వాళ్ళకు కొత్తగా కనబడ్డయి. కొందరు సానుభూతి చూపితే, మరికొందరు తిట్టడం మొదలు పెట్టిండ్రు.

ఒకరోజు అర్ధరాత్రి, ఎల్లవ్వ మెల్లగా పాత పెంకిటిల్లు ఎక్కింది నెమ్మదిగా వంటింటి వైపు వెళ్ళింది. చప్పుడుకు ఇంటామె లేచింది. "ఎవలుల్లా అంటూ అరిచింది. చప్పుడు లేదు. దొంగా, దొంగా అంటూ అరిచింది. పదిమంది గుమిగూడిండ్రు. అందులో ఒకడు గుర్తుపెట్టి ఎల్లవ్వా! అని పిలిచిండు

"ఏందన్నా
"ఏం చేస్తన్నవే"
"గూన సదురుతున్న"
"నీ యవ్వ.. గీ సీకట్ల సదురుడేందే"
"దొంగతనానికి వచ్చింది" అందులో ఒకరు
"వంటింట్ల నుంచి ఇంట్లకు దిగుదామనుకుంది" మరొకరు.
"దాన్నీ పట్టుకొండి" పదిమంది అరిచిండ్రు,

ఈ హడావిడి అంతా గమనించి ఆమె మరోవైపు దూకింది. అందరు ఆవైపు వెళ్ళే సరికి చీకట్లో మాయమైంది.

"ఎసొంటి మనిషి ఎట్లయిపాయె" ఒకరి సానుభూతి

"సింగులు చెక్కిందంటె, నడుం లేపకపోవు" మరొకరి నిట్టూర్పు.

"వాడకట్టోల్లం దీనితో జాగ్రత్త గుండాలె" వృద్ధుని సలహా

"అరేయ్ ! అదెటుపోయిందో చూడు పోర" ఒకరి పురమాయింపు!

గుంపు నుండి ఒకతను ఎల్లవ్వ వెళ్ళినదిక్కు బయల్దేరిండు. పరుగెత్తుతున్న ఎల్లవ్వ కనిపించింది. వెంబడించిండు.

పరిగెత్తి, పరుగెత్తి మెయిన్‌రోడ్‌పై కాలు మోపింది. అంతా నిర్మానుష్యం. ఉచ్వాస, నిశ్వాసలు వినిపిస్తున్నాయి. ఆమె ఆగింది. వెనక వచ్చినవాడు నిలబడి చూడసాగిండు. ఆమె అక్కడ నిలబడి ఆకాశంలోకి చూస్తూ చేతులెత్తి అరిచింది. నెత్తి కొట్టుకొంది. వెనకనే వచ్చినవాడు తిరిగి వెళ్ళిపోయిండు. ■



Feb 2010 _Final_Pages.pmd 20 1/28/2003, 2:20 PM

# నల్గొండ జిల్లా వ్యావహారిక భాష

కేశబోయిన రవికుమార్

*నల్లగొండ జిల్లాలో ప్రధానంగా మాట్లాడే భాష తెలుగు. దీనితో పాటు ఉర్దూ, లంబాడి మాండలికాలు కూడా వాడుకలోనున్నాయి. ప్రజల వాడుకలో ఉన్న భాష ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. నన్నయ కాలం నాటి తెలుగుకూ, నేటి తెలుగుకూ ఉన్న భేదం మనకు తెలిసిందే. భిన్న కాలాల్లో ఉన్న భాషలోనే కాక ఏకకాలంలో ఉన్న భాషలో కూడా ఈ భేదం కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు మాట్లాడేది తెలుగు భాషే ఐనా అది అంతటా ఒకే రూపంలో వినిపించదు. ఒకే భాషలో ప్రజల వ్యవహారంలో, పదాల్లోనూ, ఉచ్చారణలోనూ, పదాల అర్థాల్లోనూ, ప్రత్యాయాల్లోను తేడాలుంటాయి.*

నల్గొండ జిల్లా అనగానే రజాకార్ల ఉద్యమం, నైజాం ప్రభువుకు వ్యతిరేకంగా పాడిన బండి యాదగిరి గారి గేయం గుర్తుకొస్తుంది.

బండెనక బండి గట్టి
పదహారు బండ్లు గట్టి
నువ్వు ఏ బండ్లె పోతవ్ కొడుకో
నైజాం సర్కరోడా
నాజీల మించినవురో
నైజాం సర్కరోడా
"చుట్టూ ముట్టూ సూర్యాపేట
నట్ట నడుమ నల్లగొండ"

పై గేయంలో నల్లగొండ జిల్లా తెలంగాణా నడి బొడ్డున ఉన్నట్లుగా గమనించాలి. ఈ నల్లగొండ జిల్లా ఉద్యమాల ఖిల్లాగా పేరుగాంచింది.

తెలంగాణా జిల్లాలన్నీ కూడా దాదాపుగా పొరుగు రాష్ట్రా సరిహద్దుల్లోనే ఉన్నవి. ఉదా! వరంగల్లు, ఖమ్మం మధ్యప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు. మెదక్, మహబూబ్‌నగర్ కర్ణాటక సరిహద్దు. ఆదిలాబాద్, నిజమాబాద్ మహారాష్ట్ర సరిహద్దు. ఈ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న భాషపై దాదాపు ఆయా రాష్ట్రాల భాష ప్రభావం ఉంది. ఉదా : మధ్యప్రదేశ్ రాష్ట్ర భాష హిందీ ప్రభావం, కర్ణాటక రాష్ట్ర భాష కన్నడ ప్రభావం, మహారాష్ట్ర భాష మరాఠి ప్రభావం పైన పేర్కొన్న జిల్లాల సరిహద్దుల్లో మనం గమనించవచ్చు.

నల్లగొండ జిల్లాలో ప్రధానంగా మాట్లాడే భాష తెలుగు. దీనితో పాటు ఉర్దూ, లంబాడి మాండలికాలు కూడా వాడుకలో వున్నాయి. ప్రజల వాడుకలో ఉన్న భాష ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. నన్నయ కాలం నాటి తెలుగుకూ, నేటి తెలుగుకూ ఉన్న భేదం మనకు తెలిసిందే. భిన్న కాలాల్లో ఉన్న భాషలోనే కాక ఏకకాలంలో ఉన్న భాషలో కూడా ఈ భేదం కనిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు మాట్లాడేది తెలుగు భాషే ఐనా అది అంతటా ఒకే రూపంలో వినిపించదు. ఒకే భాషలో ప్రజల వ్యవహారంలో, పదాల్లోనూ, ఉచ్చారణలోనూ, పదాల అర్థాల్లోనూ, ప్రత్యాయాల్లోను తేడాలుంటాయి. ఒకే భాషకు చెందిన ఈ భేదాలను మాండలికాలు అని అంటారు. ప్రాంతాన్ని బట్టి, వృత్తిని బట్టి, విద్యార్హతలను బట్టి వేరు వేరు మాండలికాలు ఏర్పడతాయి.

ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారి వృత్తిపద పరిశీలన ఆధారంగా తెలుగు దేశాన్ని నాలుగు భాషా మండలాలుగా విభజించవచ్చునని తెలిపారు. అవి 1. పూర్వ మండలం (శ్రీకాకుళం, విశాఖ పట్టణం జిల్లాలు) 2. దక్షిణ మండలం (రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు) 3. ఉత్తర మండలం (తెలంగాణా, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో కోస్తా, రాయలసీమను ఆనుకున్న తాలూకాలు ఆయా భాషా మండలాల్లో కలుస్తాయి) 4. మధ్య మండలం (ఉభయ గోదావరులు, కృష్ణా, గుంటూరు జిల్లాలు) ఈ విభజన ప్రకారం నల్లగొండ జిల్లా ఒక ప్రత్యేకమైన భాషా మండలం కాదు. ఈ జిల్లాలో వాడుకలో ఉన్న మాండలిక / వ్యవహారిక పదాలు తెలంగాణా జిల్లాలన్నింటిలో కనిపించినా కొన్ని పదాలు నల్లగొండ జిల్లా వ్యవహారంలో మాత్రమే ఉన్నాయి"



Feb 2010 _Final_Pages.pmd 21 1/28/2003, 2:20 PM

బాగా పరిశీలించినట్లయితే తెలుగు దేశంలోని అన్ని జిల్లాల వాడుక భాష ఒకేలా ఉండదు.

**నల్లగొండ జిల్లాలోని వ్యావహారిక పదాలు**

ఈ జిల్లాలో వ్యవహరించే పదాల విషయంలో కనబడే ప్రత్యేకతలు, మరియు ఉదాహరణగా చూపబడ్డ పదాలు విద్యావంతులైన శిష్టుల వ్యవహారం నుండే కాక జానపదుల వ్యవహారం నుండి కూడా గ్రహించబడ్డాయి.

1.తెల్లవారు జామున : చీకటి మొఖాన, రేఖలు బారంగ, కోడి కుయ్యంగ తెల్లరుగట్ల అని వ్యవహరిస్తారు.
2.మధ్యాహ్నము : పగలు, పైటీలు, ఎండాల్టపుడు అంటారు.
3.రాత్రి : సందకాడ, మాపటికి.
4.సూర్యాస్తమయం : పొద్దూ....కాల, పొద్దుగూకంతల.
5.నిన్న రాత్రి : నాతిర
6.తరువాత : అయింటిక, అంటెంక.
7.మెల్లగా : మొయినంగ
8.ఆగు అనుటకు :తస్ (ఇద్దరు పెద్దలు వ్యవహరిస్తుంటే మధ్యలో ఎవరైనా మాట్లాడితే దీన్ని 'తస్'ను ఉపయోగిస్తారు.

**ఇద్దరు మాట్లాడేటపుడు**

నేను సుద్ద, నువ్వు సుద్ద, నేను సుగ / సగ, నువ్వుసుగ / సగ
9.అక్కడ : ఆడ / గాడ, ఎక్కడ = యాడ, ఇక్కడ = యీడ / గీడ
10.మోతాదు : చలాబత్.

**శరీర భాగాలను ఆకృతిని బట్టి వ్యవహరించుట**

1.పొట్టిగా ఉంటే : జిట్టోడు
2.ఎదుగుదల లేకుంటే : నకిరం బట్టినోడు
3.బక్కగా / సన్నగా ఉంటే: వొక్కోడు / నట్ట గజ్జలోడు
4.సన్నగా ఎత్తుగా ఉంటే: డొక్కోడు
5.కాళ్ళు వంకరబోతె : మద్దకాళ్ళోడు ఇవేకాక
6.తెలిసీ తెలియకుంటే : వొచ్చిరానోడా / వొచ్చిరానిదాన
7.పొలం కాడ్కి: సేను కాడ్కి, ఏతులు, ఎచ్చులు అనేవి కూడా ఉన్నాయి.

**ధ్వనులు మార్పులు**

అచ్చుల్లో పర్యాయ రూపత

ఎ. పదాది అచ్చుల్లో

అ – ఈ

సారి – సిరి (వెనుక సీరి) ఇ–ఉ

ఇసుక – ఉషిక / ఉష్కె.

ఇ. – ఒ/ఓ ఎ–ఒ

పిల్ల – పొల్ల / పోరి రెండు – రొండు

బి. పద మధ్య అచ్చుల్లో

అ – ఆ

దినం – దినాం (ప్రతి దినం / ప్రతిరోజు)

అ – ఇ

తడక – తడికె.

సి. పదాంత అచ్చుల్లో

అ – ఎ

జలగ – జనిగె

అటిక – అటికె

మడిగ – మడిగె.

**హల్లుల్లో పర్యాయ రూపత**

ఎ. పదాది అచ్చుల్లో

| | | | |
|---|---|---|---|
| 1. | జ – | ద | |
| | జంట | – | దంట |
| 2. | న – | ల | |
| | నోటు | – | లోటు |
| 3. | మ – | న | |
| | మిర్పకాయ | – | మిర్పకాయ |

బి. అపదాది హల్లుల్లో

| | | | |
|---|---|---|---|
| 1. | గ – | య | |
| | కాగితం | – | కాయితం |
| 2. | జ – | ద | |
| | సజ్జలు | – | సద్దలు |
| 3. | ద – | జ | |
| | బుదారం | – | బుజారం |
| 4. | య – | ల | |
| | అన్యాయం | – | న్నేలం / అన్యాలం |
| 5. | ర – | ల | |
| | ఎవరు | – | ఎవలు / వొవలు |
| 6. | వ – | గ | |
| | పిల్లవాడు | – | పిల్లగాడు / పొల్లగాడు |
| 7. | వ – | యి | |
| | అవి – | అయి | |
| | ఇవి – | ఇయి | |
| | బావి | – | బాయి |
| | కావించు | – | కాయించు |

**వర్ణ లోపం**

ఎ. పదాద్యక్షర లోపం

వెల్లిగడ్డ – ఎల్లిగడ్డ

వ్యవసాయం – ఎవుసాయం / ఎగసాయం

బి. పద మధ్య వర్ణ లోపం

ఉరికె – ఊకె

వెడలు – ఎల్లు

ఊరుకో – ఊకో

బతిమిలాడు – బతిలాడు

సి. ద్విత్వ లోపం

పిల్లగాడు – పిలగాడు

డి. అపదాది హ్రస్వాచ్చు లోపం

1. క – చ నాకు చదువు రాదు – నాక్చదువు రాదు
2. ట – క పుట్టుక – పుట్క
3. ట – ప అటుపక్క – అట్టక్క
4. (ఎ) డ – ద ఆడిదాంక – ఆడ్దాంక
   (బి) డ – ఆడది – ఆడ్డి

**వర్ణాగమం**

అప్పుడు – గప్పుడు
ఇక్కడ – గిక్కడ
ఆయన – గాయన
ఈడ – గీడ

ఆవు, ఆరు, ఆట, ఆము, ఆలు, ఈగ, ఈక, ఈత మొదలైన పదాల్లో త్రికం లేదు కనుక వీటి 'గ' కారం ఆగమంగా వచ్చి గావు, గారు, గాట మొదలైన రూపాలు ఏర్పడవు. జానపదులు కూడా ఈ పదాలను గకారాగమంతో వ్యవహరించరు. అంటే ఈ గాకారాగమం వచ్చే నియమానికి సంబంధించిన ఈ వివరాలేవి తెలియకున్నా నియమం ప్రకారమే వారి వ్యవహారం జరగటం గమనించ దగ్గ విషయం.

## 2. నామ విభక్తులు

**1.ప్రథమా బహువచనం :**

కన్ను, పళ్ళు మొదలయిన శబ్దాల బహువచన రూపాల్లో అంతకు ముందున్న 'ండ్లు' స్థానంలో 'ళ్ళు' ఉన్న రూపాలే ఇతర మాండలికంలో కనిపించినా 'ండ్లు"తో కూడిన రూపాలే నల్లగొండ జిల్లా వ్యవహారంలో కనిపిస్తాయి.,

' ళ్ళు – 'ండ్లు'

ఉదా కళ్ళు – కండ్లు
పళ్ళు – పండ్లు
ఏళ్ళు – ఏండ్లు
ఇళ్ళు – ఇండ్లు
ముళ్ళు – ముండ్లు మొదలయినవి.

**2. ద్వితీయ విభక్తి :**

కొన్ని బహువచనానంతర పదాల మీద ద్వితీయ విభక్తి ప్రత్యయానికి లోపం కనిపిస్తుంది.

ఉదా : ఎడ్ల మేపుకొని వచ్చిందు (ఎడ్లను)
మమ్ముల రమ్మన్నరు (మమ్ములను)

**3. తృతీయా విభక్తి**

'తో' అనే తృతీయా విభక్తి ప్రత్యయంతో పాటు తోని, తోటి అనేవి కూడా నల్లగొండ జిల్లా వ్యవహారంలో ఉన్నాయి.

ఉదా :పెన్నుతోని – పెన్నుతోటి
ఆయనతోని – ఆయనతోటి మొదలయినవి

**4. చతుర్థీ విభక్తి**

'కొరకు' అనే అర్థంలో వాడబడే 'కోసం' అనేది కోసానికి / కొసానికి అనే రూపాల్లో కూడా వాడబడుతుంది.

ఉదా : ఆయన కోసానికి, ఆయన కోసానికి

ఇక్కడ 'కోసం' అనే శబ్దం పైన షష్ఠీ ప్రత్యయమైన 'కు' ప్రత్యయం చేరిందన్నమాట.

**5. షష్ఠీ విభక్తి :**

నామ వాచకాల్లో 'డు' వర్ణం ప్రథమేతర విభక్తులు పరంగా ఉన్నప్పుడు 'డి' వర్ణంగా మారితే ఈ జిల్లాలో మాత్రం 'ని' వర్ణంగా మారడం కనిపిస్తుంది.

వాడికి – వానికి
దేవుడికి – దేవునికి
అల్లుడికి – అల్లునికి

**6. సప్తమీ విభక్తి :**

సప్తమీ విభక్తిలోనూ, నిర్ధారణ షష్ఠీలోను వచ్చే "లో" ప్రత్యయం నల్లగొండ జిల్లా వ్యవహారంలో కొన్ని పదాలపై 'ల' గానూ, కొన్ని శబ్దాలపై 'లె' గానూ మారుతుంది.

ఉదా : ల – ఇంట్ల (ఇంట్లో)
లె – కంట్లె (కంట్లో)

పైన పేర్కొన్న విభక్తి ప్రత్యయాలే కాక ఆయా అర్థాల్లో కింద పేర్కొన్న విభక్తి ప్రతిరూపకాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.

ఉదా : పొంటి / పొంట : ఇవి వెంబడి, వైపు, దిశగా, మీదుగా అనే అర్థాల్లో ప్రయోగింపబడతాయి.

ఉదా : దేశాల పొంట
దేశాల పొంటి — దేశాల వెంట
తొవ్వ పొంటి
తొవ్వ పొంటి — తోవ వెంబడి / తోవ గుండా / తోవగుంట

మీద అనే అర్థంలో "కురికి" అనే ప్రత్యయం కనిపిస్తుంది. ఐతే ఇది 'కొట్టడ' మనే అర్థం కలిగిన క్రియా పదం వాడబడినాప్పుడు అవయవ వాచకాల మీద మాత్రమే రావడం గమనించ దగ్గ అంశం.

ఉదా : చెంపకురికి (చెంప మీద)
వీపుకురికి (వీపు మీద)
దొడ్డి గుంట (దిడ్డి గుండ)
చేతి గుంట(చేతి గుండ)

కాడ : 'కడ'కు వికృతి రూపమైన ఈ 'కాడ' దగ్గర, సమీపం అనే అర్థాల్లో చేరుతుంది.

ఉదా : గుడికాడ, బడికాడ, కొట్టుకాడ

– దిశగా అనే అర్థంలో ముంగల, వెనుక, ముందుల, పై, కింద మొదలైన శబ్దాలపై 'ంగ' అనేది ఆగమంగా చేరుతుంది.

ఉదా : ముంగలంగ, వెనుకంగ, ముందలంగ, పైంగ, కిందంగ, పక్కంగ.

– తావున అనేదానికి, 'తాన' అనేది వికృతి రూపం ఇది 'దగ్గర' అనే అర్థంలో చేరుతుంది.

ఉదా : తాన : నాతాన, అందరితాన, అన్నతాన మొదలయినవి.



Feb 2010 _Final_Pages.pmd 23 1/28/2003, 2:20 PM

**అన్య దేశ్యాలు – ఉర్దూ పదాలు**

సంస్కృత పదాల మాదిరిగానే ఉర్దూ పదాలు కూడా ఈ జిల్లా వ్యవహారంలో అత్యధిక సంఖ్యలో కనిపిస్తాయి. చాలా కాలం తెలంగాణా ప్రాంతం మహ్మదీయ రాజుల అధీనంలో ఉండడంతో పాటు ఉర్దూ అధికార భాషగా ఉండడం మొదలయినవి 'దీనికి కారణాలు. ఉర్దూ ధాతువుకు 'అయించు' అనేది చేరి ఈ క్రింది క్రియా పదాలు ఏర్పడినవి. నల్లగొండ జిల్లా వ్యవహారంలో వినిపించే ఉర్దూ క్రియాపదాలు.

ఉదా : ఉడాయించు, గుసాయించు, పసాయించు, కమాయించు, బగాయించు సమ్జాయించు, దక్లాయించు, సత్తాయించు, లట్కాయించు, ఫిరాయించు మొ॥వి.

**దేశ్య పదాలు**

రాజకీయ, చారిత్రక, సాంఘికాది కారణాల వల్ల ఈ జిల్లా భాషలో ఊర్దూ పదాలు ఎక్కువ సంఖ్యలో చేరినా చేవ గలిగిన చక్కని దేశ్య పదాలు ఈ జిల్లా వాడుక భాషలో ఎన్నో కనిపిస్తాయి. జానపదుల నోళ్ళలో నిత్యము నలిగే ఈ పదాలకు నాగరులు నిఘంటువుల్లో అర్థాలు వెదకాల్సిన పరిస్థితి వస్తుంది.

ఉదా : నెనరు – ప్రేమ

**అర్థాంతరంలో వాడుకునే పదాలు**

ఒకే పదం వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు అర్థాల్లో వాడుట.

ఉదా : బొక్క అంటే ఎముక అని జిల్లాలో అర్థం అదే బొక్క అంటే రంధ్రం అని ఇతర జిల్లాల్లో అర్థం ఉంది. గడ్డం అంటే ముఖం మీద మొలిచే వెంట్రుకలు (నల్లగొండ జిల్లా) చిబుకం ఇతర జిల్లాల్లో.

**ఒకే అర్థంలో భిన్న పదాలు**

ఒకే అర్థం ఉన్న పదాలు ప్రాంతాన్ని బట్టి పదాలు మారుట

ఉదా : నామవాచకాలు

| **నల్లగొండ జిల్లా** | – | **ఇతర జిల్లాల్లో** |
|---|---|---|
| అఱ్ర | – | గది |
| ఆన్గపుకాయ | – | సొరకాయ |
| ఏరాలు | – | తోడి కోడలు |
| పుంటి కూర | – | గోంగూర |
| గ్యాస్ నూనె | – | కిరసనాయిలు |
| తొక్కు | – | పచ్చడి |
| దూప | – | దాహం మొదలయినవి |
| పెయ్యి | – | ఒళ్ళు మొదలయినవి |
| మొదంగడ్డ | – | రత్నపురి గడ్డ |
| క్రియా పదాలు | – | అర్థం |
| ఏంచు | – | లెక్కించు |
| కక్కు | – | వాంతి |
| ఊకు | – | చిమ్ము |
| ఉరుకు | – | పరుగెత్తు |
| ఎచ్చబెట్టు | – | వేడిచేయు |

**ధన్యాద్యనుకరణ వాచకాలు**

ఒక భావాన్ని శక్తిమంతంగా వ్యక్తం చేయడానికి అనుకరణ శబ్దాలు ఎంతగానో సహకరిస్తాయి. చిన్నయ సూరి వీటిని ద్వన్యనుకరణ వాచకాలని పేర్కొన్నారు.

ఆయా సందర్భాల్లో ప్రయోగింపబడే అనుకరణ వాచక పదాలు

| | | |
|---|---|---|
| జెప జెప | – | జెప్పున |
| తటతట | – | తట్న |
| పుస పుస | – | పుస్సున / పుసుక్కున |
| గొర గొర | – | (లాగడం) |
| గర గర/పల్ల పల్ల | – | (కొట్టడం) |
| లప్ప లప్ప | – | (తినడం) |
| వల వల | – | (ఏడ్వడం) |
| కయ్య కయ్య | – | (అరవడం) |

**వాక్య నిర్మాణం**

వాక్య నిర్మాణంలో నల్లగొండ జిల్లా వాడుకలోని / వ్యావహారికంలోని వాక్యాల్లో కొన్ని ప్రత్యేకతలు గమనించవచ్చు.

1. వాక్యంలోని వ్యతిరేక తద్దర్మార్థక క్రియా పదానికి 'అను' అనే అనుబంధం చేరినపుడు ఆ వాక్యం ప్రశ్నార్థకమవుతుంది.

ఉదా : వాడురాడను ? (వాడురాడా?)

వాడు పోడను ? ( వాడుపోడా?)

2. కొన్ని వ్యాక్యాల్లో ఉర్దూ భాషా ప్రభావం గమనించవచ్చు.

ఉదా : 1. నేను చెప్పేది ఇది గదా అంటే:

– (మై బోల్ నా యహ హై)

2. చాయ్ త్రాగిస్తారా : (చాయ్ పిలాతే క్యా)

నల్లగొండ జిల్లాలోని కొన్ని మాండలిక పదాలు – పద బంధాలు

ఉదా :

| | | | |
|---|---|---|---|
| 1. | అగ్గువ | = | చౌక |
| 2. | అంకు | = | అంకె |
| 3. | ఇచ్చాలు | = | వివరాలు |
| 4. | ఎరుక | = | గుర్తు |
| 5. | ఉద్దెర | = | అరువు |
| 6. | అల్పం | = | గర్వం |
| 7. | గోస | = | బాధ |
| 8. | జాలారు | = | పాత్రలు మొదలైనవి కడిగే చోటు లేదా స్నానాలు చేసేచోటు |
| 9. | తట్ట | = | పళ్ళెం |

■



Feb 2010 _Final_Pages.pmd 24 1/28/2003, 2:20 PM

కథ

# యుగాంతం

## కోటమర్తి రాధాహిమబిందు



*గోపాల్రావ్‌కు బ్రేకింగ్ న్యూస్ ఛానల్ అంటే చాలా యిష్టం అన్ని కొత్త విషయాలు వింత విషయాలు చెబుతూంటారు. ఎప్పటిలా ఆ రోజు కూడా బ్రేకింగ్ న్యూస్ ఛానల్ ఆన్ చేశాడు. 'వన్ వే' ట్రాఫిక్‌లో వాహనాల్లాగా నడుస్తున్న స్క్రోలింగ్‌ను కళ్ళతో తదేకంగా చూస్తూ న్యూస్ రీడర్ చెబుతున్న న్యూస్‌ను చెవులతో శ్రద్ధగా వినసాగాడు.*

ఈ ప్రపంచం మొత్తం మే 19న అంతమైపోతుందని దానికి అనేక ఉదాహరణలతో సహా ప్రచారం చేసేసరికి ముందు ఉలిక్కిపడినా ఆ తర్వాత వెన్నులో చలి జరజర పాక్కుంటూ వచ్చింది.

గోపాల్రావు అమ్మమ్మ నాయనమ్మ చెప్పే కథలు వినే పెరిగాడు. వాళ్లేది చెప్పినా ఎంతో ఆసక్తిగా యిష్టంగా వినేవాడు. వాళ్లు పంచాంగం ఎలా చూడాలో చిన్నప్పుడే నేర్పారు గాబట్టి పెద్ద సమస్య తొలగిపోయిది.

అరక్షణంలో పరిగెత్తి పావుక్షణంలో పంచాంగం తెచ్చుకున్నాడు. ఏవేవో కూడికలు తీసివేతలు వేస్తూ 'బ్రేకింగ్ న్యూస్'లో చెప్పింది నిజమేనని 'ఫిక్స్' అయిపోయాడు.

ఆ మర్నాడు అదే ఛానల్‌లో 'మీ ఆస్తిని ఎలా కాపాడుకోవాలి? ఎలా ముందు తరాలకు అందించాలి ? అనే విషయం మీద కౌన్సిలింగ్ యివ్వటానికి ఓ కంపెనీ అడ్వర్‌టైజ్ చేసింది. వెళ్లిన వాళ్ల ఆస్తి లెక్కగట్టి సలహా యిచ్చినందుకు ఆస్తిలో 2% ఫీజు క్రింద యివ్వాలట.

'ప్రపంచమే నాశనం అవుతుంటే ఆస్తి ఏంటి?'

అలా ఏదో అనుకున్నా మనసు సమాధానపడుతుందా ? తనకు ఫర్వాలేదు బాగానే బ్యాంకు బ్యాలెన్స్ వుంది. లాకర్‌లో కాసిన్ని భార్యా నగలు వున్నాయి. రెండు ప్లాట్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషను కాగితాలు వున్నాయి. ఆరునెలల క్రితం ల్యాప్‌టాప్ కొన్నాడు. రెండు రోజుల క్రితం ఎల్.సి.డి కొన్నాడు మరి.

ఎదురింట్లో అల్లారు ముద్దుగా అపురూపంగా పెంచుకుంటున్నా భారీ ఎత్తు కుక్క 'భౌభౌ' మంది.

' చేష్టలన్నీ నీ ఆగడాలన్ని మే 19 వరకే. తర్వాత నువ్వుండవ్.. యమపాశం పట్టుకున్న యముడిలా రోజూ నన్ను భయపెడతావా? యిక నీకెవరు దిక్కు'

క్షణకాలం కసిగా అలా అనుకున్నాడే గానీ వాస్తవం గుర్తొచ్చింది. "టి.వి చూసింది చాలు యికలేవండి. అవతల ఆఫీసుకు టైమవుతుంది" హాల్లోకి వస్తూ చిరాగ్గా అంది సావిత్రి.

"మరో మూడేలల్లో ప్రపంచమే మునిగిపోబోతుంది.. ఏం యిల్లు ఏం ఆఫీసు ప్చ్.. అంతా అయోమయం.. అంధకారం"..

తన గుండెల్లోంచి టన్నుల కొద్దీ ఆవేశం బయటపడబోతుంటే ఎంతగానో తమాయించుకుని వివరంగా మళ్ళీ కిచెన్‌లోకి వెళ్ళిపోయింది సావిత్రి. రోజులు గడుస్తున్న కొద్దీ గోపాల్రావ్‌కు ప్రపంచం మొత్తం నాశనం అయ్యే పరిస్థితులే కన్పిస్తున్నాయి. 'మార్చి'లో ఆకాశంలో భూమి, చంద్రుడు, సూర్యుడు నీటితో పాటు గురుడు శుకృడు కూడా ఒకే లైను మీదికి వస్తారట. దీన్ని శని ఎడమకంటి నుంచి చూడటం వల్ల పేరులో 'ఎల్' అక్షరం ఉన్న వాళ్లందరికి గండం



Feb 2010 _Final_Pages.pmd 25 1/28/2003, 2:20 PM

తప్పదు. ఈ భూమి, జనం అంతా మునిగిపోవడం ఖాయం.

మార్చి నెల వచ్చిందగ్గర్నుంచే గోపాల్రావ్ మనసు సునామీ వచ్చినంత అల్లకల్లోలంగా అయింది. ఏదీ చూడాలన్పించటం లేదు. తినాలన్పించటం లేదు.. పైగా ఆఫీసు పనులన్నీ అడ్డదిడ్డంగా చేయటం..

"గొపాల్రావ్.. ఏమిటీ లెటర్స్..."?

"పేమెంట్లన్నీ 'మే' తర్వాత యిస్తామని అలా" నసిగాడు. అదే ఎందుకిలా..."?

"మే తర్వాత ఈ ప్రపంచమే మునిగిపోతుంటే ఈ పేమెంట్లు ఎందుకు? ఏంటయ్యా ఈ మధ్య యిలా తయారయ్యావ్? ఓ పదిరోజులు సెలవు పెట్టుకొని యింటి దగ్గరఉండు కాస్త సెట్ అయింతర్వాత వద్దువుగాని" చిరాగ్గా అంటూ యింటికి వెళ్లిపొమ్మన్నాడు బాస్.

గోపాల్రావ్ హ్యాపీగా యింటికి వచ్చాడు. 'ఆహా.. ఏమి నా అదృష్టము? ఎంత విశ్రాంతి? అనుకుంటూ టి.వి. ముందు అతుక్కుపోయాడు.



"ఏంటి అంతగా ఆనందం" అడిగింది సావిత్రి.

"అడిగినా ఒక్కపూట కూడా సెలవు యివ్వని మా బాస్ నేను అడగకుండానే పదిరోజులు సెలవు యిచ్చాడు"

"పదిరోజులా? మరి నా సీరియళ్ళు" గొణిగింది సావిత్రి... "పిచ్చిమొహమా! మే 19న ప్రపంచమే మునిగిపోతుంది ఏం సీరియళ్లు... ఏం సినిమాలు ? ఆవేదనగా విరక్తిగా అన్నాడు గోపాల్రావ్....

భర్తను అనుమానంగా ఓ చూపు చూసి పేపర్ చదవటం అంతగా యిష్టం ఉండకపోయినా తప్పని పరిస్థితి గాబట్టి పేపరును చేతిలోకి తీసుకుంది సావిత్రి.

ఈ పదిరోజుల కాలు బయటపెట్టలేదు గోపాల్రావ్.. టి.వి. చూడటం పేపరు చదవటం అంతే...

హు మాయదారి కాలంగాకపోతే ఏమిటి? అవుకు మూడు తలల దూడ పుట్టటం ఏంటి? ఒకే కాన్పులో మహిళకు ఆరుగురు సంతానం ఏంటి? అరటి చెట్టున బొవుడికాయ కాయటం ఏంటి? పొట్లకాయ చేంతాడంత కాసిందా? పది సంవత్సరాల పిల్లకు హార్ట్ ఎటాకా? కొత్త కొత్త పేర్లతో కొత్తగా నామకరణాలు చేస్తూ ఈ వ్యాధులు ఏంటి?

ఎన్నెన్ని వింతలు? ఈ వింతలు చూడటానికి ఈ జనాల పరుగులేంటి? యివన్ని యుగాంతానికి సూచనలే.. తప్పదు యుగాంతం అంతం తప్పదు.

అమ్మా.. నాన్న.. అన్నా వదినా.. అక్కా బావగారు.. వాళ్ళ పిల్లలు దూరంగా చదువుకుంటున్న తన పిల్లలు. అందరం ఒకచోట చేరాలి బతుకు తెరువు కోసం దూరంగా వున్నా చనిపోవటం మాత్రం ఒక్క దగ్గర ఒకేసారి పోవాలి యస్ అంతే. ఆ ఆలోచన వచ్చినదే తడవు తన వాళ్ళకు ఫోను చేసి ఓసారి తప్పక రమ్మని ఆహ్వానించాడు. 'తప్పకవస్తాం' అన్న మాట కూడా వాళ్ళ నుండి తీసుకున్నాడు. 'మే 16 వచ్చింది. అంటే యింకా 72 గంటలే ఈ ప్రపంచానికి మిగిలివున్నాయి. ముసలి వాళ్లకు పడుచువాళ్లకు ఆఖరికి ఆరోజు పుట్టిన వాళ్లకు ఆరోజే నూరేళ్లు నిండబోతున్నాయి. అన్యమనస్కంగా 'బ్రేకింగ్ న్యూస్' ఛానల్ ఆన్ చేశాడు గోపాల్రావ్.. మొదట ఓ వార్త ప్రసారం అయింది. అది పాకిస్తాన్ అమెరికా మీద యుద్ధం ప్రకటించినట్లు రెండోది ఇండోనీషియాలో భూకంపం, సునామీ వచ్చే అవకాశాలు వున్నట్లు.. దాని ప్రభావం వల్ల బంగాళాఖాతాన్ని ఆనుకునివున్న అన్ని దేశాలకు ప్రమాదం వున్నట్లు వివరాలు యిస్తుంటే భయంతో బెంబేలెత్తిపోయాడు.

వేదపండితులు జన చైతన్య వాదులతో టి.విలలో చర్చలు మొదలయ్యాయి. ఎవరికి వాళ్ళు మేమే రైటంటుంటే గోపాల్రావ్‌కు ఏమీ అర్థంగావట్లయింది. ఏదో ఒకటి ఖచ్చితంగా తేలిస్తే బాగుంటుంది గాని ప్రశ్న మాకే వదిలితే యిక చర్చలు ఎందుకు? రేపు 17 ఎల్లుండి 18 ష్చ్...

ఒక్కసారిగా తన వాళ్లందర్ని చూసేసరికి నరనరాల్లో పొరల్లో వున్న దుఃఖం ఉప్పెనలా పొంగుకు వచ్చింది గోపాల్రావ్‌కు అందర్ని కౌగలించుకుని బోరున ఏడ్చాడు.

"ఏంటిరా.. ఉద్యోగం పోయిందా"? తండ్రి గాబరాగా అడిగాడు. "ఏంటి కన్నా యింతగా నీరసించిపోయావు? మనసులో కుమిలిపోతున్న ఆ బాధేంటి? నాతో చెప్పు.. నవమాసాలు మోసి కన్న దాన్ని.. నాకంటే నీకు యింకా దగ్గర ఎవరవుతారు చెప్పు" తల్లి ధైర్యంగా అడుగుతుంటే గుర్రుగా చూసింది సావిత్రి..

"అమ్మా.. చెప్పలేనమ్మా.. చెప్పలేను" "అలా అంటే ఎలా గోపాల్.. కొంపదీసి స్వైన్‌ఫ్లూ లాంటిది"... అనుమానంగా అంది వదిన. ''ఛ.. ఛ... అలాంటిదేంలేదు.. మిమ్మల్నందర్ని చూడాలన్పించింది." అదేంగాదు గాని విషయం చెప్పు.. ఎవరికైనా అప్పుయిస్తే ఎగ్గొట్టిపోయారా ? ప్రేమగా అడిగింది అక్క. "ష్చ...కాదక్కా"..

"మరి చెప్పుగోపాల్.. ఎందుకీ ఏడుపు..? అడిగాడు బావగారు. యిలా అరగంట బ్రతిమాలినా అతని నుండి విషయాన్ని రాబట్టలేకపోయారంతా.. సమయమే సమాధానం చెబుతుంది అని ఊరుకుండిపోయారు.

మధ్యాహ్నం నుండీ ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి... 'స్వైన్'ఫ్లూ' ముందు వచ్చే సిమిటమ్స్ లాగా ప్రకృతి అప్పుడే తన



Feb 2010 _Final_Pages.pmd 26 1/28/2003, 2:20 PM

ప్రభావం చూపిస్తుందా? కాలంకాని కాలంలో ఈ మబ్బులేంటి"? తండ్రి ఆకాశం వంక చూస్తూ గొణుగుతుంటే ఖిన్నుడయ్యాడు గొపాల్రావ్. "ప్రపంచం మునిగిపోతుందంటే మీరు తెలిగ్గా తీసుకుంటారు. అందుకే నేనెవరితో ఏమీ చెప్పలేకుండా ఉన్నాను. ఆఖరికి సావిత్రి కూడా నన్నర్థం చేసుకోలేకపోతుంది.' అతని గుండె కన్నీళ్లు పెట్టుకుంది.

ఆ రాత్రి తనకెంతో యిష్టమైన వంకాయకూర, గోంగూర పచ్చడి.. దాంట్లోకి ఉల్లిపాయ.. సాంబారు వగైరాలన్ని తల్లితో చేయించుకుని తల్లి కొంగు పట్టుకుని గారాంబంగా తిరిగాడు. తల్లి చేత అన్నం కలిపించుకుని యింత యింత ముద్దలు గుటుకు గుటుకు మంటూ మింగాడు... " అంతా హాల్లో పడుకుందాం" అంటూ పట్టుబట్టాడు. కడుపు చాలా నిండుగా వుండటంతో పడుకున్న రెండు నిముషాలకే నిద్రపట్టింది గోపాల్రావుకు..



భోరున వర్షం... ఉరుములు.. మెరుపులు.. పిడుగులు.. ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు గోపాల్రావ్.. ఏం జరుగుతుందో తెల్సుకునే లోపే హాలు తలుపులు తోసుకుంటూ ఉప్పెనలాగా నీళ్లు వచ్చేశాయి. క్షణాల్లో హాలంతా నీళ్లు.. చూస్తుండగానే యిల్లంతా నీటితో నిండిపోయింది.

"అయిపోయింది... మే 19 రావటంతోనే వినాశనం మొదలైంది' నీళ్లవేగానికి ఎవరూ ఆగటం లేదు. కొట్టుకుపోతున్నారు. రక్షించమని చేతులు ఊపుతూ మునిగిపోతున్నారు.

గోపాల్రావ్ మంచం నీళ్లలో తేలుతున్నది. 'రక్షించండి.. రక్షించండి' అని గోపాల్రావ్ అరుస్తున్నాడు. ఎవరూ విన్పించుకోవటం లేదు. మంచం వేగంగా వెళ్తుంది.. వెళ్తూ వెళ్తూ ఓ పెద్ద బండరాయిని ఢీకొంది.. అంతే గోపాల్రావ్ మంచం మీంచి క్రింది పడిపోయాడు. ముఖం దేనికో బలంగా గుద్దుకుంది.

సరిగ్గా అదేసమయంలో పరిచితమైన స్పర్శ.. 'సావిత్రి యస్.. సావిత్రి... సావిత్రీ రియల్లీ యుఆర్ గ్రేట్.. ఆకాలంలో ఆ సావిత్రి భర్తను కాపాడుకోవటానికి యముడికి ఎదురు నిలిచి పోరాడింది. ఆవిడ పేరు పెట్టుకున్నందుకు ఈ కాలంలో .. అదీ యిలాంటి రోజుల్లో నువ్వు నీ పతి ప్రాణం కాపాడబోతున్నావు... థ్యాంక్స్ సావిత్రీ.."

"మీరెలాగూ వస్తారు గాబట్టి మీ అబ్బాయి గురించి ఫోన్లలో చెప్పలేదు. చాలా చిరాకేస్తుంది మామయ్య గారూ.. టి.వి. పిచ్చి ఎక్కువైపోయింది. ఉన్న టి.వి. పనికిరాదా.. ఎల్.సి.డి కొన్నారు"

లీలగా ఏవో మాటలు విన్పిస్తుంటే కళ్లు తెరిచాడు గోపాల్రావ్.. అంతా చీకటి. రెప్పలు గట్టిగా మూసి తెరిచాడు. తనచుట్టూ తన వాళ్లందరూ..

"అరె.. మనందరం ఒక్క దగ్గరికే చేరామన్నమాట.. మన యిల్లు యింతదూరం కొట్టుకొచ్చినా బాగానే వుందే.."

"గోపాల్.. బాగా కళ్లు తెరువ్.. యిదిగో యిటు చూడు. నేను మీనాన్నగారు.. వదిన.. అన్నయ్య.. బావగారు.. అక్క.. పిల్లలు.. నాన్న... కన్నా.. అంతా కన్పిస్తున్నామా?

'నీగోల ఆపవే.. వాడు బాగానే వున్నాడులే.. యిల్లు కొట్టుకురావటం ఏంటిరా నీ బొంద.. బైటికి వచ్చి చూడు" అంటూ గోపాల్రావ్‌ను బయటకు తీసుకు వచ్చాడు తండ్రి.. ఎదురింటి కుక్క గోపాల్రావ్‌ను చూసి ఎప్పటిలా 'భౌ భౌ' మంది. అంతా ప్రశాంతం.. యిల్లు.. వీధి.. పిల్లలు.. మనషులు అంతా మామూలుగానే వున్నారు.

"ప్రపంచం ... గ్రహణాలు.. సునామీ.. భూకంపం"...

"ఒరేయ్ పిచ్చినాన్నా... ప్రపంచమన్నాక యివన్ని మామూలే.. గ్రహాలన్ని ఏదో ఒక కక్ష్యలో తిరుగుతుంటాయి.. వందల వేల సంవత్సరాలకోసారి ఒకలైను మీదికి రావటం జరగొచ్చు.. దానికింత భయం అక్కర్లేదు.. ఇండోనీషియాలో భూకంపానికి ఆంధ్రదేశంలో అదురుతుందని భయపడనక్కర్లేదు.. రాత్రంతా నీ గురించే చెప్పింది కోడలు.. ఈరోజు పేపర్లో యింకో కొత్త విషయం వచ్చింది చూడు.. లేనిపోని ఊహాగానాలతో జనాల్ని ఫూల్స్ చేస్తుందని 'బ్రేకింగ్ న్యూస్' మీద దావా వేశారు... మొన్న పాకిస్తాన్ అమెరికా మీద యుద్ధం ప్రకటించినట్లు కూడా ప్రసారం చేసిందట గదా.. దాంతో దాన్ని 'బ్యాన్' చేశారు.

చూశావా.. పిల్లలు హాయిగా 'జెటిక్స్' చూస్తున్నారు. నువ్వు యింకో టి.వి. కొన్నావుగా.. ఆడవాళ్లంతా చేరి పొద్దుపొద్దున్నే సీరియళ్లు ఎలా చూస్తున్నారో చూడు. డబ్బు ఖర్చయితే అయింది గాని టి.వి దగ్గర పిల్లలకీ పెద్దలకీ గొడవ లేకుండా అయింది.. పద అలా వెళ్లి మాట్లాడుకుందాం.. గోపాల్ లేనిపోని నమ్మకాలతో మనసుపాడు చేసుకోవద్దు.. నువ్వేం చిన్న పిల్లాడివిగాదు".. అంటూ చాలాసేపే చెప్పాడు ఆ తండ్రి... అపర బుద్ధిమంతుడిలా తల గిర్రుగిర్రున తిప్పుతూనే వున్నాడు గోపాల్రావ్... "అన్నయ్యగారూ.. ఈయనేరీ.."

"అదిగో.. వేపచెట్టు క్రింద జ్ఞాన బోధ చేస్తున్నారు మామయ్యగారు"...

అన్నాచెల్లెలు ఎందుకు నవ్వుతున్నారో అర్థం కాకుండా అయింది గోపాల్రావ్‌కు.. తండ్రి బోధన వింటూ దొంగ దొంగగా వాళ్లనే చూడసాగాడు.

**(ఇందులో పాత్రలు, ఛానల్ పేరు హాస్య ప్రధానంగా ఉపయోగించినవి మాత్రమే. ఎవరినీ ఉద్దేశించి కాదని మనవి)**

■



Feb 2010 _Final_Pages.pmd 27 1/28/2003, 2:20 PM

## కవిత

# వినిపించని రాగం

అడిగోపుల వెంకటరత్నమ్

ఇల్లు మూగబోయింది
అనురాగాల కేరింతలు
అదృశ్యమైనాయి
పూలకుండీలో రెమ్మ
పువ్వు బిడ్డల్ని ఎత్తుకుని
గాల్లో ఉయ్యాలూగుతూ
మూసిన తలుపుపై
నిశ్శబ్ద శబ్దం చేస్తూంది
ఎండిన గొంతు తడుపుకోను
నీటికై ఎదురుచూస్తూంది
మూసిన తలుపు తెరుచుకోలేదు !
వాకిట్లో రామచిలుక
పంజరంలో ప్రదక్షిణలు చేస్తూ
యజమానిని పిలుస్తూంది
రోజూ నేర్పే సరికొత్త
పలుకు కోసం పరితపిస్తూంది
మూసిన తలుపు తెరుచుకోలేదు !
వాకిట వడ్లకంకులు ఆరగిస్తూ
యజమాని భుజాలపై వాలుతూ
స్వాగత వీడ్కోలు పలికే పిచుకలు
కానరాని మాలిన కోసం
ముక్కుల్ని మేలు కొలుపులు చేసి
ద్వారంపై ధ్వనిస్తున్నాయి
మూసిన తలుపు తెరుచుకోలేదు !
గంతులు చిందుల్తో
పెరటిని ఇంటిని
ఏకం చేసే పెంపుడు కుక్కపిల్ల
వొంటిపై యజమాని స్పృశించందే
శాంతించని శునకం
మూతిని తలుపుకు మోపి
మౌనరోదన చేస్తూంది
మూసిన తలుపు తెరుచుకోలేదు !
గ్రాసం నిండిన వసారాలో
జోడుగ నిల్చిన కాడెద్దులు
పలుపు విప్పే యజమాని కోసం
ఎత్తిన మోరల్తో ఎదురు చూస్తున్నాయి
మూసిన తలుపు తెరుచుకోలేదు !
గిట్టుబడులు యివ్వని రాబడులు
ప్రాంశరీ నోట్లు పోసిన అప్పుల రాశులు
కురిసిన వర్షానికి తడవని పొలాలు
ఆత్మహత్యకు హేతువులు
యజమాని మరణానికి కారణాలు
విషాదం నిండిన ఇంట
గుమ్మం గోడకట్టింది !

# నానీలు

ఆర్.కె. కటారి





సంధ్యలో
కారిడార్‌లో గచ్చు మీద
కాంతి నదిలో మెరుస్తున్న
సూర్యబింబం !

ముందాలోచన చేయకురా...
పాత హితవు !
ముందు చూపుండాలిరా
కొత్త సూక్తి !!

ప్రజల తీర్పుని
శిరసావహిస్తాం
అదేం స్టేట్‌మెంటో
దయతలుస్తున్నట్టు !

డైరీ
ఆధునిక రూపం 'బ్లాగ్'
అది రహస్యం !
ఇది బహిరంగం !!

చనిపోయాక రాసే
స్మృతి కవిత కన్నా
స్తుతి కవిత
మేలు కదా !

నీతో విభేదించినా
నిన్ను గౌరవిస్తాను !
నాయకుల కుండాల్సిన
నీతి !

# రెక్కలు

రంగనాథ రామచంద్రరావు



మహా వృక్షం
చిన్ని విత్తనంలో
బ్రహ్మాండం
చిట్టి పొట్టలో-

అంతు చిక్కనిది
సృష్టి !

రెక్కలొచ్చిన పిల్లలు
తలో దిక్కుకు
రెక్కలూడిన పెద్దలు
ఆశ్రమాలకు-

బాంధవ్యాలు
విలోమాలు !

క్షేత్రం మంచిదైతే
విత్తనాలు మొలుస్తాయి
భూమి బంజరైతే
బండలు నిలుస్తాయి-

పువ్వులు
రెండు రకాలు !

దెబ్బ మీద
దెబ్బ పడితే
శిల
శిల్పం అవుతుంది-

తప్పుకు సర్వనామం
అనుభవం!

గ్లాసుతో తీస్తే
గ్లాసుడే
బిందెతో తీస్తే
బిందెడే-

తవ్వేకొద్దీ
జ్ఞానం



Feb 2010 _Final_Pages.pmd 28 1/28/2003, 2:20 PM

## నచ్చిన పుస్తకం

# అడిగోపుల 'రంగుల చీకటి' లోకం




*'జీవితమనే కొలను నుండి వికసించిన పద్మం కవిత్వం' అని శ్రీశ్రీ అన్నారు. అలా వికసించిన కవిత్వమే ఈ కవిది. ఒక రాజకీయ, సామాజిక నిబద్ధతతో ఈ కవిత్వం వుంది. ఒక ఉద్వేగ భరిత స్థాయిలో కవిత్వకరించే టప్పుడు, విషయం కవిత్వాన్ని అధిగమించి వచన శైలిలో ప్రవాహ వేగంతో వెళ్ళిపోతుంది. అలా, కొన్ని కొన్ని చోట్ల వెంకటరత్నం గారి శైలీ విన్యాసం కన్పించింది.*

**డా॥ శిలాలోలిత**

అడిగోపుల వెంకటరత్నం నిరంతర సాహిత్య శ్రామికులు. ఎప్పటి నుంచో రాస్తున్న కవి. సుమారు 16 కవితా సంపుటుల్ని, ఒక కథా సంకలనాన్ని తీసుకొని వచ్చారు. ఇటీవలే వచ్చిన ఈ కవి కొత్త సంపుటి పేరు రంగుల చీకటి. కవిత్వానికి పెట్టిన ఆ పేరులోనే లోతైన జీవనావగాహన కన్పిస్తోంది.

చీకటికి నలుపు రంగును ఆపాదిస్తాం. విషాదానికి దుఃఖానికీ, కష్టాలకూ అసమ సమాజస్థితికీ 'నలుపు' రంగును పులుముతుంటాం. రంగుల్ని సంతోషానికీ, ఆనందానికీ, భవిష్యత్తులోని ఆశావహ దృక్కోణాలకీ, కలిసి కట్టుతనానికీ, ఒకో రంగులో ఎగిసిపడే భావోద్దీపాలకీ సంకేతంగా వాడుతుంటాం. ఈ రెండు పదాల్ని కలిపి ఒక కొత్త అర్థాన్నిచ్చారు. సమ సమాజంకోసం తపనపడే, అభ్యుదయ భావజాలమున్న ఈ కవి నేటి సమాజంలో రంగులుతున్న చీకటీ, అసమానతలు తొలగిపోయి, ఒక కొత్త కలల రంగుల్ని పులుపుముకున్న ఆధునిక సమాజం రావాలన్న ఆకాంక్షను ఈ పేరులోనే ధ్వనింప జేశారనిపించింది.

'జీవితమనే కొలను నుండి వికసించిన పద్మం కవిత్వం' అని శ్రీశ్రీ అన్నారు. అలా వికసించిన కవిత్వమే ఈ కవిది. ఒక రాజకీయ, సామాజిక నిబద్ధతతో ఈ కవిత్వం వుంది. ఒక ఉద్వేగ భరిత స్థాయిలో కవిత్వకరించే టప్పుడు, విషయం కవిత్వాన్ని అధిగమించి వచన శైలిలో ప్రవాహ వేగంతో వెళ్ళిపోతుంది. అలా, కొన్ని కొన్ని చోట్ల వెంకటరత్నం గారి శైలీ విన్యాసం కన్పించింది.

'కప్పి చెప్పేది కవిత', విప్పి చెప్పేది విమర్శ' అని సినారె అన్నారు. ధ్వని రూపంలో వుండాలన్న ధ్వనిని వినిపించారు. కవిత్వ చరణాల దగ్గర మోకరిల్లి, హృదయాన్ని తెరిచి, కవిత్వ రసాస్వాదన చేయాలి. ఆయా పాఠకుల మనోస్థాయి, అవగాహన స్థితిని బట్టి కవిత్వం అర్థమవుతూ, అర్థం కాకుండానూ వుంటుంది.

ఐతే, పాఠకులు ఈ సంక్లిష్టతను పొందకుండా చాలా సరళంగా, అత్యంత సాదాసీదా మాటల్తో చదవడంతోనే మనసుకు ఇంకి పోయేలా రచించారు. ఒక్కోసారి అన్పిస్తుంటుంది. సరళంగా రాయడమనేది అన్నింటికంటే కష్టమని. నిజం కూడా అంతే. వేమన అంత సరళంగా రాయగలిగాడు కాబట్టే ఇప్పటికీ ప్రజల నాల్కల మీద నిలిచిపోయాడు.

కవిత్వ రచనల ఎలా వుండాలి అనే విషయాన్ని చాలా స్పష్టంగా చెప్పడమే కాక, తాను రచించి చూపించిన గొప్ప కవయిత్రి మొల్ల. ఎంత క్లుప్తంగా, గుప్తంగా, సరళంగా, సందర్భోచితంగా వుండాలో తన రచన ద్వారా నిరూపించింది. అటువంటి క్లుప్తతను సాధించిన కవి ఈయన ఇక, కవిత్వంలోకి అడుగిడితే.

ఈ సంపుటిలో 'అడవిని జయించింది' మొదలుకొని మూసిన గది వరకూ మొత్తం 49 కవితలున్నాయి. ఆరువిధాలైన కవితలు కన్పించాయి.



Feb 2010 _Final_Pages.pmd 29 1/28/2003, 2:20 PM

1.సమ సమాజ స్థాపన వల్లే దేశం స్థితిగతులు బాగుపడతాయనే భావన.
2. పేదరికం కోరల్లో పడి నలిగే పీడిత ప్రజల ఆక్రందనలు
3. స్త్రీలు, రెండవ తరగతి ప్రాణులు గానే గుర్తింపబడుతూ అట్టడుగుకు నెట్టివేయ బడుతున్న వైనాలు.
4. స్త్రీ శక్తిని విస్మరించరాదనీ, స్త్రీలెంతో సమర్థవంతులన్న విశ్వాస ప్రకటనలు
5. కొన్ని కొన్ని జ్ఞాపకాలు వాటి ప్రవాహ వేగాలు
6. అంటరాని వారుగా, ఇంకా పరిగణింపబడుతున్న వారి వ్యథలు జాషువా అన్నట్లుగా 'బాకున కుమ్మినట్లగున్' అన్నంత బాధతో రాసినవి మరికొన్ని.

ఈ కవి గొప్ప ఆశావాది. నిరాశ ఛాయలెక్కడా కన్పించవు. కవిత్వంలో కొన్ని కొన్ని జీవన సత్యాల్నీ, మెరుపుల్లా మెరిపింపజేస్తూ, విత్తనాల్లా జల్లుకుంటూ పోతుంటారు. ఉదాహరణకు కొన్ని –

'కాలం రాయని కాగితం మానవుడు లిపికారుడు' (కాలపురుషుడు)

నేటి సూర్యాస్తమయం
రేపటి సూర్యోదయం లోగిలి (గురి తప్పదు)

తిలక్ 'నా లక్షరాలు వెన్నెల్లో ఆడుకునే ఆడపిల్లలు' అన్నారు. ఈ కవి మరింత ముందుకు పోయి తన కవిత్వాన్ని గురించి ఇలా అంటున్నారు.

నా అక్షరాలు అమృతం తాగలేదు
బంగారు తొడుగులు కప్పుకోలేదు
సాదాసీదాగా నడుస్తుంటాయి
సామాన్యుల నోట పలవరిస్తాయి
సమూహాల్ని కూడా గడతాయి
..............
నా అక్షరాలు ఆయుధాలై
ప్రజల పక్షాన నిలుస్తాయి
నా అక్షరాలు నినాదాలై ధ్వనిస్తాయి (క్రాంతి ప్రదాతలు)

స్త్రీలు సమాజంలో ఇంకా పీడింపబడుత్ను విధానాన్ని, దళితులు ఇంకా అణిచివేయబడుతున్న స్థితినీ ఇలా వ్యక్తీకరించారు. 'అతడు తప్పుల చిట్టాను వొప్పజెప్తున్నాడు.
ఆమె అగ్ని ప్రవేశం చేస్తానంటుంది
ఆక్రోశించిన నా మనసు అధిక్షేపించింది
ఎత్తిన అతని చేతిని అడ్డుకుంది
ఉగ్రరూపం దాల్చినవాడు అరిచాడు
"దానికీ నీకూ ఏ చీకటి సంబంధం" ?
ఈ చీకటి ప్రశ్నకు ఏ వెలుగు జవాబు? (తమస్సు)

ఈ చివరి రెండు కవిత్వ పాదాల దగ్గర ఆగి, మనం అనంతమైన చర్చ చెయ్యొచ్చు. పురుష స్వభావాలను, మానవత్వం కనుమరుగై పోతున్న వ్యవస్థ స్థితినీ స్పష్టంగా గమనించవచ్చు.

దళితుల గురించి
ఆధిపత్యం పోరులో రెండు కులాలు
రంగప్రవేశం చేసిన నా హృదయం కులం కురుక్షేత్రం కాకూడదంది
...........

కత్తిపట్టిన ఒకానొక కంఠం
కులంలేని వాడి బోధన అప్రస్తుతం !
ఈ చీకటి ప్రస్థానానికి ఏ వెలుగు గమ్యం (తమస్సు)

కులాలు లేవన్నదీ ఒట్టిమాటనీ, మనుషులు ఎంత హేయంగా తయారవుతున్నారో ఈ కవిత వెలిబుచ్చుతుంది.

ప్రసవ సమయానికి రాని, లేని డాక్టర్ల తీరును ప్రతిబింబించిన కవితను ఎంతో ఆర్ద్రతతో రచించారు (బతికినంత కాలం ఓర్చుకో)

'అమ్మ పరీక్ష' కూడా అద్భుతమైన వ్యంగ్యాన్ని ప్రదర్శించిన కవిత

'ఒకరు పదవికి అలంకారం
పదవి ఒకరికి అలంకారం'
'నేను అక్షరశిల్పిని
ఒళ్ళు కవిత్వమై
కళ్ళు సజలమై
ఆకృతి వెంట నడుస్తుంటాను
అక్షరాలు వెంబడిస్తుంటాయి' (అక్షర శిల్పం)
స్త్రీ సృజనకు స్ఫూర్తి
అంగట్లో సరుకు కాదు
అర్థనగ్నం కాదు
పురుషునిలో సగం
ప్రపంచంలో సంపూర్ణం.... (సృజనకు స్ఫూర్తి)

స్త్రీ గురించి ఎంతో ఉన్నతంగా ఈ కవిత చిత్రిస్తుంది. అలాగే 'నీ నడతే నీకు అనువాదం' చాలా మంచి కవిత.
'పీడిత జనావళి మధ్య నిల్చి
విషాదమో ఆనందమో
నువ్వు కార్చిన కన్నీరు అనువాదమే చేస్తుంది
నీ మాటే నీకు అనుసృజన
నీనడతే నీకు అనువాదం'

అక్షరానువాదమే అనువాదం కాదు. అనువాదమంటే భాష నుంచి భాషకు మారడం కాదు అనుకున్న ఈ కవి. అనువాదానికి ఒక్క కొత్త అర్థాన్నీ, చూపునీ ఇచ్చి మనిషి వ్యక్తిత్వాన్ని ఎలా అంచనా వేయగలమో నిరూపించిన కవిత ఇది.

మరికొన్ని మంచి కవితలు – అష్టవర్ణ చీకట్లు, నీటి చిత్రం, కుడి ఎడమల కథలు, పిడికలి మించిన గుండెలో, రంగుల్లేని హరివిల్లు మనమంతా ఒకటే, మన్నుమిన్ను ఏకమై, కీర్తి శేషమైతే, అంగడి బొమ్మ, కత్తిని చూసి పువ్వు వికసించదు. ఇలాంటి విలువైన కవితలెన్నో ఈ నిధిలో నిక్షిప్తమైవున్నాయి. ఎవరికి వారు ఈ కవిత్వంలోకి ప్రయాణించినప్పుడు కవిత్వానందాన్ని పొందే, సరైన దిశానిర్దేశం చేసే అరుదైన కవిత్వ సంపుటి ఇది. ■

కవిత

# స్వతంత్రులమవుదాం

**ఝాన్సీ కె.వి. కుమారి**



ఇప్పుడిక రాళ్ళెత్తే ఉన్నతుల గురించే
మాట్లాడుకుందాం
రోడ్లూడ్చే శుద్ధికారుల గురించే
రాసుకుందాం
బండరాళ్ళను ముళ్ళతుప్పలను
రహదారులుగా మలిచే
శిల్పులకే నమస్కరిద్దాం...

మట్టిని అన్నం ముద్దలుగ మార్చేందుకు
సూర్యచంద్రులను కాపలా ఉంచి
పంచభూతాలతో పోరాడిన
గాయాల చేతులను
ఆర్తిగా ముద్దాడుకుందాం
అమ్మఒడిలో పారాడిన
బంగారుకాంతుల లేలేత పాదాలే
మట్టిని మణిరత్నాలుగా రూపించే

ఆ నల్లబంగారు కాళ్ళకు
తలలు వంచి నమస్కరిద్దాం

పని మంత్రాన్నే జపిస్తూ
యంత్రాలైన
మానవజాతి రత్నాలకు
శిరస్సులు వంచి
నమోవాక్యాలు ప్రకటిద్దాం

గతకాలమంతా...
బందెలదొడ్డిలో బందీలైన
గుడ్డెద్దులమైనందుకు
సిగ్గుపడదాం
మందలో కలిసిపోయిన
గొర్రెలమైనందుకు
మన్నించమందాం

పరుల చూపుల కళ్ళగంతల
బానిసత్వ సంకెళ్ళను
విప్పుకుందాం
సొంత ఆలోచనాలోచనాల
సొంత దారులమవుదాం...
...స్వతంత్రులమవుదాం !

పనిదొంగల పలాయన వాదాన్ని
ఇక తరిమి కొడదాం
పరాన్నభుక్కుల స్వాహారాగాలనిక
బంధించేద్దాం...
దొంగాటలకు.. నకిలీ అందాలకు
కిరీటాలమర్చే వేషధారులనిక
బహిష్కరిద్దాం...

ఇప్పుడు .... ఇక్కడ....
నల్లని వర్ణం శ్రమజీవన సౌందర్యం !
స్వేద పరిమళం శ్రమశక్తికి సంకేతం !
నీలిమేఘమే వర్షాన్ని గర్భాన ధరించిన
హర్షధ్వానం !!

# సాంస్కృతిక సామ్రాజ్యవాదం

**పి.యస్ నాగరాజు**

నా వేలిని నా కంటికి అరికంటకం చేస్తుంది
మన బొటనవేలిని సూపర్‌మేన్ చేసి
మునగచెట్టు చిగురుకొమ్మ ఎక్కించి
సమిష్టిలోంచి నైపుణ్యాన్ని ఏకాకినిచేస్తుంది !
ఐదువేళ్ళ సంఘటితం నిండు పాలకుండలో
చల్లచుక్క అది !
నీ నేలను నీ చేత్తోనే డొల్ల బారిస్తుంది !
మన నాలుక మీది అమ్మపాల కమ్మదనాన్ని
ఆధిపత్య భాషతో చెదపట్టిస్తుంది!
జాతి యువరక్త వసంతంలో
స్వీయాత్మక సంకుచిత కెరీరిజాన్ని
ఆకురాలు కాలాలుగా కుమ్మరిస్తుంది !




దేశభక్తి స్ఫూర్తితో గద్దెమీదిగెద్దల
వేలంవెర్రి పదవీ అరాచక వ్యాపారాల
స్వార్ధ మూర్ఖత్వాన్ని చొప్పించి
క్రీడల్ని యుద్ధాలుగా – యుద్ధాల్ని క్రీడలుగా
బుల్లితెరకెక్కించి ' చుక్కల ' సుఖవాద తిమ్మిరిని
చిమ్ముతుంది!
మానవత్వం గుండెల్లో నెరదల అమావాస్య అది
సౌరచైతన్యానికి పట్టిన ప్రపంచీకరణ గ్రహణం!
నీ రక్తంలో విచ్ఛిన్న రసాయనిక!
నా ఊపిరిలో అణుధూళి యవనిక!
మన మనుగడ మూలంలోకి
చొచ్చుకొచ్చిన అవాంఛిత ఉత్పరివర్తన!



Feb 2010 _Final_Pages.pmd 31 1/28/2003, 2:20 PM

**మార్క్సిస్టుయోధుడు జ్యోతిబసుకు దేశప్రజలు, నేతలే కాకుండా వివిధ దేశాల నాయకులు ఘననివాళి అర్పించారు. ఆ మహానేత సంస్మరణార్థం తన 94వ పుట్టినరోజు (జూలై 2008లో) బంగ్లాదేశ్‌కు చెందిన ఒక సంస్థ ప్రత్యేక సంచికలో ప్రచురించిబడిన బెంగాలీ వ్యాసం అనువాదం ఇక్కడ ఇస్తున్నాం.**



# సమయం పట్టినా లక్ష్యాన్ని చేరుకుని తీరుతాం

## జ్యోతిబసు

ఇప్పుడు నా వయసు 94 నడుస్తోంది. పాతవి చాలావరకు ఇప్పుడు గుర్తుకు రావు. గత 67 ఏళ్లుగా నేను కమ్యూనిస్టు పార్టీ హోల్‌టైమర్ని. 1940 సంవత్సరంలో ఇంగ్లాండు నుండి తిరిగి వచ్చాక కామ్రేడ్ ముజఫర్ అహ్మద్ నాకు పార్టీ సభ్యత్వం ఇచ్చారు. అప్పటి నుండే హోల్‌టైమ్ రాజకీయ కార్యకర్తగా పని చేయడం మొదలు పెట్టాను.

ఐతే అంతకు ముందే ఇంగ్లాండ్‌లో ఉండగానే నేను మార్క్సిజం వైపు ఆకర్షితుడనయ్యాను. గ్రేట్ బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పని చేయటం మొదలు పెట్టేను. అక్కడ మేము ప్రవాస భారతీయ విద్యార్థులను సంఘటితం చేసే వారం. లండన్ మజ్లిస్ రూపొందింది. దానికి నేను ప్రథమ కార్యదర్శినయ్యాను. భారతీయ విద్యార్థులతో కమ్యూనిస్టు గ్రూపు తయారైంది. అందరి పేర్లు నాకు గుర్తు లేవు. కాని భూపేశ్ గుప్తా, స్నేహాంశు ఆచార్య, ఇంద్రజిత్ గుప్తా, పి.ఎన్.హక్సర్, మోహన్ కుమారమంగళం, రజని పటేల్, ఎన్.కె.క్రిష్ణన్, నిఖిల్ చక్రవర్తి, అరుణ్‌బోస్ ప్రముఖులు ఇందులో వున్నట్లు గుర్తు. లండన్‌లో ఉన్నప్పుడే మేము కొంతమంది భారత దేశానికి తిరిగి వచ్చాక హోల్‌టైమ్ పార్టీ కార్యకర్తలుగా పని చేయాలని నిర్ణయించుకున్నాం. 1940లో ఇంగ్లాండ్ నుండి పడవలో ప్రయాణించి మొదట బొంబాయి వచ్చి దిగాను. దిగడంతోనే కమ్యూనిస్టు పార్టీ నాయకులతో కలిశాను.

మా ఇంట్లో మాత్రం ఎవరూ నా ఈ నిర్ణయాన్ని హర్షించలేదు. కొడుకు ఇంగ్లాండ్ నుండి బారిష్టర్ పాసై వచ్చాడు కనక ప్రాక్టీసు మొదలు పెట్టాలి, ఆర్జించాలని మా నాన్నగారు అనుకున్నారు. నిజానికి రాజకీయాలతో మా కుటుంబానికి ఏ సంబంధమూ లేదు. నాన్నగారు డాక్టరు. ఇద్దరు పెద్దనాన్నలు న్యాయవాదులు. మా పూర్వీకులు బంగ్లాదేశ్‌లో ఢాకా జిల్లాలో బార్ది గ్రామస్తులు. నేను మాత్రం పుట్టింది కలకత్తాలో హ్యారిసన్ రోడ్లో ఒక ఇంట్లో. ఇప్పుడు దాని పేరు మహాత్మాగాంధీ రోడ్. కాకపోతే మా కుటుంబంలో స్వాతంత్ర సమరయోధులు, విప్లవకారుల పట్ల గౌరవం, సానుభూతి ఉండేవి. ఇది నేను ఎన్నో విధాల తెలుసుకున్నాను.

దేశానికి తిరిగివచ్చి హోల్‌టైమర్‌గా పని మొదలు పెట్టినప్పటి నుండి పార్టీ పిలుపు మేరకు వివిధ ఆందోళనలు, పోరాటాల్లో పాల్గొన్నాను. శాసనసభలో, బయటా పార్టీ ఎప్పుడు ఏ బాధ్యత అప్పచెబితే, అది నిర్వహించే ప్రయత్నం చేశాను. పార్టీ పని చేయబోయి అరెస్టు అవ్వాల్సొచ్చింది. జైలుకెళ్లాల్సొచ్చింది. ఇంకా చాలా సార్లు రహస్య జీవితం గడపాల్సొచ్చింది. స్వాతంత్రానికి ముందు కమ్యూనిస్టు పార్టీ బ్రిటిష్ సామ్రాజ్యవాద దమనకాండని భరించినట్టే స్వాతంత్రం తరువాత కూడా మేము మళ్లీ మళ్లీ దౌర్జన్యం, దమనకాండ ఎదుర్కోవాల్సి వచ్చింది.

నేను దేశానికి తిరిగి వచ్చి పని మొదలు పెట్టినప్పుడు పార్టీకి చట్టబద్ధత లేదు. బ్రిటిష్ పాలనలో చట్టబద్ధతలేని పార్టీ హోల్‌టైమ్ కార్యకర్తగా నా ముఖ్యమైన పనులు రహస్యంగా ఉన్న నాయకులు, కార్యకర్తల రహస్య సమావేశాల స్థానం, ఆశ్రయం ఏర్పాటు చేయటం, బయటివారితో సంబంధం పెట్టుకోవటం, నిధులు సేకరించటం వగైరా. నేను చాలా సభల్లో ఉపన్యసించాల్సొచ్చేది. నన్ను పార్టీ తరగతులు చెప్పటానికి కూడా పంపేవారు. సోవియట్ మైత్రి సమితి (ఎఫ్.ఎస్.యు.), ఫాసిస్టు వ్యతిరేక రచయితల సంఘం పని మీద నేను వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఎఫ్.ఎస్.యు. మొదటి కార్యదర్శిని నేనే.

1942 ఆఖరికి బ్రిటిష్ వారు గత్యంతరం లేక పార్టీకి చట్టబద్ధత కల్పించాల్సి వచ్చింది. మా పార్టీ మొదటి మహాసభ ఆ తరువాత నిర్వహించబడింది. 1943లో బొంబాయిలో జరిగిన మొదటి కాంగ్రెస్‌లో నేను మాత్రం ప్రతినిధిగా లేను. నా గుర్తున్నవరకు ఆ తరువాత సంవత్సరం నుండే నన్ను కార్మికుల మధ్య పని చేయడానికి పంపించటం జరిగింది. మొదట ఓడరేవు, డాక్ శ్రామికులు, తరువాత రైల్వే కార్మికుల మధ్య నేను పని మొదలు పెట్టాను. హౌరా, సీల్డా కాక తూర్పు బెంగాల్, అస్సాంలో వివిధ ప్రాంతాలకు ఈ నిర్మాణాన్నే



Feb 2010 _Final_Pages.pmd 32 1/28/2003, 2:20 PM

రూపొందించగలిగాము. తరువాత 1946 సంవత్సరంలో ఈ రైలు కార్మికుల నియోజకవర్గం నుండే నేను మొదటిసారిగా శాసన సభ్యుడిగా ఎన్నికయ్యాను. అప్పుడే డార్జిలింగ్ నుండి రతన్‌లాల్ బ్రాహ్మణ, దినాజపూర్ నుండి రూప్ నారాయణ రాయ్ కూడా కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా ఎన్నికయ్యారు.

అప్పుడు తెభాగా ఉద్యమం నడుస్తున్నది. దీని గురించి సభలు నిర్వహించటానికి నాకు ప్రతి జిల్లా నుండి పిలుపొచ్చేది. నాకు గుర్తుంది, ఒకసారి నేను స్నేహాంశు (ఆచార్య) మైమన్‌సింగ్ జిల్లాకు వెళ్లాము. హాజం ప్రాంతంలో అడుగిడిన వెంటనే ఇద్దరు బ్రిటిష్ పోలీసు ఆఫీసర్లు వచ్చి మమ్మల్ని అరెస్టు చేసి ఠాణాకి తీసుకెళ్లారు. స్నేహాంశు మైమన్‌సింగ్ భాగ్యకుల్ మహారాజు కొడుకు. కనుకనే మమ్మల్ని ఠాణాలో ఎక్కువసేపు ఉంచటానికి సాహసించలేదు. జిల్లా మెజిస్ట్రేట్ మిస్టల్ బాస్తిన్ మమ్మల్ని జిల్లా నుండి బహిష్కరించినట్టు ఆదేశించాడు. అప్పుడు ముస్లిం లీగ్ ప్రభుత్వం. సయ్యద్ సుహ్రావర్ది ముఖ్యమంత్రి. నేను తరువాత ఆయన్ను అడిగాను, తెభాగా బిల్లును తొక్కిపెట్టారెందుకని. సుహ్రావర్ది నాకు చెప్పారు. "నా పార్టీలో ఇంతమంది జోతదార్లు (భూకామందులు) ఉన్నారన్న సంగతి నాకు తెలీదు" అని.



ప్రజానేతకు అశేష జనావళి అంతిమ వీడ్కోలు

కొద్దిరోజుల తరువాత దేశం స్వతంత్రమయింది. కాని మా పోరాటం ముగియలేదు. నాకు గుర్తొస్తోంది, స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది రోజులకే కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీను నిషేధించినట్లు ప్రకటించింది. మా నాయకుల్ని నిర్బంధించటం జరిగింది. మా ఇంట్లో అప్పుడు అందరు నిద్రలో వున్నారు. తెల్లవారుజామున పోలీసులొచ్చారు. నన్ను నిర్భంధించి ముందు ఇలిసియంరోలో ఎస్.బి. ఆఫీసుకు తీసుకెళ్లారు. తరువాత ప్రెసిడెన్సీ జైల్లో పెట్టారు. నా మీద హాస్యాస్పదమైన అభియోగాలన్ని మోపారు. నన్ను బర్మా రైతు సంఘం ఆహ్వానించిందని (నాకు అటువంటి ఆహ్వానం ఏమీ రాలేదు), నేను కార్మిక సంఘానికి పని చేస్తానని వగైరా. అప్పుడు హ్యాబియస్ కార్పస్ దావా వేసే వీలుండేది కాదు. హైకోర్టులో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ఒక కమిటీ ఉండేది. వారి వద్ద అప్పీలు చేశాను. మూడు నెలల తరువాత నన్ను విడుదల చేయక తప్పలేదు. ఐతే మళ్లీ మరో అభియోగం మోపి నన్ను నిర్బంధించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనంతట తానుగా కమ్యూనిస్టు పార్టీకి చట్టబద్ధత ఇవ్వలేదు. దేశ రాజ్యాంగం ప్రకటించిన తరువాత దానిలోని అధికరణం ప్రకారం మేము దావా వేశాం. భారత ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీపై విధించిన నిషేధాజ్ఞ ఎత్తివేయక తప్పలేదు. మేము కూడా 1951 సంవత్సరంలో హ్యాబియస్ కార్పస్ అభ్యర్థనలు పెట్టి జైళ్ల నుండి విముక్తులయ్యాము. ఆ ఏడాదే కలకత్తాలో పార్టీ రహస్య అఖిల భారత మహాసభ జరిగింది. నేను దానిలో ప్రతినిధిగా ఉన్నాను. మహాసభ నుండి అజయ్ ఘోష్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

పార్టీ చట్టబద్ధం అయిన అవకాశాన్ని ఉపయోగించుకుని మేము నిర్మాణాన్ని విశాలంగా విస్తరింపచేసే పనిలో నిమగ్నమయ్యాం. బిందిముక్తి ఉద్యమం, కాందీశీకుల పునరావాసం డిమాండ్‌పై ఉద్యమం వంటి మధ్య పార్టీ పెరగనారంభించింది. ప్రజా సంఘాల్లో కూడా చాలామంది చేరారు. వాటి మధ్యనే మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1952 సంవత్సరపు ఆ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్ శాసన సభలో కమ్యూనిస్టు పార్టీయే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా అవతరించింది. మాకు 28 సీట్లు వచ్చాయి. మేము బలపర్చిన మరో ఇద్దరు కూడా గెలిచారు. కాని మా పార్టీకి శాసనసభలో ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వలేదు. మీనమేషాలు లెక్క పెట్టాక మాకు 'ప్రధాన' ప్రతిపక్షపార్టీగా, పార్టీ శాసనసభా నాయకుడికి 'ప్రధాన' ప్రతిపక్ష పార్టీ నాయకుడిగా గుర్తింపు లభించింది. నిజానికి వారు మా ప్రభావం పెరగకుండా ఎలాగైనా అడ్డుకోవాలని అనుకున్నారు. ఏదేమైనా, ఏ పార్టీనైతే స్వాతంత్రం తరువాతనే కొన్నేళ్లపాటు కాంగ్రెస్ ప్రభుత్వం చట్టబద్ధత లేకుండా ఉంచిందో, ఆ పార్టీయే ప్రధాన ప్రతిపక్ష పార్టీగా గుర్తింపు పొందటం ఒక కీలకమైన సంఘటన.

1954లో మధురైలో మూడవ పార్టీ కాంగ్రెస్‌లో నన్ను కేంద్ర కమిటీలో తీసుకున్నారు. ఐతే అంతకు ముందే నన్ను ఏకగ్రీవంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఒకవైపు ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేతగా శాసన సభలో శాసనపరమైన పని, మరోవైపు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పని, నా భుజాలపై చాలా పెద్ద బాధ్యతే వచ్చి పడింది. ఈ సమయంలో ట్రాయ్ ఛార్జీలు పెంపు వ్యతిరేక ఆందోళన, ఉపాధ్యాయుల ఆందోళన వంటి కొన్ని పెద్ద ఆందోళనలు సంఘటితమయ్యాయి. 1956లో అప్పటి ముఖ్యమంత్రి డా॥ బిధాన్ చంద్రరాయ్ బీహార్ ముఖ్యమంత్రితో కలిసి ఉమ్మడిగా హఠాత్తుగా బెంగాల్–బీహార్ సంయుక్తీకరణకు ఒక ప్రతిపాదన తీసుకొచ్చారు. దానిపై రాష్ట్రమంతటా విస్తారమైన ఆందోళన మొదలయింది. ఈ సమయంలోనే కేరళలో పాల్ఘాట్‌లో పార్టీ నాల్గవ కాంగ్రెస్ నిర్వహణ జరిగింది. కాని నేను, ప్రమోద్‌దాస్‌గుప్తాతో సహా ఇంకా ఎంతోమంది ఈ కారణంగా నాల్గవ కాంగ్రెస్‌కి వెళ్లలేకపోయాం. చాలా మంది నిర్భందించబడ్డారు. ఆఖరుకి కలకత్తా ఉత్తర–పశ్చిమ లోకసభ నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవటంతో బిధాన్‌రాయ్ వెనక్కి తగ్గారు.

ఇటువైపు పార్టీ లోపల సైద్ధాంతిక వివాదం అప్పుడు క్రమంగా తలెత్తుతున్నది. 1961 సంవత్సరం విజయవాడ మహాసభలో అది చరమ రూపం ధరించింది. ఆసారి చీలిక ఏదోలా ఆపగల్గినా తరువాత అది పెరుగుతూ ఉంది. ఆఖరుకి బయటకు వచ్చేశాము. రాజ్యం వర్గ స్వభావం, విప్లవ స్థాయి వగైరా గురించి మాలో అభిప్రాయభేదాలు



Feb 2010 _Final_Pages.pmd 33 1/28/2003, 2:20 PM

ఉన్నాయి. అది అందరికీ తెలుసు. కలకత్తాలో ఏడవ పార్టీ మహాసభ నుండి మేము ప్రత్యేక పంథా తీసుకున్నాం. కొత్త పార్టీ ప్రణాళిక ఆమోదించబడింది. ఆ తరువాత తేలిందేమంటే మేమే ప్రధాన వామపక్షం అయిపోయాం. ప్రజల మద్దతు కూడా మావైపే ఎక్కువ ఉన్నది. 1967, 1969 సంవత్సరాల్లో ఈ రాష్ట్రంలో ఐక్య సంఘటన ప్రభుత్వాలు ఏర్పర్చే సమయంలో కూటమిలో ఒక్కరుగా అతి పెద్ద పార్టీగా మేము ఉన్నాం. 1971లో మేము ఒంటరిగానే అతి పెద్ద పార్టీగా అవతరించాం. కాని మమ్మల్ని ప్రభుత్వం ఏర్పాటు చేయనీయలేదు. దీని తరువాత 1972 రిగ్గింగ్ ఎన్నికలు వచ్చాయి. ఉదయం 11 గంటల లోపే అన్ని ఓటింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేయటం అయిపోయింది. మేము ఈ ఎన్నికల ద్వారా ఏర్పడిన శాసన సభను బహిష్కరించాం. ఆ తరువాత అర్ధఫాసిస్టు దమనకాండ గురించి, ఆత్యయిక పరిస్థితి గురించి అందరికి గుర్తున్నదే.


పశ్చిమబెంగాల్ లెఫ్ట్‌ఫ్రంట్ క్యాబినెట్ సమావేశం

కొంతమంది ప్రజలు కాంగ్రెస్‌ను క్షమించలేదనేది 1977లో వచ్చిన మొదటి అవకాశంలోనే రుజువైపోయింది. కాంగ్రెస్ దేశమంతటా మట్టి కరిచింది. ఈ రాష్ట్రంలోనైతే చెప్పక్కర్లేదు. ఈ రాష్ట్రంలో మొదటి వామపక్ష సంఘటన ప్రభుత్వం ఏర్పడింది. ఆ తరువాత నుండి వరసగా ఏడుసార్లు ఈ రాష్ట్రం ప్రజలు వామపక్ష సంఘటనను గెలిపించి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చరిత్రలో ఒక కొత్తచరిత్ర సృష్టించేరు. ఈ రాజ్యాంగ పరిమితుల మధ్య కూడా పశ్చిమ బెంగాల్ వామపక్ష సంఘటన ప్రభుత్వం ప్రజలకు ఉపయోగకరంగా ఎన్నో పనులు చేయగల్గిందనేది ఈ రోజు నిర్ధారణైపోయింది. మేము ఇన్నాళ్లు అధికారంలో ఉండగల్గింది ప్రజల సానుకూల తీర్పు వల్లనే. అదే సమయంలో వామపక్ష సంఘటన ప్రభుత్వం మొత్తం దేశ ప్రజల ముందు ప్రత్యామ్నాయ కార్యక్రమం యొక్క ఒక ఉదాహరణను ఉంచగల్గింది. జాతీయ రాజకీయాల్లో కూడా వివిధ విధాలా మా సాఫల్యం ముద్రపడింది. దేశం ఇప్పుడు సంకీర్ణ రాజకీయాల యుగంలో ప్రవేశించింది. ఈ విషయంలో పశ్చిమ బెంగాల్లో 30 ఏళ్ల పైబడి నిరవధికంగా నడుస్తున్న 9 పార్టీల ఒక బలమైన కూటమిగా వామపక్ష సంఘటన ప్రభుత్వం ప్రభావం స్వీకరించక తప్పదు. కారణం, సంకీర్ణ ప్రభుత్వాలంటేనే అస్థిరత్వం, అరాచకం అని రుజువౌతున్న సమయంలో ఈ రాష్ట్రంలో ఈ కూటమి స్థిరంగా, శాంతిపూర్ణ వాతావరణంలో, ప్రజోపయోగ అభివృద్ధికి ఉదాహరణ స్థాపించి మొత్తం దేశ ప్రజల ముందు ఒక ఉజ్వల ప్రత్యామ్నాయాన్ని ఉంచింది.

సంకీర్ణ రాజకీయాల విషయంలోనే కాకుండా, కేంద్ర, రాష్ట్ర సంబంధాల పునవ్యవస్థీకరణ లాంటి కీలకమైన విషయం కూడా వామపక్ష సంఘటన ప్రభుత్వమే ముందుకు తీసుకొచ్చింది. ఆర్థిక, పాలనాపరమైన అధికారాల వికేంద్రీకరణ, క్షేత్రస్థాయిలో ప్రజల భాగస్వామ్యం ఆధారంగా ప్రజాస్వామ్యం అభివృద్ధి పరిచే విషయంలో పశ్చిమ బెంగాల్ దేశం మొత్తం ముందు నమూనాగా నిల్చింది. ఈ రాష్ట్రంలో మూడంచెల పంచాయతీ వ్యవస్థ తరహాలో దేశం అంతటా అమలు జరపటానికి చట్టం చేయటం జరిగిందనేది ఈ రోజు అందరికి తెలిసిన విషయమే. భూసంస్కరణలు, వ్యవసాయం, గ్రామాభివృద్ధి విషయంలో కూడా ఈ ప్రభుత్వ విజయాలు సర్వజన విదితం.దాంతోపాటు ప్రజాస్వామ్య వాతావరణం, శాంతి, స్థిరత్వం, మత సామరస్యం నిరాఘాటంగా పరిరక్షించే విషయంలో దేశం ముందు ఈ రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది.

పరిశ్రమల అభివృద్ధి విషయంలో మేము ప్రత్యామ్నాయ దృక్పథంతోనే పని చేస్తున్నాం. స్వాతంత్ర్యం తరువాత దీర్ఘకాలం పాటు పశ్చిమబెంగాల్ ఆర్థిక, ఇతర విషయాల్లో కేంద్రం నుండి వివక్షకు, వైషమ్యానికి గురైంది. 1977 సంవత్సరంలో వామపక్ష సంఘటన ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రం నుండి ఇటువంటి ఇబ్బందులన్ని అధిగమించే మేము పరిశ్రమల ఏర్పాటుకు విధానం రూపొందించాం. తొంభైయవ దశకం మొదట్లో లైసెన్సు పద్ధతి ఎత్తివేసిన తరువాత మాకు మరింత అవకాశం లభించింది. మేము వ్యాపార సంఘాల సమావేశాలకు వెళ్లి ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టమని అభ్యర్థిస్తుండగా, మేము ఏ విధానం ఆధారంగా ఈ రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటున్నామో అది లిఖిత రూపంగా ఇస్తే బాగుంటుందని వారు మాకు చెప్పారు. అప్పుడు 1994 సంవత్సరంలో శాసన సభలో ప్రస్తుత పారిశ్రామిక విధానం ప్రకటించాం. తరువాత 1995 సంవత్సరంలో ఛండిఘర్‌లో నిర్వహించిన మా పార్టీ 15వ కాంగ్రెస్‌లో దీన్ని ఆమోదించటం జరిగింది.

ఐతే ఒకటి గుర్తుంచుకోవాలి. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపురలలో మేము వామపక్ష ప్రభుత్వాలు నడుపుతున్నది ఈ బూర్జువా రాజ్యాంగ చట్రానికి లోబడే. ఈ పెట్టుబడిదారీ రాజ్యాంగ చట్రంలోనే ఈ ప్రభుత్వాలు సోషలిస్టు కార్యక్రమం అమలు జరుపుతాయని మేము ఎన్నడూ చెప్పలేము. సామ్యవాదం, సోషలిజం మా లక్ష్యం. వర్గరహిత, దోపిడీరహిత సామాజిక వ్యవస్థ నిర్మించాలని మేమనుకుంటాం. అదే మా లక్ష్యం. ఆ లక్ష్యమే మేము చేరుకోవాలి.

ఒక క్లిష్టమైన రాజకీయ పరిస్థితి మధ్య మేము ముందుకు పోతున్నాం. మా 19వ పార్టీ కాంగ్రెస్ ఈ మధ్యే నిర్వహించబడింది. ప్రతినిధులు పరిస్థితిని విశ్లేషించి పార్టీని, ప్రజాసంఘాలను ఇంకా విస్తరించాలని నిర్ణయించారు. నేను ఒకటే చెప్తాను, ప్రజల మీద మాకు నమ్మకం సడలకూడదు. ప్రజల వద్దకు మళ్లీ మళ్లీ వెళ్లాల్సి ఉంటుంది. వారి అభిమానం మేము చూరగొనాల్సిందే. ఈ పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ నిలిచేది కాదు. ఇది మేము గట్టిగా చెప్పగలం. అయితే దానికి సమయం పడుతుంది. కాని మేము లక్ష్యాన్ని చేరుకుని తీరుతాం.

**(అనువాదం: వేదుల రామకృష్ణ)** ■



Feb 2010 _Final_Pages.pmd 34 1/28/2003, 2:20 PM

## చలన చిత్రాలు



**మంత్రి కృష్ణమోహన్**

పాత ఫోటోలు–
అక్కడక్కడా పగిలిన ఫోటోలు–
దుమ్ముపట్టి నీళ్ళు ఇంకి
రూపం మారిన ఫోటోలు–
తీయించుకున్నప్పుడవి
తీపి జ్ఞాపకాలు,
నేడు, ఫ్రేము కట్టిన విషాద జ్ఞాపికలు

తడుముతుంటే పగిలిన గాజుపెంకు
చురుక్కుమని గాయం చేసింది
పట్టిన దుమ్ము
లేవనని మొరాయించింది
ప్రతి చిత్రం వెనుక
అనురాగ గేయాలున్నాయి
ప్రతి రంగుల తెర వెనుకా
ఆనందపు సన్నివేశాలున్నాయి

ఫోటో నిశ్చలచిత్రం కాదు
జీవన స్థితిని బంధించిన
చలనచిత్రం
తెరలు తెరలుగా కాలాన్ని వెనక్కి నెట్టి
మనస్సాగరంలో కెరటాలు రేపగల
మున్నీటి చిత్రం
అదృశ్యమైన రూపాల్ని
గుండెనిండా నింపగల అపురూప
చిత్రం

ఫోటో ఫోటో కదులుతూ వుంటే
అశ్రువులొక్కొక్కటిగా నివాళి
పలుకుతాయి
ఫోటోల్లోని ప్రేమమూర్తులు
మనసారా పలకరిస్తారు
నిశ్శబ్దంగా కుశల ప్రశ్నలేస్తారు
పంచుకున్న ప్రేమల్ని పేనుకున్న
అనుబంధాల్నీ
తట్టి మరీ ప్రస్తావిస్తారు
జ్ఞాపకాల వలలు విసిరేస్తారు

చిత్రం ఏమిటంటే
నవ్వుతున్న ప్రతిఫోటో
మరింత ఏడిపిస్తుంది

## ఒక బార్బీ ప్రపంచం

**కందేపి రాణీప్రసాద్**

పూలనవ్వులు తుంచేసిన
ఖాళీ చెట్లలా
కాలేజీ తరగతి గదులు
అందాల షోకేసుల్లో
నిర్జీవ బార్బీ బొమ్మల్లా
క్లాసురూముల్లో పిల్లలు
అసలే ఇంటర్ మీడియట్
ఆపై ఎంసెట్
ఇంకేముంది
పార్టీలకూ, ఫంక్షన్లకూ
సినిమాలకూ, షికార్లకూ
నిషేధిత వ్యక్తులు
రెప్పలు మూసుకున్నప్పుడల్లా
చదవటం కుదరటం లేదు
రెప్పలు వాలకుండా
మందులివ్వండి డాక్టర్‌గారూ !
ఇవీ తల్లిదండ్రుల
విద్యుక్త ధర్మాలు
ఊపిరి పీల్చుకోవటానికి
చాలా టైమ్‌వేస్ట్ చేస్తున్నారు
ఇలా అయితే ర్యాంకులు రావు
పేరెంట్స్‌కు కాలేజీల
బెదిరింపులు
ఆశలు ఇష్టాల మధ్య
అడ్డకత్తెరలో
పోకచెక్కల్లా నలిగిపోతున్నారు

చదువుల సారపు
జీవనదుల్ని వదిలి
ఎండమావుల కోసం పరుగులు
అవి అందలేదని ఆత్మహత్యలు


**'ప్రస్థానం'కు చందా కట్టండి!**
**నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!**

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/–** **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/–**

**అయిదేళ్లకు : రు. 500/– — పదేళ్లకు : రు. 1000/– — విడి ప్రతి : రు. 10/–**

**చందా దారులకు విజ్ఞప్తి** చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.

మేనేజర్
ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్–20
వివరాలకు : 040–27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in






Feb 2010 _Final_Pages.pmd 35 1/28/2003, 2:20 PM

నివేదిక

# దేశానికే తలమానికం దేశభక్తి గేయం

**అల**




*ప్రజాశక్తి ప్రచురించిన గురజాడ దేశభక్తి గేయం ఇతర గేయాలు పుస్తక ఆవిష్కరణ. చిత్రంలో విజయనగరం సాహితీస్రవంతి సభ్యుడు కృష్ణారావు, ప్రముఖ విమర్శకులు డాక్టర్ యు. నరసింహమూర్తి, రచయిత మల్లిపురం జగదీష్*

విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి విజయనగరం శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 29న గురజాడ దేశభక్తి పుస్తకావిష్కరణ సభ జరిగింది. గురజాడ దేశభక్తి గేయానికి వందేళ్ళైన సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్ ఈ పుస్తకాన్ని వెలువరించింది. ఈ పుస్తకావిష్కరణ సభకు సాహితీస్రవంతి విజయనగరంశాఖ సభ్యుడు కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ భాషల్లోని దేశభక్తి గేయాల్లో అన్నిటికంటే గురజాడ దేశభక్తి గేయం చాలా ఉన్నతమైంది అన్నారు. బంకించంద్రుని వందేమాతర గీతం భారత స్వాతంత్ర్య పోరాటానికి ఉత్తేజాన్ని ఇచ్చినప్పటికి కొన్ని పరిమితులున్నాయని అన్నారు. గురజాడ ఎవరికీ అందనంత ఉన్నతంగా రచన సాగించాడని తెలియజేసారు. మిగిలిన దేశభక్తి గేయాలన్నీ భౌగోళికమైన సరిహద్దులను వర్ణించడం గాని, దేశమాతను కీర్తించడం గాని, గతకాలపు గొప్పతనాన్ని కొనియాడ్డంగాని చేశాయని గురజాడ దేశభక్తి గేయం అందుకు భిన్నంగా రూపుదిద్దుకుందని సోదాహరణంగా వివరించారు. కవి, గాయకుడూ మల్లిపురం జగదీష్ మాట్లాడుతూ ప్రభుభక్తి, దైవభక్తికి భిన్నమైనది దేశభక్తని గురజాడ నిరూపించాడని తెల్పారు. గురజాడ సమకాలికులైన కొందరు రచయితలు ప్రభుభక్తి మైలురాయిని దాటలేదని దాటిన కొద్దిమంది కూడా గురజాడని అందుకునే స్థితిలో లేరని వివరించారు. "ఏదేశమేగినా, ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అంటూ రాయప్రోలు దేశభక్తిని ప్రకటించినా ఈ గేయంలో దేశమాతను




*సభలో గురజాడ దేశభక్తి గీతం, కన్యక, పూర్ణమ్మ మొదలైన గేయాల్ని శ్రావ్యంగా ఆలపించిన చంద్రిక, హైమవతి*

కీర్తించడం తప్ప అన్యంలేదని అభిప్రాయపడ్డారు. గురజాడ దేశభక్తి గేయంలో ప్రపంచీకరణ ప్రస్తావన కనిపిస్తుందని, అయితే ఈ గేయంలో కనిపించిన ప్రపంచీకరణ నేడు మనం అనుభవిస్తున్న సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలతో రుద్దబడిన ప్రపంచీకరణ కాదని తెలిపారు. ఒక ఉన్నత సమాజం కావాలని గురజాడ కోరుకున్నాడన్నారు. భూస్వామ్య వ్యవస్థ బద్ధలై పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుకొస్తుందని గురజాడ గ్రహించారన్నారు. ఉన్న వ్యవస్థకంటే మెరుగైన వ్యవస్థ వస్తుందని విశ్వసించారన్నారు.

దేశభక్తి పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥ యు.ఎ. నరసింహమూర్తి మాట్లాడుతూ ఇటీవల కాలంలో దేశభక్తి గీతాల పట్ల విమర్శ పెరుగుతుందని అది తగదని హితవు పలికారు. గురజాడ దేశభక్తి గీతంతో మిగిలిన గీతాల్ని పోల్చినప్పుడు ఆ గీతాలు ఏ సందర్భంలో రాసారు, దాని కాలమేది, స్థలమేది అన్న అంశాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. బంకిం చంద్రచటర్జీ వందేమాతరాన్ని జాతీయ గేయం కావాలని రచించలేదని ముందుగా గుర్తించాలన్నారు. ఆనందమఠం అనే చారిత్రక నవలలో సాధువుల్ని దేశ భక్తులుగా మార్చడానికి కాళీమాత స్మృత్యర్థం ఆ గేయం జనించిందని వివరించారు. దీన్ని అర్థం చేసుకోకుండా గురజాడ దేశభక్తి గేయంతో సరిపోల్చడం తగదన్నారు. అయినా స్వాతంత్ర్య పోరాటంలో ఆ గేయం గొప్ప భూమిక వహించిందని మరవకూడదన్నారు. ఆ గీతం ఇచ్చిన ప్రేరణను గుర్తించి లౌకికభావానికి ఇబ్బందిగా ఉన్న చరణాల్ని తొలగించి జాతీయ గేయంగా స్వీకరించారని తెలిపారు. దేశం బ్రిటిష్ కబంధ హస్తాలలో ఉన్నప్పుడు ప్రజలలో దేశభక్తిని స్వాతంత్ర్య కాంక్షను ప్రేరేపించడానికి రాయప్రోలు సుబ్బారావు గీతాలు ఉపకరించాయని అన్నారు. గరిమెళ్ళ సత్యన్నారాయణ గేయం స్వాతంత్ర్య పోరాట ఉద్యమ గీతమని తెలిపారు. అయితే సమకాలీన కవులందరూ జాతీయ పునరుద్ధరణ వాదులు కాగా గురజాడ పాతని సహించేవాడు కాదని ఆధునికత్వాన్ని కోరుకునే ఏకైక రచయితని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఆదిలక్ష్మి స్వాగతం పలకగా పాపయ్య వందన సమర్పణ చేశారు. చంద్రిక, హైమవతి తదితరులు గురజాడ దేశభక్తి గీతం, కన్యక, పూర్ణమ్మ మొదలైన గేయాల్ని శ్రావ్యంగా ఆలపించారు. ■



Feb 2010 _Final_Pages.pmd 36 1/28/2003, 2:20 PM

నివేదిక



# వచన కవిత్వంపై వర్క్‌షాప్

**కోసూరి రవికుమార్**

"కవిత్వం సమాజ చైతన్యానికి కరదీపిక. కవిత్వం నేల నాలుగు చెరుగుల విస్తరించాల్సిన పత్రహరితం, కవిత్వం ఒక ఆకాంక్ష, కవిత్వం ఒక ఆశయం, మారుతున్న కాలంతో పాటు కవిత్వం, కవిత్వం వ్రాస్తున్న మనం కూడా మార్పు చెందుతున్న అవసరాన్ని గుర్తించి యువ కవితరాన్ని ప్రభావితం చేసే ప్రయత్నమే ఈ వర్క్‌షాపు నిర్వహణ అంటూ గుంటూరు జిల్లా రచయితల సంఘం అక్టోబర్ 11న నిర్వహించింది. బ్రాడీపేటలోనే యు.టి.ఎఫ్. హాలులో జరిగిన ఈ కార్యక్రమం ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా విజయవాడ రేడియో కేంద్రం సంచాలకులు మంగళగిరి ఆదిత్య ప్రసాద్ హాజరవగా, సోమేపల్లి వెంకట సుబ్బయ్య అధ్యక్షత వహించారు.

ఈ కార్యగోష్టిలో వివిధ అంశాల మీద కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత కె. శివారెడ్డి. పాపినేని శివశంకర్, దర్భశయనం శ్రీనివాసాచార్య, కొప్పర్తి వెంకట రమణమూర్తి, పెనుగొండ లక్ష్మినారాయణ ప్రసంగించారు.

రాష్ట్రమంతటి నుంచి  పలువురు హాజరయిన ఈ కార్యక్రమములో  శివారెడ్డి కవిత్వం అధ్యయనం అనే అంశంపై మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం చేసే కవి సమాజానికి సరియైన నిర్వచనంగా నిలుస్తాడన్నారు. గొప్ప కవులు యాదృచ్ఛికంగా రారు, వాళ్ళను వాళ్ళు నిర్మించుకుంటారు. జీవితపు స్పర్శను, సువాసనను మరచిపోతున్న మనసును మనం తట్టిలేపుకుని పునర్నిర్మించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పుస్తకాలు నీకున్న సమస్త వేదన నుండి నిన్ను విడుదల చేస్తాయి. నిన్ను ధీరుడ్ని చేస్తాయి. అందుకని ప్రతి కవి తనను తానే అదిగమించుకోవాల్సిన అవసరం ఉంది. తనకు తానే ఒక ఛాలెంజ్ విసురుకోవలసిన అవసరం ఉంది. తరచి తరచి తనను తాను శుద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. 'పొయెట్రి ఈజ్ ఏ లైఫ్ లాంగ్ ప్రాసెస్' దప్పిక గొన్న హృదయంతో తిరగమని టెనిసన్ అన్నట్లు, ప్రతి కవి తనను తాను దప్పికలో ముంచేసుకోవాలి. కాని "ఇట్ ఈజ్ ఎ పిటి టు అండర్ స్టాండ్ పొయెట్రి, యు హేవ్ టు ఎక్స్‌పీరియన్స్‌సెస్ పొయెట్రి" అంటూ అధ్యయనం యొక్క ప్రాధాన్యాన్ని వివరించారు.

సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కవిత్వం వ్రాస్తున్న, చదువుతున్న ఒక తరానికి ఏ కొంచెమైనా మార్గదర్శకత్వం చేయాలనే సంకల్పంతోనే ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, శిబిరంలో పాల్గొన్న వ్యక్తుల్లోంచి ఏ ఒక్క నిఖార్సైన కవిత తయారయిన మా ఆశయం నెరవేరినట్లే అని అన్నారు.

ముఖ్య అతిధి మంగళగిరి ఆదిత్య ప్రసాద్ మాట్లాడుతూ కవిత్వం నిరంతరం మార్పుకు లోనయ్యే విషయం. ఆయా కాలాలకు, ఆయా సమాజాలకు ప్రాతినిధ్యం వహిస్తూ రాబోయే తరాలకు దిక్సూచిగా నిలిచేది, కాలాన్ని రికార్డు చేసే టేప్ రికార్డర్ వంటిది ఈ కవిత్వం. కవిత్వాన్ని కరదీపికగా మార్చి కొత్తతరం చేతికందించే ప్రయత్నంలో భాగమే ఇలాంటి వర్క్‌షాపులు. కొత్తతరాన్ని ప్రభావితం చేస్తున్న గుంటూరు జిల్లా రచయితల సంఘం మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందని అందువలనే విజయవాడ నుంచి నెల్లూరు దాకా అనేక మంది కవులను రేడియో ద్వారా పరిచయం చేసే అవకాశం ఈ కార్యక్రమాలు కలుగజేసాయని అంటూ శ్రీశ్రీ రచించిన "చూడు చూడు నీడలు" గేయాన్ని, జాషువా పద్యాన్ని శ్రావ్యంగా వినిపించి కవితా సృజన శిబిరాన్ని ప్రారంభించారు.

పెనుగొండ లక్ష్మినారాయణ వచన కవిత్వంలో అనేకమంది కవులు తమ కవిత్వాన్ని ఎలా నిర్వహించారో సోదాహరణంగా వివరించారు. ప్రాచీన కవుల నుండి ఆధునిక కవుల వరకు తమ కవిత్వంలో తాము ఎలా ప్రసారమయ్యింది వివరించారు.

ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచార్య రచించిన "నేల గంధం' వచన కవిత్వాన్ని శివారెడ్డి, పాపినేని శివశంకర్, సోమేపల్లి వెంకట సుబ్బయ్య ఆవిష్కరించగా పాపినేని శివశంకర్  పరిచయం చేశారు. "కవిత్వం అభివ్యక్తి" అంశంపై పాపినేని ఉపన్యసిస్తూ కవిత్వం నిర్మాణాలు, భాష, భావం, శైలి, వస్తు విస్తరణ అంశాలను వివరించారు. వాక్య నిర్మాణంలో ఉన్న లోటు పాట్లను వివరిస్తూ వివిధ కవిత నిర్మాణ



Feb 2010 _Final_Pages.pmd 37 1/28/2003, 2:20 PM

రీతులను విశ్లేషించారు. "మహాప్రస్థానం" నుండి "మరో ప్రస్థానం" వరకు అనేక ఉదాహరణలు ఇస్తూ ప్రసంగించారు. శైలిలో మార్పుచేసుకుంటూ ఎప్పటికప్పుడు తన నిర్మాణాలు తానే ధ్వంసం చేసుకుంటూ, పునర్నిర్మించుకుంటూ ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. ఏమీ చదవని వాడు ఏ గొప్ప కవిత్వాన్ని సృజించలేడు. అందుకే గొప్ప కవిత్వాన్ని చదివి తీరాల్సిన అవసరం ఉంది. ప్రాచీన కవుల కవిత్వం నుండి అన్ని రకాల కవిత్వాన్ని అధ్యయనం చేస్తూ కవిత్వాన్ని పరిపుష్టం చేసుకోవల్సి ఉంటుంది. సందర్భాన్ని అనుసరించి సన్నివేశాన్ని అనుసరించి సరళమైన భాషలో కవిత్వం వ్రాసినట్లే ఒక ఉద్విగ్నమైన సందర్భాన్ని వర్ణించేటప్పుడు గొప్ప భాషను అనుసరించాలని చెప్పారు. "దూరాన పండెరుపు, దొండ పండెరుపు, తొట్టిలో పాపాయి తొలకరి మెరుపు" అన్నప్పుడు జోలపాడుతున్న ఆ తల్లి ఎంత కవిత్వం చెప్పిందో ఆలోచించాలన్నారు.

ఒక్కొక్క కవి శైలిని, తన భాషను తాను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతంలో తిక్కన్న "ధర్మ సూతి మెత్తని పులి" అన్న వాక్యంలో పులిని మెత్తగా సూచిస్తూ కవీత్వకరించాడు. ఆ విధంగా అప్పుడే ఆధునిక అభివ్యక్తీకరణ ప్రారంభమైందని అది అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఈ తరం కవులపై ఉన్న ప్రధాన బాధ్యతని అన్నారు.

ప్రముఖ కవి దర్భశయనం శ్రీనివాసాచారి "నేను, నా కవిత్వ నేపథ్యం" అనే అంశంపై మాట్లాడుతూ కవిత్వాన్ని సమాజం దగ్గరకు తీసుకువెళుతున్నామా లేదా? ప్రజల దగ్గరకు ప్రజలనుద్దేశించిన కవిత్వం చేరుతుందా? దాని సక్రమంగా కమ్యూనికేట్ చేయగల్గుతున్నామా లేదా ? అని ప్రశ్నించుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. 80 శాతం మంది రైతులు గురించి వ్రాస్తున్న కవిత్వం 80 శాతం మంది రైతులకు గాని, 80 శాతం విద్యార్థుల స్థాయికైనా గాని అందుకుంటున్నారా? అని ఆలోచించాలని మాట్లాడుతూ "రైతులు పంట పండించి, ఆ పంటను కొనేవాడు లేక గిట్టుబాటు ధరలేక ఆ పంట దగ్గరే కూలబడి ఉండటాన్ని ఒక గొప్ప విషాదంగా భావించాలి. ఆ విషాదాన్ని ఎంతటి ఆగ్రహంతో వ్యక్తికరించాలో అంతటి భాషా పటిమ ఉండాలి. కవిత మొదటి పంక్తిని చదివి చదవంగానే పాఠకుడు మనను నమ్మాలి. మన వాడని భావించాలి. మనతో పాటు మన వెంట నడవాలి. అందుకనే ఎత్తుగడ నుంచే పాఠకుడుని మన వెంట నడిపించి చివర వరకు సాగేలా వ్రాయగలగాలి. అందుకు వస్తువుకు తగిన నేపథ్యంలోనే కవిత్వం వ్రాయాలి. కవిత్వ వాతావరణానికి, వస్తు వాతావరణానికి సంబంధం ఉండి తీరాలి. నగరాన్ని పరిచయం చేసే ఒక గైడ్ గురించి చెప్పవలసి వచ్చినప్పుడు 'ఆ చూపుడు వేలు అతడు అతని చూపు వెంట వెళుతుంటాం మనం' అన్నప్పుడు మొదటి లైను నుంచే కవి వెంట పాఠకుడు పరిగెత్తుకువస్తాడు. "అన్నం పెడుతున్న రైతు ఏ కాల్వుల్లో కూలాడో, ఇవాళ అన్నం ముందు కూర్చోలేను" అన్నప్పుడు రెండు వాక్యాల్లో రైతుపై జరిగిన అన్యాయాన్ని గొప్పగా చెప్పగలిగాం. అంతే కాకుండా తీసుకున్న వస్తువును తాను కవిత్వీకరించిన తీరును తన కవిత్వం ఉదాహరణలతో సవివరంగా తెలియజేశారు.

వస్తువు – వైవిధ్యం గురించి కొప్పర్తి మాట్లాడుతూ శిల్పం వస్తువును డామినేట్ చేస్తే దిగంబర కవులవుతారు, వస్తువును శిల్పం డామినేట్ చేస్తే "తిలక్" అవుతాడు. రెండు సమాన స్థాయిలో ఉంటే "శ్రీశ్రీ" అనే పాత సూత్రీకరణను గుర్తుకు తెచ్చారు. వస్తువును ఎంచుకోవడం ఒక కళ, వ్యక్తి వేటి మధ్య నిలబడి ఉన్నాడు. ఎందులోంచి వస్తువును ఎంచుకుంటున్నాడు అని నిర్ణయించుకుని భావ కవిత్వం నుండి అభ్యుదయ కవిత్వం వరకు వచ్చిన మార్పులు పరిశీలించాలని "శ్రీశ్రీ" బాటసారి కవితను గుర్తుచేశారు. యువతరం వస్తువును ఇవాళ సమాజానికి బాధ్యత వహించే పరంగా స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఇప్పటి వరకు తీసుకోబడిన వస్తువులకు కొనసాగింపుగా ఉండవలసిన అవసరం ఉన్నది. వాటికంటే భిన్నమైనదే ప్రాచీన కవుల వస్తువు మీద నుంచి ప్రపంచాన్ని తొంగి చూసేదిగా ఉండాల్సిన అవసరం ఉంది. వస్తువు పట్ల కవికి ప్రేమ ఉండాలి. కవితను తనదైన వస్తువుగా భావించగలగాలి. వస్తువును ఎంపిక చేసుకున్నా, సొంతం చేసుకోకపోతే కవిత్వం పండించలేము అన్నారు.

కవిత్వం సగం అల్లేసిన వదిలేసిన లేసులాగా ఉండాలి, దీని అర్థం సగం చెప్పి వదిలేయమని కాదు. వస్తువును ఎంచుకునేటప్పుడు ఎక్కడ మొదలు పెట్టాలి. ఎక్కడ ముగించాలి అనే అవగాహన ఉండి తీరాలి. "పతితులారా! బాధాసర్పదష్టులారా" అన్న శ్రీ శ్రీ కవిత్వం వస్తువు నుంచి "నిద్రపోతున్న ఆమెను లేపవద్దు" అన్న శివారెడ్డి కవిత్వం వరకు వస్తువు ఎంత లోలోపలికి వచ్చిందో గమనించగలగాలి. వస్తువు మానవ జీవితంలోకి ఎలా చొచ్చుకుని వస్తున్నది గమనించగలగాలి. "నలుగురం కలిసిన వేళ మనం మరొక్కళ్ళలోకి, ఒక్కళ్ళలోకి ఒకరం ప్రవహించడం ఎంత బాగుంటుంది" అని పాపినేని శివశంకర్ అన్నట్లు వస్తువును ఎన్నుకునేటప్పుడే అది కవిలోంచి పాఠకుడిలోకి ప్రవహించేలా ఉండాలి అన్నారు. ఒక్కొక్కసారి వస్తువును, శిల్పాన్ని విడదీసి చూడలేనటువంటి పరిస్థితి ఏర్పడుతుంది అంటూ ఇస్మాయిల్ వ్రాసిన "టీ తాగినప్పుడు" అనే కవితను వినిపించారు. సమాజం నిండా కవిత్వం ఉంది. అది కవి నుండి బహిర్గతమౌతుంది అంటూ నేను తను అనే సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కవితను ఉదహరిస్తూ భార్యభర్తల మధ్య తగువును వస్తువుగా ఎలా మలచుకున్నాడో వివరించారు.

వస్తువును ఎన్నుకోవడం అంటే వస్తువు మీద సంపూర్ణమైన అవగాహన కలిగియుండాలి. అలాగే అవగాహనే అభివ్యక్తి అయ్యేలా ఉండాలి. కవిత్వం మానవ జీవితానికి సంబంధించిన మొత్తం విషయాలను స్ఫురింపచేసేదిగా ఉండాలి. వస్తువును స్వీకరించేటప్పుడు వస్తువు పట్ల నిజాయితీ ఉండాలి. వస్తువును నిజాయితీగా నిఖార్సయిన భాషలో, శిల్పంలో వ్యక్తీకరించగలగాలి అంటూ ముగించారు.

మరో కొత్త కార్యక్రమ నిర్మాణం కోసం కావాల్సిన స్ఫూర్తిని, కవిత్వ నిర్మాణంలో తీసుకోవాల్సిన మెళకువలను నిర్మాణాత్మక సూచనలను చేసిన వక్తలకు అధ్యక్షుడు సోమేపల్లి వెంకట సుబ్బయ్య కృతజ్ఞతలు తెలియజేశారు.

■



Feb 2010 _Final_Pages.pmd 38 1/28/2003, 2:20 PM

నివేదిక

*ప్రకాశం జిల్లా రచయితల సంఘం ఆరవ రాష్ట్ర స్థాయి రచయితల మహాసభలు*

# కవులు సమాజ దిశానిర్దేశకులు కావాలి

**డాక్టర్ బీరం సుందరరావు**



*మహాసభలో ప్రారంభోపన్యాసం చేస్తున్న డాక్టర్ కొలకలూరి ఇనాక్*

ప్రకాశం జిల్లా రచయితల సంఘం సంక్రాంతికి ముందే కవులు, రచయితల సాహిత్యాభిమానుల సాహిత్య సంరంభంతో, భాషా వేడుకల్ని కన్నుల పండుగగా నిర్వహించి, రచయితల రసహృదయాల్లో తెలుగు తల్లిని ప్రతిష్టించింది. రాష్ట్ర వ్యాప్తంగానే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా తెలుగు కవులు, రచయితలు సాహితీవేత్తలను ఒక వేదికపై కలిపి, తెలుగు వైభవాన్ని చాటిచెప్పింది. మారుతున్న కాలంతో పాటు కవులు కలమెత్తి, గళమెత్తి సామాజిక చైతన్యమే ధ్యేయంగా, ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చింది. ప్రక్రియ ఏదైనా ప్రజల పక్షాన నిలబడి, పదికాలాలు నిలిచే సాహిత్యాన్ని, కవులు, రచయితలు సృష్టించాలని కర్తవ్యోపదేశం చేసింది.

ప్రకాశం జిల్లా ఒంగోలులో టి.టి.డి. కళ్యాణ మండపంలో, జనవరి 8,9,10 తేదీల్లో ప్రకాశం జిల్లా రచయితల సంఘం నిర్వహించిన (ప్ర.ర.సం) ఆరవ రాష్ట్ర స్థాయి రచయితల మహాసభల ప్రాంగణం సాహితీవేత్తల ప్రసంగాలతో పులకించిపోయింది. పరభాషా వ్యామోహాన్ని నిరసించింది. ప్రముఖుల అభిభాషణలతో అక్షరశోభితమైంది. రాష్ట్రం నలుమూలల నుండి, రాష్ట్రేతర ప్రాంతాల నుండి తెలుగు భాషపై మమకారంతో తరలివచ్చిన తెలుగు బిడ్డల్ని చూసి తెలుగుతల్లి గర్వపడింది. భాషాభిమానుల కరతాళధ్వనులతో ప్రాంగణమంతా మార్మోగింది. 1971వ సంవత్సరంలో డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు నేతృత్వంలో ఏర్పడ్డ రచయితల సంఘం 1984లో ద్వితీయ మహాసభలు జరుపుకొంది. 1999లో బి.హనుమారెడ్డి అధ్యక్షుడిగా అంగరంగ వైభవంగా రజతోత్సవాలు జరిగాయి. అప్పటి నుంచి బి. హనుమారెడ్డి ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి మహాసభలు నిర్వహిస్తూ వస్తున్నారు.



*మహాసభకు హాజరయిన రచయితలు, సాహిత్యాభిమానులు*

ప్రకాశం జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవి, విద్యావేత్త డాక్టర్ ఉండేల మాలకొండా రెడ్డి ప్ర.ర.సం. పతకాన్ని ఆవిష్కరించడంతో మహాసభలు ప్రారంభమయ్యాయి. సభలకు హాజరైన అతిధులు, ప్రముఖులు మహాసభల ప్రాంగణంలో తెలుగు తల్లికి పుష్పాభిషేకం చేసి, నీరాజనాలు అర్పించారు. అనంతరం ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి అధికారికంగా మహాసభలను ప్రారంభించారు. ప్రారంభసభకు ప్ర.ర.సం అధ్యక్షులు బి. హనుమారెడ్డి అధ్యక్షత వహించారు. మహాసభల లక్ష్యాన్ని, రచయితల కర్తవ్యాన్ని, మాతృభాషా పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వ సహకారం లేకుండా, పాలనా యంత్రాంగం చేయూత లేకుండా మాతృభాష మనుగడ కష్టమన్నారు. ప్రఖ్యాత రచయిత పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ చేసిన ప్రారంభోపన్యాసం ఆలోచింపచేసింది. ప్రకాశం జిల్లా కవులకు, కళాకారులకు ఆదర్శ ప్రజానాయకులకు పురిటిగడ్డగా కీర్తి గడించిందన్నారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అన్ని ప్రక్రియలను తమ రచనలలో పండించిన రచయితలు ప్రకాశం జిల్లాలో వున్నారన్నారు. వారి స్ఫూర్తితో వర్తమాన రచయితలు వారి వారసత్వాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు.

పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రసంగిస్తూ కవిత్వం రాయడం కంటే కవులకు చేయూతనివ్వడం ఎంతో సులభమైన పని అన్నారు. తమ సోదరులు మాగుంట సుబ్బరామరెడ్డి గారికి కవులపట్ల ఎంతో గౌరవమన్నారు. మహాసభల ప్రాంగణానికి మాగుంట ద్వారమని నామకరణం చేయడం తమకెంతో ఆనందంగా వుందన్నారు. జిల్లా రచయితల సంఘం నిర్వహించే ప్రతికార్యక్రమానికి తమ సహకారం తప్పక వుంటుందని కరతాళధ్వనుల మధ్య ప్రకటించారు.

కవులు, రచయితలు సమాజ హితం కోరి రచనలు చేయాలని ప్రముఖనటులు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రజా చైతన్యంకోసం పోరాడే కళాకారులకు కవులు ఉద్యమ సాహిత్యాన్ని అందించాలన్నారు. ప్రముఖ కవి, విద్యావేత్త డాక్టర్ ఉండేల మాలకొండారెడ్డి ప్రసంగిస్తూ ఇంగ్లీషు ఎంత గొప్పదైనా



Feb 2010 _Final_Pages.pmd 39 1/28/2003, 2:20 PM

తెలుగులోని మాధుర్యం, సౌందర్యం దానికి లేదన్నారు. ఒకటో తరగతి నుండి పి.జి కోర్సుల వరకు తెలుగు మీడియంలోనే బోధన సాగేలా ప్రభుత్వం చట్టం తీసుకురావాలన్నారు. తెలుగు మీడియంలో చదివిన వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు అధికంగా కల్పించాలన్నారు. రచయితలు, కవులు ఆత్మ పరిశీలనతో, సమాజానికి ఉపయోగపడే రచనలు చేయాలన్నారు.

ప్రకాశం జిల్లా పరిషత్ కార్యాలయంలో, అనుబంధ కార్యాలయాల్లో నూటికి 90% తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయని జడ్.పి.ఛైర్‌పర్సన్ కాటం అరుణమ్మ పేర్కొన్నారు. తమ మనుమలు, మనుమరాండ్రు అమెరికాలో వున్నా గాని తనను జేజెమ్మ అని పిలవడం తెలుగు తీయదనానికి చిహ్నమన్నారు. ప్రారంభ సభలో శాసనమండలి సభ్యులు శిద్దా రాఘవరావు, దర్శి మాజీ శాసన సభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి, స్థానిక ప్రజానేత మౌర్యహోటల్ అధినేత బత్తిన నరసింహారావు మాతృభాషా పరిరక్షణ అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పారు. మహాసభలకు సహకరించిన పలువురు దాతలు, పట్టణ ప్రముఖులు, సాహిత్యాభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గజల్ మాస్ట్రో, గిన్నిస్ బుక్ అవార్డు గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ గజల్ గాన విభావరి సభాప్రాంగణంలో ప్రతిఒక్కరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. తెలుగు భాషలోని మాధుర్యాన్ని, వైభవ ప్రాభావాలను, అమ్మ ప్రేమలోని కమ్మదనాన్ని, తండ్రి పెంపకంలోని ఔన్నత్యాన్ని, అంతరించి పోతున్న మానవ సంబంధాల్ని, బాల్య జీవితంలోని మధుర స్మృతులను, సంసార యాత్రలో భార్య సాహచర్యాన్ని, వర్తమాన సమాజ గమనాన్ని వివిధ గజల్‌లో రసమయ గానంతో ఆలపించిన శ్రీనివాస్ ప్రేక్షకులను రెండు గంటల పాటు సమ్మోహితులను చేశారు. పూజ్య బాపూజీ జీవిత సందేశాన్ని వందభాషల్లో గానం చేసిన తనకు గిన్నిస్ రికార్డుకంటే ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వత స్థానం ఉండడం గర్వకారణమన్నారు.



9వ తేదీ జరిగిన మొదటి సాహిత్య సభకు ప్రఖ్యాత రచయిత్రి, ఆచార్య కాత్యాయనీ విద్మహే అధ్యక్ష్యత వహించారు. మాతృభాష ఉనికి కోల్పోవడానికి పాలక వర్గాలు ముఖ్య కారణమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయా వృత్తులు అంతరిస్తుండటం వలన, గ్రామీణ వృత్తి పదజాలం మరుగున పడుతుందన్నారు. మాండలికాలను కాపాడుకోని పక్షంలో భాష మనుగడ కష్టమన్నారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు బేతవోలు రామబ్రహ్మం ప్రాచీన సాహిత్యం, తెలుగు వైభవం గురించి సోదాహరణ ప్రసంగం చేశారు. ప్రాచీన సాహిత్య పఠనంతో వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మక సాహితీ సృష్టి అలవడుతుందన్నారు. పద్య కవిత్వంలోని మాధుర్యాన్ని, శిల్పాన్ని, అభివ్యక్తీకరణ వైభవాన్ని వర్తమాన కవులు పరిశీలించి, మంచి రచనలు చేయాలని హితవు పలికారు.

పాఠశాల స్థాయి నుండే పిల్లలకు తెలుగుపై మమకారం పెంచితే, మాతృభాష మృతభాష కాదని ప్రముఖ పాత్రికేయుడు, తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ సామల రమేష్‌బాబు సూచించారు. తల్లిదండ్రులు పరభాషా వ్యామోహంతో పిల్లల్ని కార్పోరేట్ విద్యాసంస్థల్లోనే చేర్పించి, మాతృభాషకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. విద్య వ్యాపారమైనప్పుడు భాషా విలువలు పతనమవుతాయన్నారు. ప్రక్కనున్న కర్నాటక, తమిళనాడు ప్రభుత్వాలు మాతృభాషాభివృద్ధికి చేస్తున్న కృషిని చూసి, మన పాలకులు కళ్ళు తెరవాలని శ్యామల హెచ్చరించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ యం.శ్రీధర్ తెలుగు సాహిత్యంలో అనువాద రచనలు పెరగవలసిన ఆవశ్యకత వివరించారు. అనువాదాలు భాషకు పుష్టిని పాలకులకు తుష్టిని కలిగిస్తాయన్నారు. భాషా సాహిత్య సంస్థలు అనువాదకుల్ని, రచనలను ప్రోత్సహించాలని శ్రీధర్ కోరారు.

ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్యంలో మాండలికాల అవసరాన్ని, ప్రయోజనాన్ని సోదాహరణంగా వివరించారు. మాండలికాల్లో ప్రాంతీయత ఆత్మీయత ఉంటాయన్నారు. మాండలికాల పుట్టు పూర్వోత్తరాలను మరింత లోతుగా అధ్యయనం చేస్తే భాష ఎంతో వికాసం చెందుతుందన్నారు. అన్నమయ్య కీర్తనల్లో వేలాది మాండలికాలున్నాయన్నారు. సాహిత్య అధ్యయనం అవసరాన్ని ప్రముఖ రచయిత గుడిపాటి వివరించారు.

వాసిరెడ్డి నవీన్ అధ్యక్షతన జరిగిన రెండవ సాహితీ సదస్సులో వక్తల ప్రసంగాలు సదస్యులను ఆలోచింపచేశాయి. ప్రముఖ నాటక రచయిత స్వర్ణ నంది అవార్డు గ్రహీత డి. విజయభాస్కర్ తెలుగు నాటకం తీరుతెన్నులపై చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా సాగింది. నాటకం రచయిత అంతర్మథనానికి, ఆవేదనకు అక్షరరూపమన్నారు. ప్రతినాటక ప్రదర్శన ఒక ప్రసవవేదన వంటిదన్నారు. తెలుగులో కన్యాశుల్కం తర్వాత పాటిబండ్ల ఆనందరావు రాసిన పడమటి గాలి గొప్పనాటకమన్నారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ క్లిప్పింగ్స్‌తో తెలుగు నాటక విశిష్టతను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

ప్రముఖ కవి డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు జానపద సాహిత్యం కళారూపాలపై ప్రసంగిస్తూ మట్టివాసన నుండి జానపద సాహిత్యం పట్టిందన్నారు. జానపదుల శ్రమనుండి అనుభవం నుండి పుట్టిన పాటలు కాలాన్ని గెలిచి నిలిచాయన్నారు.

తెలుగు విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రముఖ రచయిత్రి డాక్టర్ మృణాళిని ప్రసంగిస్తూ ప్రాచీన సాహిత్యంలో స్త్రీల వ్యక్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. భారత, రామాయణాల్లోని ద్రౌపది, కుంతి, గాంధారి, మండోదరి, సీత, తార వంటి మహిళామణుల విశిష్ట వ్యక్తిత్వాన్ని, త్యాగశీలతను నేటి మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రముఖ రచయిత, అరసం రాష్ట్ర అధ్యక్షులు



Feb 2010 _Final_Pages.pmd 40 1/28/2003, 2:20 PM

పెనుగొండ లక్ష్మీనారాయణ విశిష్ట అతిథిగా సదస్సులో ప్రసంగిస్తూ సామాజిక సంక్షోభాన్ని ప్రజల్లోకి రాజకీయ నాయకుల కంటే కవులు, రచయితలే ప్రజలకు దిశానిర్దేశం చేయగలరన్నారు. సామాజిక విలువలు దిగజారకుండా రచయితలు తమ గమ్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు.

10వ తేదీన జరిగిన మూడవ సాహిత్య సభకు ప్రముఖ కవి కె. శివారెడ్డి అధ్యక్షత వహించారు. రచయితల సభలు వర్తమాన కవులకూ రచయితలకు మార్గ నిర్దేశం చేస్తాయన్నారు. కవిత్వంలో మంచి చెడులను కవిని బట్టి చెప్పకూడదన్నారు. కవి సొంతశైలిని, స్వీయవ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని శివారెడ్డి సూచించారు. కవిత్వాన్ని బట్టి కవిని గుర్తించడమే గొప్ప విమర్శ అవుతుందన్నారు. నిత్యనూతనంగా ఉండేదే ఉత్తమ కవిత్వమన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జంధ్యాల మహతీ శంకర్ మహాకవి జాషువా గబ్బిలం కావ్య విశిష్టతను సోదాహరణంగా వివరించారు. జాషువాను ఆశావాదిగా, సమతావాదిగా, మానవతావాదిగా ఆయన అభివర్ణించారు. ప్రముఖ రచయిత సింగమనేని నారాయణ శ్రీశ్రీ మహాప్రస్థానం ప్రత్యేకత గురించి ఉద్వేగంగా చేసిన ప్రసంగం ప్రేక్షకులను ఆకట్టుకోవటమేకాక మంత్ర ముగ్ధుల్ని చేసింది. మహాప్రస్థానం శ్రమ జీవుల గొంతుకు అక్షర గీతిక అన్నారు. మహాప్రస్థానం ఎందరో కవులకు మార్గ నిర్దేశం చేయగా కోట్లాది మందికి ఆత్మవిశ్వాసాన్నిచ్చి, ఓదార్చిందన్నారు. చరిత్రకు కొత్త నిర్వచనం చెప్పి, సాహిత్య గమనాన్ని మార్చిన శ్రీశ్రీ ముమ్మాటికీ ఆధునిక యుగకర్తేనని సింగమనేని పేర్కొన్నారు. జీవితంలో సంక్షోభాలు, సమస్యలు తెలియని వాళ్ళకు మహాప్రస్థానం అర్థం కాదన్నారు. అది తెలుగు వారి ఆస్తి అనడం అతిశయోక్తి కాదన్నారు.



ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ యు.ఎ.నరసింహమూర్తి గురజాడ అద్భుత సృష్టి కన్యాశుల్కం గురించి ప్రసంగించారు. 118 సంవత్సరాలుగా జైత్రయాత్ర సాగిస్తున్న ఏకైక నాటకం కన్యాశుల్కమన్నారు. గురజాడ భాషా విప్లవంతో పాటు, భావ విప్లవం కూడా తీసుకువచ్చి నవ్యయుగ స్రష్టగా నిలిచారన్నారు. ప్రొద్దుటూరు మాజీ శాసనసభ్యులు, ప్రముఖ రచయిత డాక్టర్ యం.వి. రమణారెడ్డి తెలుగు సినిమాల్లోని క్లాసిక్స్ గురించి ప్రసంగించారు. అలనాటి కళాఖండాలు మాయాబజార్, స్వర్ణసీమ, దేవదాసు, నర్తనశాల, సత్యజిత్‌రే పథేర్ పాంచాలి, రంగులరాట్నం, మల్లీశ్వరి, ఇప్పటికీ దర్శకులకు పాఠ్యగ్రంథాల వంటివన్నారు.

ఈ సందర్భంగా ఆచార్య తంగిరాలను, ప్రముఖ భాషావేత్త డా॥ దేవుళ్ళ చిన్ని కృష్ణయ్యలను సంఘం పక్షాన ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన మహాసభల ముగింపు ఉత్సవంలో సహజకవి, అభినవ వేమన డాక్టర్ మల్లెమాల ముఖ్య అతిథిగా ప్రసంగించారు. కవులు, రచయితలు వందిమాగధులుగా కాకుండా, స్వీయవ్యక్తిత్వంతో ముందడుగు వేయాలన్నారు. ప్రాచీన సాహిత్యం లేకుండా ఆధునిక సాహిత్యం లేదన్నారు. సామాజిక రుగ్మతలపై కవులు శస్త్రధారులు కావాలన్నారు. కవిత్వమంటే భట్రాజు పొగడ్త కాదని, నిజాన్ని నిర్భయంగా చెప్పే గొప్ప సాధనమని మల్లెమాల పేర్కొన్నారు. తనలోని కవిత్వ తపన అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా ఒంగోలు ప్ర.ర.సం. సభలకు రప్పించిందన్నారు. సభలో ప్రధాన వక్తగా ప్రసంగించిన సహస్రావధాని డాక్టర్ గరికిపాటి నరసింహారావు ప్రేక్షకులను సందర్భోచిత చమత్కారాలతో, పద్యసాహిత్య ధారణతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. తెలుగు పద్యం తనకు ప్రాణవాయువు వంటిదన్నారు. తనకు లభించిన గౌరవాలు, పురస్కారాల అన్నీ తెలుగు తల్లి ఆశీస్సులతో అందుకున్నవేనన్నారు. పరభాషా వ్యామోహంతో పిల్లల్ని భాషాభిమానం లేని వారుగా తయారు చేస్తున్న విద్యా సంస్థల్ని నిషేదించాలన్నారు. గురువు గొప్పతనాన్ని తల్లి త్యాగాన్ని మరచినవాడు మనిషే కాదన్నారు.

ఈ సందర్భంగా ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నంను భీమనాథం రాఘవరెడ్డి స్మారక సాహితీ పురస్కారంతో, ప్రముఖ వక్త సాహితీ వేత్త డాక్టర్ కరిమద్దెల నరసింహారెడ్డిని శ్రీమతి రాజరాజేశ్వరి స్మారక సాహితీ పురస్కారంతోను, ప్రముఖ రచయిత, పాత్రికేయులు ముంగర జాషువాను నవయుగ కవి చక్రవర్తి జాషువా పురస్కారంతోనూ, ప్రముఖ కవులు డాక్టర్ వల్లభనేని నాగేశ్వరరావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రముఖ కవి, తెలుగు పండితులు మల్లవరపు రాజేశ్వరరావుకు, డా॥ పోగుల సాంబశివరావు స్మారక సాహితీ పురస్కారాన్ని. ప్రముఖ కవయిత్రి అన్నా విజయ కుమారికి ప్ర.ర.సం పక్షాన అతిథులు అందచేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం, మహాసభలకు నాలుగు వందలకు పైగా హాజరైన కవులు, రచయితలు వివిధ జిల్లాల రాష్ట్రాల ప్రతినిధులను, ప్ర.ర.సం కార్యదర్శి సభ్యులను సంఘం పక్షాన జ్ఞాపికలతో సత్కరించడంతో మహాసభలు ముగిశాయి.

మూడు రోజులూ షడ్రసోపేతమైన భోజనం అల్పాహారాన్ని ప్రతినిధులకు సాహితీవేత్తలకు సమకూర్చిన అన్నదాత, మాజీశాసన సభ్యులు బూచేపల్లి సుబ్బారెడ్డి వెంకాయమ్మ దంపతుల వదాన్యతను అందరూ ముక్తకంఠంతో కొనియాడారు. మహాసభలు దిగ్విజయంగా జరపడానికి ఆర్థిక, హార్ధిక సహకారం అందజేసిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, శిద్ధా రాఘవరావు, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ఉండేల మాలకొండారెడ్డి మొదలుగాగల దాతలకు ప్ర.ర.సం వినయంతో ధన్యవాదాలు తెలిపింది. మూడురోజుల మహాసభలో గళం విప్పిన కవులు ప్ర.ర.సం.కృషిని, నిర్వహణ సామర్థ్యాన్ని, భాషాభిమానాన్ని కొనియాడారు. మూడు రోజుల సభల్లో కర్త, కర్మ, క్రియగా త్రిమూర్తులుగా సభల విజయానికి అవిశ్రాంత కృషి చేసిన ప్ర.ర.సం అధ్యక్షులు బి. హనుమారెడ్డి, ప్రధాన కార్యదర్శి పొన్నూరి వెంకట శ్రీనివాసులు, కోశాధికారి కె.బాలకృష్ణారెడ్డి, శ్రమించిన కార్యవర్గ సభ్యులు అభినందనీయులు. ■



Feb 2010 _Final_Pages.pmd 41 1/28/2003, 2:20 PM













## జ్వాల ప్రచురణలు

*జీవితమంతా ప్రజా సాంస్కృతిక ఉద్యమకర్తగా, విప్లవరాజకీయాల్లో మహావక్తగా క్రియాశీల పాత్ర వహించిన జ్వాలాముఖి తన రచనలన్నీ పుస్తకరూపంలో చూడలేకపోయారు. దిగంబరకవులు (మూడుసంపుటాలు), ఓటమితిరుగుబాటు (కవితా సంపుటి 1972), రెండు అనువాద గ్రంథాలు తప్ప ఇతరత్రా సకాలంలో రావలసిన రచనలు వెలువడనేలేదు.*

*ఆయన స్మృతికి అంకితంగా జ్వాల రచనల ప్రచురణ తలపెట్టి ప్రస్తుతం మూడు ప్రచురణలు తీసుకురాగలుగుతున్నాము. అవి: 1. కవితాజ్వాల(ఏరిన కవితల సంకలనం) 2. వేలాడిన మందారం (నవల) 3. భస్మసింహాసనం (మూడు దీర్ఘకవితలు). వీటితోపాటు జ్వాలస్మృతిలో ఈ నివాళి సంపుటిని ప్రచురిస్తున్నాము. ఇక వచ్చే సంవత్సరంలో మరో రెండు ప్రచురణలు – కథానికలు, సాహిత్య విమర్శనా వ్యాసాలు వెలువరించాలని నిర్ణయించాము.*

*ఈ ప్రచురణలకు సన్నిహితులైన బంధు-మిత్రులు, విప్లవ సానుభూతిపరులు, కవిమిత్రులు తమవంతు ఆర్థిక సహాయం అందజేసారు. వారందరికి మా హృదయపూర్వకమైన కృతజ్ఞతలు. జ్వాల రచనలను వెలికితీసి, ఏరి క్రమపద్ధతిలో సమకూర్చిన కామ్రేడ్స్ శ్రమను మరచిపోలేము.*

సంపాదకవర్గం
**నిఖిలేశ్వర్**
**డా॥ జతిన్‌కుమార్**
**డా॥ ఏ.వి. రామాచారి**

*పుస్తకాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 040-27422797, 9177881201*

## విశ్వాస వాక్యం

**ఖాదర్‌షరీఫ్. షేక్**

పిల్లలు ప్రార్థిస్తే ఆకాశం వర్షిస్తుంది
దివికీ.. భువికీ మధ్య
వాళ్ళు స్నేహవారధి నిర్మించుకున్నారు
పగటికీ... చీకటికీ మధ్య
ఒక్క వెల్తురు మాత్రమే తేడాగా గుర్తిస్తారు
మనుషుల్లా తిరుగాడుతున్న రాక్షసుల మధ్య
జ్ఞానవాక్యాల్ని ప్రకటిస్తూ తిరుగుతారు
ఒకానొక ఉదయం పూట మా పిల్లలు
వర్షంలో తడిసి ముద్దయిపోయిన
కుక్కపిల్లని గుండెకు హత్తుకుని
యోధుడు కత్తిని ఎత్తినట్లుగా
దాన్ని ఆకాశానికి ఎత్తి చూపారు
ఉన్న పళంగా ఎలా వదిలివెళ్ళిపోయిందో అని
దాని తల్లిని నిందిస్తూ కూర్చున్నారు
పేరంటానికి పిల్చినట్లుగానే...
అచ్చు అలాగే స్నేహితుల్ని పిల్చి
కుక్కపిల్లని చూపిస్తూ మురిసిపోయారు
వాళ్ళంతా అనుబంధాల్ని పెనవేస్కుని
ఆనందంగా దాన్ని కౌగిలించుకున్నారు
మీరు అలా చేయగలరా....?
దాని తలరాత వ్రాయడానికి అందరూ సిద్ధపడి
నామకరణ మహోత్సవమూ పెట్టారు
నాకయితే కవిత్వ పుస్తకమే
ఆవిష్కరిస్తున్నంత సంబరం కల్గింది
చుట్టూ చేరిన దేవతల్ని చూసి
కుక్క కూడా కంటతడిపెట్టింది
దాన్ని కుక్క అంటే....
మా పిల్లలకి భలే కోపం
దాని పేరు "రూమీ"
బడికి వెళ్తూ... వెళ్తూ రూమీ గురించి
జాగ్రత్తలతో కూడిన ఆజ్ఞల్ని
వాళ్ళ అమ్మ మెడలో వేసి వెళ్ళేవాళ్ళు
దానికి మానవ భాషని నేర్పి
అవసరం కోసమో, ఆశయం కోసమో
బ్రతికినంతకాలం హాయిగా బ్రతకమని
రూమీని బుజ్జగించేవాళ్ళు...
జంతువులకి కూడా
కష్టాలూ కన్నీళ్ళు ఉంటాయని చెప్పారు
దాన్ని సరిగ్గా చూడనందుకు
తల్లి దండ్రులని కూడా చూడకుండా
మమ్మల్ని బహిష్కరించేవాళ్ళు...
ఒకరోజు ఆకాశం కేసి చూస్తూ
రూమీ ఫిమేల్ నాన్నా
దాన్ని జాగ్రత్తగా చూస్కోవాలి లేకుంటే...
"మేల్ డాగ్స్" దాన్ని చీల్చేస్తాయి...
ఎందుకో... అప్పుడు
నా భార్య కళ్ళలో ఒక గాఢ దుఃఖపుతెర.

## సాహితీస్రవంతి ఆధ్వర్యంలో బాల కవి సమ్మేళనం



పసి వయసు నుండే సాహిత్యం కళలు పట్ల అభిరుచిని కల్గివుండాలని ప్రశ్నించే తత్వం పెరగాలని... "బాల కవి సమ్మేళనానికి" ముఖ్య అతిధిగా హాజరైన బోడేపూడి విజ్ఞాన కేంద్రం మేనేజర్ సి. హెచ్. రాజారావు అన్నారు. దూరప్రాంతాల నుండి వచ్చి వివిధ పాఠశాల విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఆసక్తిగా పాల్గొనడం చాలా సంతోష దాయకమని, అభినందనీయమని కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. నవంబర్ 14న ఖమ్మం పట్టనంలోని రికోచ్ బజార్ హైస్కూల్‌లో ఈ కార్యక్రమం జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి రౌతురవి అధ్యక్షతన ఈ కవి సమ్మేళనం, పిల్లల కవితలతో.. గేయాలతో.. రసవత్తరంగా జరిగింది. గురజాడ, శ్రీశ్రీ, కొ.కు. గోపిచంద్, సుద్దాల శతజయంతి సంవత్సర సందర్భంలో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు రౌతురవి తెలిపారు. కపిల రాంకుమార్, కె.ఎల్.ఎన్. మూర్తి, కొత్తా శంకర్‌రెడ్డి. డి. శ్రీనివాస్‌లు ఈ సభలో ప్రసంగించారు. వి. సునంద, లెనిన్ శ్రీనివాస్, కె. వెంకటయ్య, ఎమ్. శేషగిరిలు పిల్లల కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. పుడమితల్లికి వందనం అంటూ విద్యార్థి పుష్పకుమారి, కరువు కాటేస్తుందని, అన్నపూర్ణ ఆందోళనలో ఉందని నిర్మల, పల్లెతల్లి చిన్నబోయిందంటూ – గోపికృష్ణ. కలం బలం మిసైల్ కన్నా మిన్న అంటూ లేమి తమ కవితలు చదివారు. "కవితా ఓ కవితా" అంటూ.. "ప్రవల్లిక" అనే విద్యార్థిని శ్రీశ్రీ కవితను చూడకుండా చక్కగా ఆలపించింది. చిన్నారి మైత్రి – "బాటసారి" కవితను చదివి ఆలోచింపజేసింది. స్వాతి, సాహితీ, జగదీష్ స్వర్ణాక్షరి హెమంత్‌లు జెడ్.పి.ఎస్.ఎస్. పినపాక నుండి యాకూరావు, సురేష్ పద్మ, శిరీష, శివకృష్ణ, జి. నవ్య, కె. నవ్వ స్రవంతిలు చింతపల్లి హైస్కూల్ నుండి, అలేఖ్య తేజస్వీ వినయ్ చరిత, దివ్య మాంటి సోరి హైస్కూల్ నుండి, ముదిగొండ హైస్కూల్ నుండి ఉపేందర్; విశ్వనాద్ మొదలగువారు రికాబ్ బజార్ హైస్కూల్ నుండి, ఆర్.ఆర్. హైస్కూల్ నుండి సుజల రమాదేవి, మోనిక, వంశీ కృష్ణ, సుగాత్రి సుదేష్ణ బిందు. ఎస్. వేణు మొదలగు విద్యార్థులు 50 మంది కవితా పఠనం చేసారు. 400 మంది విద్యార్థులు ఈ బాలకవి సమ్మేళనానికి పాల్గొన్నారు.



**బాల కవిసమ్మేళనాన్ని నిర్వహిస్తున్న లెనిన్ శ్రీనివాసరావు, వురిమళ్ళ సునంద**

## ఖమ్మం పుస్తక మహోత్సవంలో "కవి సమ్మేళనం"



**ఖమ్మంలో జరిగిన పుస్తకమహోత్సవంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం. చిత్రంలో కె. వెంకట్రావు, హెచ్.వి.ఎల్.పి. బాబు, వి. మురళి, రౌతురవి, సాధనాల వెంకటస్వామినాయుడు, కె. శంకర్ రెడ్డి, తాతోలు దుర్గాచారి, మోహన్ కృష్ణ, వి. ప్రసాద్, వి. సునంద, యం. శేషగిరి తదితరులు**

ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన "ఖమ్మం" పుస్తక మహోత్సవంలో భాగంగా నవంబరు 18న "సాహితీ స్రవంతి" ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనం జరిగింది. దాదాపు 40 మంది కవులు కవితా గానం చేసారు. కె. ఆనందాచారి రౌతు రవి. హెచ్.వి.ఎల్.పి బాబులు అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో, అంకిత కేశవులు, బాణాల కృష్ణమాచారి, సాధనాల వెంకట స్వామి నాయుడు, కె.ఎల్.ఎన్. మూర్తి, జి. లెనిన్ శ్రీనివాస్, కన్నెగంటి వెంకటయ్య, ఎమ్. శేషగిరి, బాలు, వి. మురళి, పి. ప్రసాద్, కె. శంకర్‌రెడ్డి, కె. రాంకుమార్, వై.వి. రమణారవు. బాలునాయక్, టి. దుర్గాచారి (బెన్) వి. సునంద, మోహన్‌కృష్ణ (బి.వి.కె) రాజు, మొదలగు కవులు ఈ కవి సమ్మేళనంలో పాల్గొన్నారు. పుస్తక మహోత్సవంలో దాదాపు వారంరోజులు, సాహిత్యకళా కార్యక్రమాలు జరిగాయి. హాస్య కవి సమ్మేళనం, యువకవి సమ్మేళనం కవి సమ్మేళనంలను సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గ్రంధాలయ, మరియు పుస్తక మహోత్సవ కమిటీల సహకారంతో సాహిత్య కార్యక్రమాలు జరిగాయి.



Feb 2010 _Final_Pages.pmd 43 1/28/2003, 2:20 PM

## కవయిత్రి జ్వలితకు పురస్కారం



స్త్రీవాద రచయిత్రి 'జ్వలిత' ఇటీవల ప్రచురించిన 'సుదీర్ఘహత్య' కవితా సంపుటికి 'చెలిమి సాంస్కృతిక సమితి 'ప్రతిభామూర్తి పురస్కారం' ఇచ్చి సత్కరించింది. జనవరి 1న హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో జరిగిన పురస్కార కార్యక్రమంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి. నారాయణరెడ్డి 'సుదీర్ఘహత్య' గురించి మాట్లాడుతూ సమాజ జాగృతి కోసం చేస్తున్న ఈ కవిత్వంలో అన్ని వాదాలు కలిసిన మానవతాదృక్పథం ఉందని పాలకవర్గం మీద సెటైర్‌లు ఉన్నాయని, సాధికారత కోరే ధిక్కార కవిత్వం కవయిత్రిది అన్నారు. ఆర్ద్రతతో కూడిన ప్రశ్నలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తాయని, సామాన్యులకు కూడా అర్థమయ్యేటట్లు సరళంగా స్పష్టంగా, సూటిగా రాయడం జ్వలిత శైలి అని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీగేయరచయిత వడ్డేపల్లి కృష్ణ, చెలిమి సాంస్కృతిక సమితి కార్యదర్శి సుందరరావు తదితరులు ఈ పాల్గొన్నారు.

## వారధి రచయితల సహకారోద్యమం

సమకాలీనత, విశ్వజనీనత, రచయితలు కార్యోన్ముఖంగా సాగడం, నూతనత్వం, యువతకు ప్రోత్సాహం, ఉమ్మడి సాహిత్య చర్యలు, మంచి కవిత్వం, మేలైన కథా ప్రచురణ మొదలైన సాహిత్య కార్యక్రమాల కోసం వారధి సహకార వేదిక పనిచేస్తూ మొదటి ప్రయత్నంగా నవతరం తెలుగు కథ ప్రచురించడం తెలిసిందే.

తదుపరి ప్రయత్నంగా నవతరం తెలుగు – 2, నిన్నటి తరం కథ, యువకథ, ప్రకాశం కథ, మంచి కవిత్వం, ప్రవాసాంధ్ర కథ వార్షిక సాహిత్య సంచిక ప్రచురణతోపాటుగా రాష్ట్రస్థాయి కథా సదస్సు నిర్వహించాలని వారధి రచయితల సహకార వేదిక సంకల్పించింది.

పై ప్రచురణలకు రచయితలు, కవులు సాహిత్య కారుల నుండి రచనలను, విలువైన సలహాలూ, సూచనలను అందించి సహకారోద్యమానికి సహకరించవలసిందిగా మనవి చేస్తున్నాము.

## రాజమల్లాచారి సంస్మరణ సభ




డాక్టర్ కన్నెగంటి రాజమల్లాచారి పశ్చిమ ప్రకాశపు కళా, సాహితీ రంగాలకు పట్టుగొమ్మ అని వారిని స్ఫూర్తిగా తీసుకోవడం ఇవాల్టి కళా, సాహితీ రంగాలకు అవసరమని మార్కాపురం నియోజక వర్గం మాజీ శాసనసభ్యులు జంకె వెంకటరెడ్డి అన్నారు. స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో నెలనెలా వెన్నెల సాహితీ వేదిక, కన్నెగంటి మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాజమల్లాచారి నాల్గవ వర్ధంతి సంస్మరణ సభకు జంకె వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన సీనియర్ పాత్రికేయులు ఓరుగంటి అధ్వర్థ మల్లిక్ మాట్లాడుతూ రసఝరి రాజమల్లాచారి పద్యకవిత్వం, గేయకవిత్వం, రూపక సాహిత్యంలో కూడా మంచి పట్టున్న వ్యక్తి శ్లాఘించారు. కన్నెగంటి నిర్వహించిన "నెలనెలావెన్నెల" కొనసాగించే ప్రక్రియను భాగ్యంగా భావిస్తున్నాని శ్రీ సాధన సాహితీ వేదిక కన్వీనర్ కప్పగంతుల మధుసూదన్ అన్నారు. "అద్దంకి సృజన సాహితీ వేదిక డి.వి.ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ వినూత్న రీతిలో పద్యాలాపన చేస్తూ, సాహిత్యాన్ని వెలయిస్తూ కన్నెగంటి వారు రాష్ట్రస్థాయి ఖ్యాతి పొందారని అన్నారు. ఆశుకవితానిధి ప్రతిపాటి పర్వతాచార్యులు, ప్రౌఢకవి తిన్నవెల్లి బాలయ్యగారు రాజమల్లాచారి స్మృతి కవితలు ఆలపించిన తీరు అలరించింది. ఈ సభ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలలో విజేతలైన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి (అద్దంకి), బాలు శ్రీనివాసరెడ్డి (దరిశి), శివరాజు శ్రీహరిప్రసాదు (పేర్నమిట్ట)లను నిర్వహకులు నగదు, సన్మాన పత్రాలతో సత్కరించారు. మరో అతిథిగా పాల్గొన్న గౌతం కళాశాల ప్రిన్సిపాల్ విద్యావేత్త డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ ఒక ఆత్మీయ సాహితీ నేస్తాన్ని మార్కాపురం కోల్పోయిందంటూ నివాళులర్పించారు. సభలో వెన్నెల సాహితీవేదిక కార్యదర్శి కె.వి. రమణారెడ్డి, తెలుగు ఉపన్యాసకులు హెచ్. మహేశ్వరాచారి, కవులు ఎం.వి. సుబ్బారావు, మంత్రికృష్ణమోహన్, గోపాలుని వెంకటేశ్వర్లు, టి.దుర్గా వెంకటేశ్వరరావు, ఎస్ లలితానంద్, జె. శివారెడ్డి, కళాకారులు బి. ఆంటోని తదితరులు పాల్గొని కన్నెగంటి సాహితీ వ్యాసంగాన్ని కీర్తించారు. ఎస్. శ్రీనివాసాచారి నిర్వహణలో జరిగిన ఈ సాహితీసభ కవిత్వం కార్బన్ కాపీ కాకూడదనే కన్నెగంటి వారి సాహితీ మార్గాన్ని మరో మారు జిల్లా కవులకు గుర్తుచేసింది.



Feb 2010 _Final_Pages.pmd 44 1/28/2003, 2:20 PM

## నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవిత్వ శిక్షణా శిబిరం




నెల్లూరు జిల్లా రచయితల సంఘం (నెరసం) వార్షికోత్సవం సందర్భంగా నెల్లూరు సరస్వతి నగర్‌లోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలు నందు వచన కవిత్వ సృజనకు సంబంధించి ఒకరోజు శిక్షణా శిబిరం 'పినాకిని' కవిత్వ కరదీపిక సంపాదకులు వంజవాక సతీష్‌కుమార్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది. ఈ శిబిరం ప్రారంభసభకు పమిడి శ్రీనివాస తేజ అధ్యక్షత వహించగా రైతు నాయకులు మాదాల తిమ్మయ్య, ప్రపంచ తెలుగు సమాఖ్య, నెల్లూరు శాఖ చైర్మన్ ఎన్. బలరామయ్యనాయుడు, రచయిత్రి, నెరసం మాజీ అధ్యక్షురాలు శ్రీమతి సోమిరెడ్డి జయప్రద అతిథులుగా పాల్గొన్నారు.

శిబిరంలో శిక్షణావేత్తలుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కె. శివారెడ్డి 'కవిత్వం – అధ్యయనం' అనే అంశంపై, పాపినేని శివశంకర్ 'కవిత్వం – శిల్పం' అనే అంశంపై, ఎండ్లూరి సుధాకర్ 'సంఘటనలు – కవిత్వం' అనే అంశంపై, నందిని సిధారెడ్డి 'ప్రతీకలు పదచిత్రాలు' అనే అంశాలపై ప్రసంగించారు.

సాయంత్రం జరిగిన అభినందన సభలో నెరసం ప్రధాన కార్యదర్శి శ్రీమతి పాతూరి అన్నపూర్ణ వార్షిక నివేదిక చదవగా ప్లాటినమ్ ప్రాజెక్ట్ అధినేత లయన్ తులసి చంద్రశేఖర్, నెరసం కార్యవర్గం సభ్యులు డా॥ ఈదూరు సుధాకర్, సాహితీవేత్తలు కె. శివారెడ్డి, పాపినేని శివశంకర్, ఎండ్లూరి సుధాకర్, నందిని సిధారెడ్డిలు రాష్ట్రస్థాయి కవితల పోటీలో విజేతలైన చిత్తలూరి సత్యనారాయణ, కోసూరి రవికుమార్, మంత్రి కృష్ణమోహనలకు నగదు బహుమతితోపాటు జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించి అభినందించారు.

ఈ కవిత్వ శిక్షణా శిబిరంలో రాష్ట్రం నలుమూల నుంచీ యువ కవులు, కవిత్వ ప్రేమికులు హాజరైనారు. నెరసం ఉపాధ్యక్షులు ఏటూరి నాగేంద్రరావు, సహాయ కార్యదర్శి ఈతకోట సుబ్బారావు, కోశాధికారి చిన్ని నారాయణరావు, కార్యవర్గ సభ్యులు మాటేటి రత్నప్రసాద్, జయప్రకాష్, డా॥ డి.ఎల్. సుహాసిని కార్యక్రమ నిర్వహణలో పాలుపంచుకున్నారు.

## కథాకోకిల పురస్కారం

మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ 'కథా కోకిల పురస్కారం' కొరకు కథల సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ వి.ఆర్. రాసాని ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికయిన రచయితకు 5000 రూపాయల నగదు బహుమతితో బాటు, కథా వార్షిక – 2009 కథా సంకలనం ఆవిష్కరణ సభలో జ్ఞాపికలతో సన్మానం జరుపుతామని తెలిపారు. ఈ పురస్కారం కొరకు రచయితలు 2007,08,09 సంవత్సరాలలో ముద్రింపబడిన తమ కథల సంపుటాలను మూడేసి ప్రతులను కార్యదర్శి పేర మార్చి 10వ తేదీ లోపల డా॥ వి. ఆర్. రాసాని, కార్యదర్శి, మధురాంతకం రాజారాం సాహిత్య సంస్థ, 16.ఇ/17, బాలాజీ రెసిడెన్సీ, మునిరెడ్డి నగర్, తిరుపతి పడమర – 517502 అనే చిరునామాకు పంపవలసినదిగా ఆ ప్రకటనలో కోరారు.

## చలం నాటకాలు - స్త్రీవాద పరిశీలన




**సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ కవి అద్దేపల్లి. చిత్రంలో డాక్టర్ గూటం స్వామి, కలైమామణి, దాట్ల దేవదానంరాజు, డాక్టర్ అంబటి వెంకటరావు, దేవళరాజు, జి. సుబ్బారావు తదితరులు**

తూ.గో. జిల్లా కొత్తపేట కళాసాహితి ఆధ్వర్యంలో 'చలం నాటకాలు – స్త్రీవాద పరిశీలన' అనే అంశంపై డాక్టరేట్ పొందిన డా॥ అంబాటి వెంకట్రావు అభినందన సభ స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో జరిగింది. ప్రధాన వక్త డా॥ అద్దేపల్లి మాట్లాడుతూ "చలం తన రచనలతో నాటి సమాజంలో స్త్రీల పక్షాన నిలిచి, స్త్రీలకు శరీరమే కాదు, ఇష్టాలు, కోరికలు, మనసు ఉంటాయని, వారికి స్వేచ్ఛ కావాలని, ఎలుగెత్తి చాటారని అన్నారు. అటువంటి చలంపై డాక్టరేట్ పొందిన అంబాటి ఆయనలో కొత్త కోణాల్ని ఆవిష్కరించాడని అభినందించారు. కళాసాహితీ ప్రధాన కార్యదర్శి జి. సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సభలో డా॥ గూటం స్వామి, కవైమాణి, దాట్ల దేవదానం రాజు, దేవుళ్లరాజు, టి.వి.డి. సత్యనారాయణ, నరేన్, జాన్, అజ్జరపు సుబ్బారావు, సాలెం రాజు, కళాకార్ నల్లా, ఏడిద సత్తిరాజు, శిల్పాచార్య, ఉడయార్‌జి పాల్గొని అభినందించి అంబటిని ఘనంగా సత్కరించారు.



కె. ఆంజనేయకుమార్ రచించిన 'మీకు దగ్గర్లోనే...' కవితా సంపుటి కి 2009 సంవత్సరపు విశిష్ట కవితా పురస్కారం సందర్భంగా జనవరి 10న జరిగిన సభలో రచయితను సత్కరిస్తున్న దృశ్యం. కాకినాడ పట్టణంలో సూర్యకళామందిరంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. చిత్రంలో అభ్యుదయ ఫౌండేషన్ ఛైర్మన్ బద్ధం మాధవరావు, ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు, డాక్టర్ మేడిపల్లి రవికుమార్, జి. సుబ్బారావు, భగ్వాన్, రమ్యసాహితి వ్యవస్థాపకులు ఎమ్.వి. సత్యనారాయణ ఉన్నారు.



ఆంధ్రసారస్వత సమితి, మచిలీపట్నం ఆధ్వర్యంలో జనవరి 10 న జరిగిన సాహిత్యసభలో కొట్టిరామారావు రచనల ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో డాక్టర్ జి.వి. పూర్ణచంద్, కెవైఎల్, డాక్టర్ రఘు, కూచిభట్ల ఆనంద్, కొట్టిరామారావు, డాక్టర్ ద్వానాశాస్త్రి, గుత్తికొండ సుబ్బారావు, జి. సనారా, చలపాక ప్రకాష్, లంకిశెట్టి బాలాజీ, ఎల్.ఎస్. శాస్త్రి,



భద్రాచలంలో జరిగిన సాహిత్యసభలో 'సంవీక్షణం' ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో జగదీష్, మువ్వ శ్రీనివాస్, తాళ్ళూరి పంచాక్షరయ్య, మాగంటి సూర్యం, ఇందిరా శ్రీనివాస్, సినీ గేయరచయిత అందెశ్రీ, సంవీక్షణం రచయిత వీధుల రాంబాబు, ఎన్సిహెచ్ చక్రవర్తి, ఖమ్మం జిల్లా సాహితీస్రవంతి కార్యదర్శి రౌతురవి, మాల్యశ్రీ, ఎస్.ఆర్. భల్లం ఉన్నారు.



సాహితీస్రవంతి ఆధ్వర్యంలో బాలలదినోత్సవం సందర్భంగా భద్రాచలం పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించిన బాలకవి సమ్మేళనం సభాదృశ్యం. చిత్రంలో డాక్టర్ కావూరి పాపయ్యశాస్త్రి, మల్లికార్జునరావు, మాల్యశ్రీ, డి.వి. కృష్ణమూర్తి, సి.హెచ్. తిరుపాలు, ఉన్నారు.




కాకినాడ పట్టణంలో సూర్యకళామందిరంలో జనవరి 10న జరిగిన సభలో విశిష్ట కథా పురస్కారతో రచయిత భీంపల్లి శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో అభ్యుదయ ఫౌండేషన్ ఛైర్మన్ బద్ధం మాధవరావు, డాక్టర్ మేడిపల్లి రవికుమార్, , జి. సుబ్బారావు, ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహనరావు ఉన్నారు.

## కథానిలయం పదమూడవ వార్షికోత్సవం

కథానిలయం వార్షికోత్సవ సభలు ఫిబ్రవరి 13, 14 తేదీలలో నిర్వహిస్తున్నట్లు కథానిలయం కార్యదర్శి డాక్టర్ బి.వి.ఎ. రామారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు అతిథులతో ఇష్టాగోష్టితో పాటు పలుపుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. రెండవరోజు వార్షికోత్సవ సభతోపాటు రాచకొండ రచనా పురస్కార సభ ఉంటుందని తెలిపారు. రాచకొండ రచనా పురస్కారాన్ని ప్రముఖ రచయిత డి. వెంకట్రామయ్యకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్సవ సభల్లో పెనుగొండ లక్ష్మీనారాయణ, డాక్టర్ కోడూరి శ్రీరామమూర్తి, వివిన మూర్తి, అట్టాడ అప్పల్నాయుడు వక్తలుగా పాల్గొంటున్నారు. ఈ సభలకు సాహిత్యాభిమానులందరూ ఆహ్వానితులే అని ఆ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9441095961 ద్వారా సంప్రదించవచ్చును.

# కొత్త పుస్తకాలు




## ఆనందం(పిల్లల కథలు)

**దాసరి వెంకటరమణ**

**పేజీలు : 114(ఎ4 సైజు) వెల : 60/-**

**లభ్యత: 040-24027411**

చదవడం రాయడం చక్కగా తెలిసిన పిల్లలు... నారి బాగా సారించి ఎక్కుపెట్టబడిన బాణాల వంటివారు. వారి లక్ష్యం అనంతం. అందుకు మొదటి మెట్టు పిల్లల్లో విరివిగా చదివే అలవాటు పెరగాలి. చదవడం అనేది బలవంతంగా కాకుండా స్వతహాగా జరగాలి. పిల్లలకు ఒక్కసారి తీపి రుచి చూపిస్తే అది ఏ రూపంలో వున్నా యిట్టే గుర్తించగలుగుతారు. అలాగే మంచి సాహిత్యం కూడా! ఆ కోవలో, వికాసపు దోవలో పిల్లల్ని నడిపించడానికి ఈ ఆనందం ఏ మాత్రం దోహదపడినా నేను ధన్యుణ్ణి!

**- రచయిత**




## సుదీర్ఘహత్య (కవిత్వం)


**జ్వలిత**

**పేజీలు : 126 వెల : 80/-**

**లభ్యత: 9989198943**

లాక్షిణికులు చెప్పిన రసాత్మకత, ఇతివృత్తం, ఆత్మధ్వని, పరిమళం ఇవేవి నాకు తెలియవు. శిల్పం, అభివ్యక్తి వంటివి ఇందులో వుండవు. ఇందులో ఉన్నదంతా నా గోల నా సొంత గొడవ.. ఇందులో నేను మాత్రమే.. నేను చూచింది, విన్నది, చదివింది మాత్రమే కాదు అనుభవిస్తున్నది కూడా అది అవమానమా., అనుమానమా., సందేహమా., సంఘర్షణా., అస్థిత్వపోరాటమా., ఏవో ఏదైనా కావచ్చు...

**- రచయిత్రి**




## వ్యాసాలూ, వ్యాఖ్యలూ

**అబ్బూరి ఛాయాదేవి**

**పేజీలు : 202 వెల : 150/-**

**లభ్యత: 040-27665661**

1996 నుంచి 2009 వరకూ, వివిధ విషయాలపై రాసిన వ్యాసాలనూ, 'కాలమ్స్'గా రాసిన వ్యాఖ్యలనూ కలిపి ప్రచురిస్తున్న సంపుటి ఇది. ఇందులో కొన్ని సాహిత్య వ్యాసాలూ, కొన్ని ఆధ్యాత్మిక వ్యాసాలూ, కొన్ని సామాజిక వ్యాఖ్యలూ ఉన్నాయి.

**- రచయిత్రి**




## మా (కథల సంపుటి)


**బా రహమతుల్లా**

**పేజీలు : 118 వెల : 50/-**

**లభ్యత: 9848787284**

సంయమనం, నింపాదితనం కలగలసిన వ్యక్తిత్వం రహమతుల్లాది. ఇది అతని రచనా వ్యాసాంగానికి ఒక నిండుదనాన్ని ఇచ్చింది. జీవితంలోనూ, సాహిత్య వ్యాసాంగంలోనూ వేగిరపాటు లేదు. ఆలోచనాత్మకంగా వ్యవహరించే ధోరణి వుంది. సమాజంలోని బహుళపార్శ్వాల్ని ఆవేశకావేశాలకి లోనుకాకుండా గమనించే దృష్టి నైశిత్యం వుంది. వైరుధ్యాల మధ్యన సాగే బతుకు యానంలోని సౌందర్యాన్ని పరికించే చూపు వుంది. ఇవ్వన్నీ కలిసి అతని సృజనాత్మక వ్యాసాంగానికి ఒక తాత్విక నేపథ్యాన్ని చేకూర్చాయి.

**- పాలపిట్ట బుక్స్**




## ఇప్పపూలు

**గిరిజన సంచార తెగ కథలు**

**సంపాదకులు:**

**ప్రొ॥జయధీర్ తిరుమలరావు, జీవన్**

**పేజీలు : 316 వెల : 150/-**

**లభ్యత: 9948908230**

"ఎనభై ఏళ్ళ తెలుగు కథా సాహిత్యాన్ని వడబోసి సంకలనం చేసిన కథలివి. అంచుల్లో సంచరించే గిరిజన, సంచార, అర సంచార తెగల బతుకు వెతలీ కథలు. మైదాన సభ్య సమాజ తిరస్కారానికి గురై మూలలకు నెట్టివేయబడిన, పక్కన పడేయబడిన బక్క బతుకుల చెమట చుక్కల్లో విరబూసిన "ఇప్పపూల' సువాసనలివి! ఈ ఇరవై తొమ్మిది కథల్లోనూ గిరిజన, సంచార తెగలపై ఆర్తీ సహానుభూతీ ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. అంతరించి పోయే ప్రమాదపుటంచులకు చేరుకున్న తెగల, సంస్కృతుల కోసం అండగా నిలిచిన కథలు యివి. తెలుగు సాహిత్యంలో గిరిజన-సంచార జాతులపై వెలువడిన సమగ్ర తొలి కథా సంకలనమిది!"

**-ప్రచురణ కర్తలు**




## గూడూరి సీతారాం కథలు

**ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం**

**వై. సత్యనారాయణ**

**పేజీలు : 86 వెల : 70/-**

**లభ్యత: మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల**

" అతని కథలు చదువుతూవుంటే నాటి గ్రామీణ జీవనం కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది. తన కథల్లో వస్తునవ్యతతో పాటు తెలంగాణా మాండలికాన్ని పాత్రోచితంగా ప్రవేశపెట్టాడు సీతారం. వై. సత్యనారాయణ ఈ గ్రంథంలో తెలంగాణా తొలితరం కథ స్వరూప స్వభావాలు సీతారాం కథల్లోని వస్తువైవిధ్యాన్ని, కథన రీతిని, భాషా సౌందర్యాన్ని పరమ పఠనీయశైలిలో చిత్రించాడు. గ్రంథం చివరవున్న అనుబంధాల్లో సీతారాంకు సంబంధించిన కొన్ని ప్రధానాంశాలను పొందుపరిచారు."

**- డా. సి. నారాయణ రెడ్డి**



Feb 2010 _Final_Pages.pmd 47 1/28/2003, 2:20 PM

# కొత్త పుస్తకాలు




### ఆకాశంలో అర్ధభాగం

**డా॥పి.విజయలక్ష్మి పండిట్**

**పేజీలు: 84 వెల: 70/-**

**లభ్యత : 040 - 27600815**

డా॥విజయలక్ష్మి పండిట్ స్త్రీ జీవితం, సమస్యల పట్ల తన ఆలోచనలను సమర్థవంతంగా అభివ్యక్తీకరించిన ఈ కవిత సంపుటికి 'ఆకాశంలో అర్ధభాగం' అనే సార్థకమైన శీర్షిక. స్వతంత్రమైన వ్యక్తిత్వంలో మంచి పరిశోధకురాలిగా, పరిపాలనా దక్షురాలిగా డా॥విజయలక్ష్మి పండిట్ విశ్వవిద్యాలయంలో అందరికీ పరిచయం. అయితే ప్రస్తుతం రచయిత్రిగా ఆమెలోని ఒక కొత్తకోణం కవిత రచనల్లో కనిపిస్తోంది. అన్ని కవితల్లోనూ స్త్రీవాద దృక్పథం అంత క్లుప్తంగా ప్రతిఫలించింది. ఈ వచన కవిత సంపుటిలో విజయ సుకుమార కవితా హృదయం అత్యంత సహజంగా, అర్థంగా, మనోజ్ఞంగా ఆవిష్కరించబడింది.

**- ఆచార్య పి. కుసుమ కుమారి**




### ధరిత్రీ విలాపం

**డా॥ పి. విజయలక్ష్మి పండిట్**

**వెల: రూ. 70/- పేజీలు: 88**

**లభ్యత : 040 - 27600815**

వృతిరీత్యా జీవశాస్త్రం బోధించే ఈ కవయిత్రి శాస్త్రాన్ని కవిత్వాన్ని సమపాళ్ళలో మేళవించి రచించిన కావ్యం 'ధరిత్రీ విలాపం'. గహనమైన జీవ, రసాయనిక, భౌగోళిక రహస్యాలను తేట తెలుగులో సూటిగా కవిత్రీకరించిన శైలి బావుంది. నేటి యువతరానికి అర్థమయ్యేలా విషయాలను చెప్పడం ముచ్చటేస్తుంది. కవిత్వం పాలు ఎక్కువ కాకుండా, అలా అని శాస్త్రం పాలు తక్కువ కాకుండా రెండింటినీ తన హృదయ తూలదండంపై తూలతూగిస్తూ రచించిన పర్యావరణ గీతమిది.

**- డా॥రాళ్లబండి కవితా ప్రసాద్.**




### భూమి తడిపిన ఆకాశం

**రాజేశ్వరి దివాకర్ల**

**పేజీలు: 102 వెల: 60/-**

**లభ్యత : 080 - 23496327**

నా కవిత్వ విషయానికి వస్తే, విద్యార్థినిగా ఉన్న రోజుల నుండి నేను కవిత్వం రాస్తున్నాను. కవిత్వం అభిరుచికి సంబంధించిన విశిష్ట కళ. రాయకుండా ఉండలేక పోవడమే కవిత్వానికి మూల సూత్రం. వచన కవిత్వానికి నిర్దిష్ట సూత్రాలంటూ ఏమీ లేవు. అంతరంగ మథనమే వచన కవితకు ఆధారం. వచన కవిత్వం నిత్యనూతనమైనది. ఆ రచనలోని కొత్త కోణాలను దర్శించాలని ఇంకా యత్నిస్తూనే ఉన్నాను. నా కవిత్వంలో సమాజ ముఖంగా సామాన్య స్త్రీకి కలిగిన సంవేదన, అభిలాష, ఆశయాలు వ్యక్తమౌతాయని నా భావన. ఈ అభివ్యక్తి సహజ నిర్మలమైన జీవనశాంతిని కోరుకుంటుంది.

**- రచయిత్రి**




### సామాన్యుడి సణుగుడు(ధిక్కార స్వరం)

**సంగెనేని రవీంద్ర ముంబై**

**పేజీలు: 83 వెల: 50/-**

**లభ్యత : 09987145310**

ముంబాయి సామాన్యప్రజల జీవిత విశేషాల గురించి ఎప్పటికప్పుడు రాస్తే ఇతర ప్రాంతాలలోని వారికి కూడా ఎంతో ఉపయోగం. సాంస్కృతిక, సమాచార వారధి, వాహిక పెరుగుతుంది. ఆ పనికి పూనుకోవడం అవసరం. అలాంటి పనికి కూడా సంగెవేని రవీంద్ర కొన్నింట్లలో పూనుకున్నాడు. ముంబై నగరానికి వలస వెళ్ళిన పాలమూరు ప్రజల గురించిన దయనీయ స్థితులను రాశాడు. తాగి కారు నడిపి రోడ్డు పక్కన పడుకున్న పాలమూరు కుటుంబాల పైకి పోనిచ్చి ఏడుగురిని బలితీసుకున్న సంఘటనను వర్ణించిన తీరు హృదయాన్ని కలచి వేస్తుంది. సంగెవేని రవీంద్ర ఇలాంటి వాటిని రాయడం అవసరం.

**- బి.ఎస్. రాములు**





### గోపి కవిత్వం - అనువాదకుల అనుస్పందనలు

**డా॥ ఎస్వీ సత్యనారాయణ**

**వెల: రూ. 200/- పేజీలు: 211**

ఇతరభాషల్లోకి వెళ్లాలను కోవడం కేవలం ఉబలాటం కాదు. ఏది వెళ్లాలి? ఎందుకు వెళ్లాలి? అనే విషయం పైన అనువాదకుడికి స్పష్టత, విచక్షణ ఉండాల్సిన అవసరం ఉంది. ఇవాళ మనకు విశ్వ విద్యాలయాల్లో బోలెడన్ని అనువాద శాఖలు ఏర్పడుతున్నాయి. ఈ గ్రంథంలోని అనువాదకుల అనుభవాలు మిగతా అనువాదకులకు ప్రేరణగా ఉండాలని మా ఆశయం.

**- డా॥ఎస్వీ సత్యనారాయణ**




### కథా కేరళం (మలయాళ కథాసుధ)

**ఎల్.ఆర్. స్వామి**

**వెల: రూ. 75/- పేజీలు: 127**

**లభ్యత : 9949075859**

సంచలన సాహితీ మూర్తి కమలాదాస్‌వి రెండు కథలున్నాయి. ఈ కథాకేరళంలో. 'పిట్ట వాసన' కథలోని మార్మిక మృత్యు భావనా చిత్రణ, 'ఫొటో' కథలో undertones లో కథ చెప్పిన తీరు, మలయాళ భాషలో ఆధునిక కథ ఎన్నివొంపులు తిరుగుతోందో తెలియచేస్తాయి. పాఠకులను కథలో భాగస్వాములు చేసే పరిణత పద్ధతిలో మలయాళ కథారచన సాగుతోందన్న విషయం అవగాహన కొస్తుంది, ఈ సంకలనంలోని కథల ద్వారా.

**-రామతీర్థ**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**



పెయింటింగ్ : అన్నా కరోట్కినా

# THE ENGLISH AND FOREIGN LANGUAGES UNIVERSITY HYDERABAD 500007



**Campuses :** Hyderabad, Lucknow, Shillong.
Campuses in the offing – Meham (Haryana) Kollam (Kerala)

**Programmes offered**

- 5- year Integrated MA programmes in English, MCJ
- 5- year Integrated MA programmes in Arabic, French, German, Japanese, Russian and Spanish
- One year full time Adv. Diploma in Russian
- 2 year MA in English/Arabic/French/Russian
- PG Diploma in the Teaching of English./ Arabic
- Research Programmes (M.Phil & Ph.D.) in English and Foreign Languages
- B.Ed. (English)

*Part time courses* in all foreign languages and English
*Distance mode* – MA English, PG Certificate and Diploma in the Teaching of English

## All India English Language Testing Authority (AIELTA)

An English Proficiency Certificate from The English and Foreign Languages University.

Anyone who is 16 years old can take the test

AIELTA certification helps in

- better employment opportunities
- career advancement
- admission to a professional/academic course

Test will be conducted on **7 March 2010** in Hyderabad, Vijayawada, Visakhapatnam,

Applications can be downloaded from *www.efluniversity.ac.in*
*Last date for receipt of applications* : **February 22, 2010**
Contact Nos. : 040-27689447/26689600